
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, ,Tadepalligudem, Srikakulam
15-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 164 పేజీలు: 12 వెల: 6.50

ఇక నిమిషకు రక్ష 'బ్లడ్ మనీ' ఒక్కటే
పగలు తేనెలూరే మాటలు.. రాత్రి బాంబు దాడులు
5లో



## అలనాటి మేటి నటి, 'పద్మభూషణ్'
# బి. సరోజాదేవి ఇక లేరు
### తెలుగు, కన్నడం, హిందీలోనూ అధిక చిత్రాలు

**బెంగళూరు, జులై 14:** బహుభాషా నటి బి. సరోజాదేవి వృద్ధాప్యసమస్యలతో సతమతం అవుతూ కన్ను మూసారు. మల్లేశ్వరంలోని తన నివాసంలో ఆమె స్పృహ కోల్పోయి ఉన్న స్థితిలో ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు ఆమె చనిపోయినట్లు ప్రకటించారు. కన్నడ,తెలుగు, తమిళం, హిందీ భాషాల్లో సుమారు 200కిపైగా చిత్రాల్లో సరోజాదేవి నటించారు. చతుర్భాషా తారే (నాలుగుభాషల నటి) అన్న టైటిల్‌ను మొట్ట మొదటి కన్నడ నటిగా ఆమె గెలిచారు. 1953లో ఆమె మొదటి సారిగా శ్రీరామ పూజాచిత్రంతో రంగప్రవేశంచేసారు. మహాకవి కాళిదాస చిత్రంతో ప్రాచుర్యం >>2



## గోవా గవర్నర్‌గా
# అశోక్ గజపతిరాజు
### హర్యానా, లడఖ్‌కూ కొత్త గవర్నర్ల నియామకం

**విజయవాడ.జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** టిడిపి సీనియర్‌నేత, కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. మూడురాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. హర్యానా గవర్నర్‌గా ఆషిమ్ కుమార్ ఘోష్ నియమితలయ్యారు. లడాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మిశ్రా రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయనస్థానంలో కవీందర్ గుప్తాను నియమించారు. ఈ మేరకురాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. వారు బాధ్యతలు స్వీకరించిన తేదీల నుంచే ఈ నియామకాలు అమలులోకి >>2

## జల వివాదాలపై రేపు
# చంద్రబాబు,రేవంత్ భేటీ
### కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో చర్చలు


**విజయవాడ,జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లోని జల వివాదాలపై చర్చించి, పరిష్కరించే దిశలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడుగులు ముందుకు వేసింది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్ట్‌తో సహా జలవనరులకు సంబంధించి వివిధంశాలపై చర్చించేందుకు ఏపీ,టీజీ సీఎం ఆహ్వానం పంపించింది. ఈ 16న మధ్యాహ్నాం రెండున్నర గంటలకు దిల్లీలోని శ్రాంశక్తిభవన్ వేదికగా నిర్వహించనున్న సమావేశానికి వచ్చేందుకు వీలవుతుందా?లేదా? అనేది తెలియజేయాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఇద్దరు ముఖ్యమంత్రులను కోరింది. ఇందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ బేటీ జరిగితే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం, బుధవారం దిల్లీలో పర్యటించనున్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి 16, 17 తేదీల్లో దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం.

ఇద్దరు సీఎంలు 16వ తేదీ దిల్లీలోనే ఉంటారు. ఈ తరుణంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సమావేశానికి ఇద్దరూ వచ్చేందుకు వీలవుతుంది, లేనిదీ తెలియజేయాలని సమాచారం పంపించింది. అలాగే చర్చించాల్సిన జల అంశాలకు చెందిన అజెండా వివరాలను కూడా ముందుగానే తమ మంత్రిత్వశాఖకు పంపాలని కూడా సూచించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన కేంద్రజలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో భేటీ అయ్యారు.

పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్ చేయాలని, పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరుతూనే పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 200టీఎంసీల వరద నీరు గోదావరిలోని పోలవరం నుంచి బనకచర్లకు పంపేందుకు లింక్ కెనాల్‌ఏర్పాటుపై చర్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఏపీకరువు రహితంగా మారడంతో పాటు 80లక్షల మందికి తాగునీరు అందిస్తుందని వివరించారు. 3లక్షల హెక్టార్ల నూతన ఆయకట్టు ఏర్పడుతుందని అన్నారు. 9.14 లక్షల హెక్టార్లకు ఆయకట్టు స్థిరీకరణ జరుగు >>2

# ఫైబర్‌నెట్‌ను గాడిన పెడదాం

### వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత ప్రభుత్వం
### కొత్త విధానాలతో కనెక్షన్లు పెంచుకోవాలి
### భారత్ నెట్‌తో ఫైబర్‌నెట్ అనుసంధానం
### సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, జూలై 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 2014-19 మధ్య తీసుకువచ్చిన ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టును గత ప్రభుత్వ సర్వనాశనం చేసిందని. దీన్ని తిరిగి గాడిలో పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో అన్నారు. సంస్థ ముందున్న సవాళ్లు, ఆర్థిక సమస్యలు, ఫైబర్ నెట్‌ను పూర్తి స్థాయిలో గాడిన పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కొత్త పాలసీ నిర్ణయాలపై సోమవారం సచివాలయంలో అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు.ప్రజలకు, విద్యార్థులకు, ప్రభుత్వ విభాగాలకు ఉపయోగపడాల్సిన వ్యవస్థను గత ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం వాడుకుందని దీంతో ఫైబర్ నెట్ ప్రాజెక్టు లక్ష్యం దెబ్బతిందని సిఎం అన్నారు. 2019లో 8.70 లక్షల కనెన్షన్‌లు ఉండగా వైసీపీ ప్రభుత్వంలో వాటి సంఖ్య 4.50 లక్షలకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం అని సిఎం గుర్తు చేశారు.

నాడు కేవలం 130 మంది ఉద్యోగులతో సంస్థను అద్భుతంగా నడిపామని సీఎం చంద్రబాబు అన్నారు. 8 లక్షలకు పైగా కనెక్షన్లు ఇచ్చాం, కానీ వైసీపీ ప్రభుత్వం తన పార్టీ కార్యకర్తలకు ఉద్యోగుల కోసం సంస్థలో లేని పోస్టులు సృష్టించింది. 130 మంది ఉద్యోగులను 1,350కి పెంచి దోచుకుంది. ప్రభుత్వ వ్యవస్థల్లో వందల,వేల మందిని నియమించి పార్టీ కోసం పని చేయించుకునే కొత్త తరహా అవినీతికి గత ప్రభుత్వం పాల్పడింది. దీనికి కారణమైన వారిని గుర్తించాలి. నాటి నియామకాలపై విచారణ జరిపి అన్ని వివరాలు వెలుగులోకి తీసుకురావాలి. ఇదే సమయంలో నాటి తప్పులను సరిదిద్ది భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి అని సిఎం అన్నారు. ప్రస్తుతం 4,53,525 వరకు ఉన్న కనెక్షన్లను, తిరిగి 8 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని సిఎం సూచించారు. భారత్‌నెట్‌తో ఏపీ ఫైబర్ నెట్‌ను అనుసంధానించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా ఏపీ ఫైబర్‌నెట్‌కు 2025నుండి 2035 వరకు రూ.1,900కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల్లోని 1,692 గ్రామ పంచాయతీల ఫైబర్ నెట్‌వర్క్‌ను లీనియర్‌నుంచి రింగ్ ఆర్కిటెక్చర్‌కు మార్చేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. 480 కొత్త గ్రామ పంచాయతీలకు రింగ్ ఆర్కిటెక్చర్‌తో కనెక్టివిటీ కల్పిస్తారు. ఇందుకోసం మొత్తం రూ.430 కోట్లు కేంద్రం ఇస్తుంది. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఒక ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

రాష్ట్ర స్థాయి పెట్టుబడి వ్యయం, నిర్వహణ వ్యయం పైనా సమీక్షలో ముఖ్యమంత్రి చర్చించారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో కనెక్షన్ల తగ్గుదలకు గల కారణాలను విశ్లేషించారు. 2014-19లో రూ. 149కి ట్రిపుల్ ప్లే (ఫోన్ + ఐపిటీవీ + ఇంటర్నెట్) ద్వారా 150 ఛానెళ్లతో సేవలు అందించగా, 2019-24లో >>2



## మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డికి
# 14 రోజుల రిమాండ్

**గూడూరు, జూలై 14, ప్రభాతవార్త:** అక్రమ మద్యం కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి 14 రోజులు రిమాండ్ విధించారు. సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసులు భారీ బందోబస్తు నడుమ గూడూరు అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపరిచారు. సుమారు గంటపాటు ఈ కేసుకు సంబంధించి న్యాయమూర్తి సులోచనారాణి వాదనలను విని 14రోజులపాటు రిమాండ్ విధించారు. ప్రభుత్వం తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ, గోవర్ధన్ రెడ్డి తరుపున న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వరెడ్డి వాదించారు. ఇప్పటికే గోవర్ధన్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, అక్రమ మైనింగ్ కేసు విషయంలో ఇతను నెల్లూరులోని జిల్లా జైలులో రిమాండ్లో ఉన్నారు. గోవర్ధన్ >>2

# అక్రమ మద్యానికి ఇక చెక్
### లిక్కరు పాలసీలో పారదర్శకత, ఎక్కడా లేని విధంగా మద్యం ధరల తగ్గింపు: సిఎం చంద్రబాబు

**అమరావతి,జూలై 14:** మద్యం విధానంలో పారదర్శకతే ప్రధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎలాంటి రాజీ లేదని ఆయన తేల్చి చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో అబ్కారీ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్రాండ్ల విక్రయాలన్నీ నిలిపివేయాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యత ఉన్న మద్యం విక్రయాలు మాత్రమే జరగాలని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటు సారా విక్రయాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజారోగ్యంపై ప్రభావం పడకుండా నాణ్యమైన మద్యాన్ని మాత్రమే విక్రయించేలా చూడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నకిలీ బ్రాండ్ల విక్రయాలు ఆంధ్రప్రదేశ్ లో




సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

జరిగాయని తద్వారా ప్రజల ఆరోగ్య పాడైందని అన్నారు. నకిలీ మద్యం బ్రాండ్ల కారణంగా ట్రేడ్ డైవర్ట్ అయ్యిందని తద్వారా రాష్ట్రం ఆదాయం కోల్పోయిందని అన్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతిందని సీఎం అన్నారు. 2014 నుంచి 19 మధ్య అమలైన మద్యం పాలసీ ఎలా ఉంది. గత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన విధానం పై అధ్యయనం చేసి నివేదికను ప్రజల ముందు ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన నూతన మద్యం పాలసీతో ఏపీ రెవెన్యూ పెరిగిందని స్పష్టం చేశారు. గతంలో పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిన ఆదాయం ఇప్పుడు రికవరీ వచ్చిందని అన్నారు. గతంలో జే బ్రాండ్ల కారణంగా గంజాయికి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ప్రజారోగ్యంపై తీవ్రంగా ప్రభావం పడిందని అన్నారు. అలాగే స్వార్థం కోసం గత పాలకులు తెచ్చిన >>2

### నాలుగు విమానాశ్రయాల అభివృద్ధికి
# వెయ్యి కోట్ల రుణం

**విజయవాడ,జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా నాలుగు విమానాశ్రయాల అభివృద్ధికి రూ.1000 కోట్లు రుణం తీసుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది చేసింది. హడ్కో ద్వారా తీసుకోనున్న వెయ్యి కోట్ల రుణానికి ప్రభుత్వం హామీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తూ ఆదేశాలిచ్చింది.కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాల అభివృద్ధి కోసం ఈ రుణాన్ని వినియోగించనున్నారు. భూసేకరణ, మౌలిక సదుపాయాల ఖర్చులు, వయబులిటీ గ్యాప్ ఫండ్, అత్యవసర వినియోగం కోసం రుణాన్ని వినియోగించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర మౌలిక సదుపాయాలు,పెట్టుబడి విభాగం కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం 7 విమానాశ్రయాలు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం విమానాశ్రయాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. కర్నూల్ ఎయిర్‌పోర్టు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా పుట్టపర్తిలో ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్ ఉంది. వీటికితోడు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మరో 7 కొత్త ఎయిర్ పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తుని అన్నవరం, ఒంగోలులో నూతన ఎయిర్ పోర్టులను నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు ఎయిర్‌పోర్టుల విస్తరణ, నిర్మాణం, కొత్త విమానాశ్రయాల కట్టడంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా నేడు కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాల అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల రుణం తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఏపీలో రెండు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణానికి సర్కార్ సన్నాహాలు ప్రారంభించింది. వీటిలో ఒకటి రాజధాని అమరావతిలో కాగా, మరొకటి శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఇందుకు సంబంధించి ప్రీఫీజిబిలిటీని పరిశీలించేందుకు సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక (టీఈఎఫ్ఆర్) రూపొందించేందుకు కన్సల్టెంట్ల నియామకానికి ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీ) టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి చేసింది. అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు ఏ ప్రాంతం అనుకూలమో కూడా కన్సల్టెన్సీ సంస్థే సూచించాలని నిబంధనల్లో తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో విమానాశ్రయాన్ని ఈశాన్య దిశలో, నగరానికి 70 కిలోమీటర్ల దూరంలో, సముద్ర తీరానికి సమీపంలో నిర్మించనున్నట్లు ఏపీఏడీసీ వివరించింది. ఈ రెండు ఎయిర్‌పోర్టుల నిర్మాణం, నిర్వహణను ప్రభావితం చేసే సాంకేతిక, ఆర్థిక అంశాలను కన్సల్టెన్సీ సంస్థలు గుర్తించాలని పేర్కొంది. తాజా >>2

# అంతరిక్షం నుండి నేడు భూమిపైకి శుక్లా



### మిగిలిన వ్యోమగాములతో కాలిఫోర్నియాకు రాక
### వ్యోమనౌక అన్‌డాకింగ్ సక్సెస్

**న్యూయార్క్,జూలై 14:** యాక్సిఎం-4 మిషన్‌కింద అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశుశుక్లా మరో ముగ్గురు వ్యోమగాములు మరికొన్ని గంటల్లోనే భూమికి చేరుకోనున్నారు. అంతరిక్ష కేంద్రంతో శుభాంశుబృందాన్ని తీసుకువస్తున్న డ్రాగన్ వ్యోమ నౌక అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతం అయింది. పలు కసరత్తుల అనంతరం >>2

## ఎపి స్పేస్ పాలసీని ప్రకటించిన సర్కార్

**విజయవాడ,జూలై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ (4.0)ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతరిక్ష ప్రాజెక్టుల విభాగంలో పెట్టుబడులను ఆకర్షించే వీలుగా ఈ పాలసీని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెట్టుబడిదారులకు సాయం అందించేందుకు ఎపి స్పేస్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించింది. పాలసీలో రాష్ట్రంలో స్పేస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుకూల అంశాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్ బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఒక స్పేస్ సిటీని అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపింది. ఇది అంతరిక్ష రంగంలో పరిశోధన, డిజైన్, ఆవిష్కరణ, నమూనాల తయారీకి కేంద్రంగా మారుతుందని పేర్కొంది. తిరుపతి జిల్లాలోని కాళహస్తి సమీపంలో స్పేస్ సిటీని ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపింది. ఈ రంగంలో మైక్రో, స్మాల్, మీడియం ప్రాజెక్టులకు ఇచ్చే సబ్సిడీ వివరాలను పాలసీలో పేర్కొంది. విద్యుత్ సబ్సిడీ, 100శాతం ఎస్‌జిఎస్‌టి, >>2

# తగలబడిందా! తగలబెట్టారా?
### తిరుపతిలో మంటల్లో హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలు
### ఒకబోగీ పూర్తిగా దగ్ధం.. రెండు బోగీలకు పాక్షికంగా నష్టం
### రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ప్రమాదం



మంటల్లో దగ్ధమైన హిసార్ ఎక్స్‌ప్రెస్‌రైలుబోగీ, మంటలు అదుపుచేస్తున్న రైల్వే సిబ్బంది

**తిరుపతి,జూలై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వేచరిత్రలోనే ఇంతవరకూ ఎన్నడూ జరగని రీతిలో సోమవారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌కు సమీపంలోని చింతలచేనుప్రాంతంలో పట్టాలపై షంటింగ్‌లో (పూర్తిగా ఆగిపోయిన)ఉన్న హిసార్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌రైలు (04717)బోగీల్లో మంటలు వ్యాపించాయి. రైలు ఇంజిన్‌కూడా ఆపివేసిన సమయంలో అకస్మాత్తుగా మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగడంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొంది. మంటలు ఒక్కసారిగా భారీగా వ్యాపించడంతో హిసార్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌కు వెనుకనే ఉన్న స్లీపర్‌క్లాస్ బోగీల్లో ఒకటి పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న మరో రెండు బోగీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ రైలుకు పక్కనే మరో పట్టాలపై ఆగిఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌వైపు మంటలు వ్యాపించాయి.అయితే అక్కడ రైల్వేసిబ్బంది అప్రమత్తమై అగమేగాలపై అగ్నిమాపకపరికరంతో మంటలు పూర్తిగా ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే రాజస్థాన్ నుండి వచ్చే హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులను సోమవారం ఉదయం 11.50 >>2

## ద.మ. రైల్వే అదనపు జిఎంగా
# సత్య ప్రకాష్
### సిఎఒ కన్‌స్ట్రక్షన్ రణధీర్‌రెడ్డి
### రైల్వే బోర్డు ఆదేశాలు జారీ

**గుంతకల్లు రైల్వే, జూలై 14,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా భారతీయ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్ క్యాడర్‌కు చెందిన సత్యప్రకాష్‌ను, నిర్మాణాల విభాగం ముఖ్యపరిపాలన అధికారిగా ఎం. రణధీర్‌రెడ్డిలను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే సోమవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం అదనపు జీఎంగా పనిచేస్తున్న నీరజ్ అగర్వాల్ ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో ఆయన స్థానంలో సిఏఓ కన్స్‌ట్రక్షన్స్‌గా పనిచేస్తున్న సత్యప్రకాష్‌ను అదనపు జీఎంగా నియమించారు. >>2



సోమవారం ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో శివభక్తులు 'కన్వర్ యాత్ర' నిర్వహించిన దృశ్యం

### నివాసాల నిర్మాణం కోసం రూ.524.70 కోట్లకు

# పరిపాలనా అనుమతి

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల (ఐఎఎస్) అధికారుల నివాసాల కోసం 18 టవర్లలో ఇంకనూ చేపట్టాల్సిన పనుల కోసం రూ.524.70 కోట్లు మొత్తానికి పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 12 అంతస్తుల భవనంలో 432 అపార్ట్‌మెంట్ యూనిట్లతో కూడిన బహుళ అంతస్తుల క్వార్టర్స్‌లో ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్, విద్యుత్, ప్లంబింగ్, శానిటరీ ఫిక్చర్‌లు, అగ్నిమాపక నిబంధనల అంశాలు లిఫ్ట్‌లు, భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. సిఆర్‌డిఎ ఈ పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు.ఇప్పటికే ఈ నివాస భవనాల నిర్మాణం చాలా వరకు పూర్తయింది. ఏపీ అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస భవనాలను పరిశీలించారు.త్వరలో ఇవి అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు.

# సరోజాదేవి ఇకలేరు

>> పొందారు. కన్నడభాషలోని మొట్టమొదటి రంగుల చిత్రం అమరశిల్పి జకనాచారిలో హీరోయిన్‌పాత్రను పోషించి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే స్వాతంత్ర్య సమరయోదుడు కిట్టూర్ రాణి చెన్నమ్మ పాత్రపోషించి శక్తివంతమైన హీరోయిన్‌గా నిలిచారు. తమిళంలో సరోజాదేవి జగమెరిగిన నటిగా గుర్తింపుపొందారు.ఎంజి రామచంద్రన్‌తో 26 చిత్రాల్లో నటించారు. అలాగే శివాజీ గణేశన్, జెమిని గణేశన్‌లతోకూడా అనేక చిత్రాల్లో ఆమె కీలకపాత్రలుపోషించారు. ఇక తెలుగు భాషాపరంగాచూస్తే అక్కినేని నాగేశ్వరరావు,ఎన్టీరామారావులతో అనేక సినిమాల్లో కలిసి పనిచేసారు. దిలీప్‌కుమార్, రాజేంద్రకుమార్, షమ్మికపూర్, సునీల్‌దత్ వంటి ప్రముఖ హిందీనటులతో కలిసి నటించిన సరోజాదేవి మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటు అని ఆమె అభిమానులు పేర్కొంటున్నారు. చలనచిత్ర నటనా రంగంలోసరిహద్దులు చెరిపేసిన చతుర్భాషా నటిగా ఆమెకు బిరుదు లభించింది. 1967లో శ్రీహర్షనను వివాహంచేసుకున్నారు. ఆయన 1986లో చనిపోయారు.ఆమెకు ఇద్దరు పిల్లలు. భారత ప్రభుత్వంనుంచి 1969లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. వొక్కలింగ కుటుంబంలో నాలుగో కుమార్తెగా ఆమె జనినమంచారు. మైసూర్‌పోలీస్ అధికారి భైరప్ప,రుద్రమ్మలకు ఆమె జన్మించారు.

# నేడు భూమిపైకి

>> భూవాతావరణంలోకి ప్రవేశిస్తున్నది. ఈ వ్యోమనౌక 21 గంటలు ప్రయాణించి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్రజలాల్లో దిగుతుంది. అనంతరం వారిని అక్కడినుంచి క్వారంటైన్‌కు తరలిస్తారు. సుమారు వారంరోజులపాటు వ్యోమగాములు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలోనే ఉంటారు. యాక్సియం-4 మిషన్‌లోభాగంగా శుభాంశు బృందంగత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. 28 గంటలప్రయాణం తర్వాత ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. సుమారు 18 రోజులపాటు ప్రయోగాలుచేసిన ఈబృందం మంగళవారం భూమికి చేరుతోంది. ఖగోళంలోని జీరోగ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగేనష్టంపై శుక్లా అధ్యయనంచేసారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక విడియోను భారత విద్యార్థులకోసం రూపొందించారు. మానసిక ఆరోగ్యంపైనే పలు అధ్యయనాలు చేసారు.



# పోరాడి ఓడిన భారత్

### 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌దే విజయం

**లార్డ్స్(లండన్), జులై 14:** ఇంగ్లండ్ వేదికగా లార్డ్స్ మైదానంలో ఉత్కంఠ భరితంగా సాగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. 22 పరుగుల తేడాతో భారత్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. టీమిండియా తరఫున ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చేసిన ఒంటరి పోరాటం వృథా అయ్యింది. ఈ మ్యాచ్‌లో విజయంతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 21 తేడాతో ఆధిక్యంలోకి ఉన్నది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని జట్టు లీడ్స్ టెస్ట్‌లో భారత్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. శుభ్‌మన్ నేతృత్వంలోని భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 336 పరుగుల తేడాతో గెలిచింది. లార్డ్స్ టెస్ట్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పది వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. జోరూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడాన్ కార్స్ (21) పరుగులు చేశారు. టీమిండియా సైతం తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 పరుగులకు కుప్పకూలింది. టీమిండియాకు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారతజట్టు కేవలం 170పరుగులకే ఆల్ అవుట్‌అయ్యింది. రవీంద్ర జడేజా (61నాటౌట్), కేఎల్ రాహుల్ (39) మినహా ఎవరూ రాణించలేదు. జడేజా బుమ్రా, సిరాజ్‌తో కలిసి టీమిండియాను గెలిపించేందుకు కష్టపడ్డా అతని శ్రమ అంతా వృథా అయ్యింది. 74.5 ఓవర్‌లో షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ అవుట్ అవడంతో టీమిండియా పోరాటం ముగిసింది. షోయబ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ,బంతి బ్యాట్‌పై నుంచి క్రీజులో పడి స్టంప్స్‌ను తాకింది. బంతి వికెట్లను తాకడంతో సిరాజ్ సైతం షాక్‌కు గురయ్యాడు. దాంతో ఇంగ్లండ్ ప్లేయర్స్ సంబరాల్లో మునిగిపోగా టీమిండియా ప్లేయర్స్ అంతా షాక్ అయ్యారు. ఇక ఇంగ్లండ్‌భారత్ మధ్య నాలుగో టెస్ట్ ఈనెల 23,27 తేదీల మధ్య మాంచెస్టర్‌లో ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరుగుతుంది.

## ప్రముఖ మోడల్ సాన్‌రేచల్‌గాంధీ ఆత్మహత్య

**పుదుచ్చేరి,జులై 14:** పుదుచ్చేరికి చెందిన ప్రముఖ మోడల్, సోషల్ మీడియా పర్సనాలిటీ సాన్ రేచల్ గాంధీ (26) ఆత్మహత్య చేసుకున్నారు. ఏడాది క్రితం వివాహం చేసుకున్న రేచల్ పుదుచ్చేరి కారామణికుప్పంలోని ఆమె నివాసంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. భారతీయ సినిమా, ఫ్యాషన్ పరిశ్రమలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించడంలో రేచల్ ముందున్నారు. 2022లో ఆమె మిస్ పుదుచ్చేరి టైటిల్‌ను గెలుచుకున్నారు. అలాగే మిస్ బెస్ట్ యాటిట్యూడ్ 2019, మిస్ డార్క్ క్వీన్ తమిళనాడు 2019,క్వీన్ ఆఫ్ మద్రాస్ 2022 వంటి అవార్డులను కూడా సొంతం చేసుకున్నారు. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి, లెక్కకు మించిన అప్పుల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సాన్ రేచల్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, భారీ అప్పుల కారణంగా ఆమె మానసిక ఒత్తిడిలో ఉన్నట్టు అనుమానిస్తున్నారు. ఫ్యాషన్ షోలు నిర్వహించడంలో జరిగిన నష్టాలు ఈ ఆర్థిక సమస్యలకు దారితీసినట్టు తెలుస్తోంది. ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్టు ఆమె సోషల్‌మీడియా పోస్టులు సూచిస్తున్నాయి. ఇది ఆమె మానసిక ఒత్తిడిని మరింత పెంచి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించినట్టు తెలిసింది. అయితే దాని గురించి ఇంకా వివరాలు వెల్లడి కాలేదు. పుదుచ్చేరి తహసీల్దార్ ఈ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ చేశారు. రేచల్ గతేడాది వివాహం చేసుకున్న నేపథ్యంలో ఈ ఆత్మహత్యకు ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు.

# ఫైబర్‌నెట్‌ను గాడిన పెడదాం

>> నెల వారీ చార్జీలను రూ.350కి పెంచడంతో పాటు నాణ్యత లేని ప్రసారాలు అందించడం వల్ల కనెక్షన్లు తగ్గినట్టు అధికారులు తెలిపారు. ఫైబర్ నెట్‌కు సెట్ టాప్ బాక్స్ సరఫరాదారుల ఎంపికను తక్షణమే పూర్తి చేయాలని, కొత్త బాక్స్‌లను తీసుకున్న స్థానిక కేబుల్ ఆపరేటర్ తో ఆదాయానికి సంబంధించిన విధానాన్ని పునఃసమీక్షించాలని సూచించారు. దూర ప్రాంతాల్లో సెట్ టాప్ బాక్స్ సరఫరా కోసం ప్రైవేట్ సంస్థలను కూడా భాగస్వాములుగా తీసుకోవాలని అన్నారు. వర్చువల్ క్లాస్ రూమ్ వంటి సేవలను తిరిగి ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ ఫైబర్ నెట్, భారత్ నెట్ నెట్‌వర్క్ నిర్వహణ కోసం కాంట్రాక్టర్‌ను నియమించాలని నిర్దేశించారు. ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ ఏజెన్సీగా నియమించాలని చెప్పారు. ఇది మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఏపీ ఫైబర్ నెట్ సామర్థ్యాన్ని వినియోగించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాబోయే కేబినెట్ సమావేశంలో సమర్పించాలని స్పష్టం చేశారు. జూన్ 2024 నుంచి జూన్ 2025 వరకు రూ. 192.5 కోట్లు పెట్టుబడి వ్యయం కింద , రూ. 66.76 కోట్లను నిర్వహణా వ్యయం కింద చెల్లింపులకు నిధులు విడుదల చేయగా, భారత్ నెట్ ఫేజ్ 2లో భాగంగా రూ. 67.14 కోట్ల కేంద్ర నిధులు అందాల్సి ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 12,946 గ్రామ పంచాయతీలకు ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించడం జరిగింది. 104 ప్రభుత్వ సంస్థలుకార్యాలయాలకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం 5 ప్యాకేజీల రూపంలో గృహాలకు ఫైబర్ నెట్ కనెక్షన్లు అందిస్తున్నారు. 21,000 కంటే ఎక్కువ సంస్థలు హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్‌ను పొందుతున్నాయి. 175 టెలికాం టవర్స్ తో లింక్ చేశారు. దీనిని మరింత అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 442 ఉద్యోగులు, అధికారులు ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్నారు. ఫైబర్ నెట్ విస్తరణలో దేశంలోనే టాప్ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 78,355 కి.మీ. మేర ఫైబర్ నెట్ విస్తరించగా, మొత్తం 2 లక్షల కి.మీ. మేర ఫైబర్ నెట్ లైన్ వేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఫైబర్ నెట్ విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ముందుంది.ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 50,481 కి.మీ., తమిళనాడు 49,616 కి.మీ., గుజరాత్ 35,246 కి.మీ., తెలంగాణ 29,143 కి.మీ. మేర ఫైబర్ నెట్ కలిగి ఉన్నాయి.

# తగలబడిందా! తగలబెట్టారా?

>> గంటల సమయంలో స్టేషన్‌లో దించేసిన తరువాత కొంతదూరం ముందుకెళ్లి పట్టాలపై ఆగింది. అక్కడ నుండి వెనక్కు రైల్వే గ్యారేజీ వైపు షంటింగ్‌కు రావల్సిన రైలుబోగీల్లో మధ్యాహ్నం 1.30-2గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే సమయంలో సమాంతర ట్రాక్‌పై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లేసమయంలోనే ఇలా జరగడంతో సిబ్బంది అప్రమత్తతతో స్పందించి ఆ రైలును స్టేషన్‌లోనే కొద్దిసమయం ఆపేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో అక్కడకు చేరుకుని రైల్వే సిబ్బంది, స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. రైలు బోగీల్లో ప్రయాణీకులు ఎవరూ లేపోకవడంతో పెద్దప్రాణ నష్టం తప్పింది. సకాలంలో మంటలను అదుపుచేయడంతో ఇతర బోగీలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే ఇంజిన్‌ను బోగీల నుండి తప్పించారు. కొంతసమయం తరువాత మరో ట్రాక్‌పై వందేభారత్ రైలుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బయలుదేరింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 5.30గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్ నుండి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు యధావిధిగా బయలుదేరింది. **ప్రమాదమా!నిర్లక్ష్యమా!?:** ఇదిలా ఉండగా తిరుపతి రైల్వేచరిత్రలోనే ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదనేది రైల్వేవిభాగం వర్గాల సమాచారం. మధ్యాహ్నం రాజస్థాన్ హిసార్ నుండి తిరుపతిరైల్వేస్టేషన్‌కు వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులను దించేసింది. ఆ తరువాత కొంతదూరం పట్టాలపై రేణిగుంట మార్గంలో చింతలచేను ప్రాంతం వరకు ముందుకెళ్ళింది. అక్కడ పూర్తిగా రైలును ఆపిఉంచారు. ఈ సమయంలో కొద్దినిమిషాలకే బోగీల్లో మంటలు వ్యాపించడంతో ఇది ప్రమాదమేనా?లేక నిర్లక్ష్యంగా జరిగిందా అనేది రైల్వేశాఖ ఇంజనీర్లు, రైల్వే ఉన్నతాధికారులు, ఆర్‌పిఎఫ్ విభాగం దర్యాప్తు చేపడుతోంది. జనసంచారం లేని ప్రాంతంలో పట్టాలకు ఇరువైపులా నివాసముంటున్న ఇళ్ళు,అపార్టుమెంట్లు ఉన్నాయి. మంటలు బాగా వ్యాపించి ఉంటే అక్కడ వరకు వెళ్ళి పెద్దప్రమాదమే జరిగేదని అన్ని శాఖల అధికారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ సంఘటనకు మాత్రం ఆకతాయిలు పెట్రోల్ పోసి నిప్పుపెట్టారా?లేక విద్యుత్‌లైన్లలో ఏదేని సరఫరాలో సమస్యలతోనేనా అనేది విచారణలో తేలాల్సి ఉంది. కాగా మధ్యాహ్నం సమయంలో జరిగిన ఈ రైలుబోగీలకు మంటలు వ్యాపించడం మాత్రం తగలబెట్టడంతోనేనన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకరోజుకు ముందు తమిళనాడుకు సమీపంలోని తిరువళ్ళూరు వద్ద పట్టాలపై పెట్రోల్,డీజిల్ రవాణాచేస్తున్న గూడ్స్‌రైలు బోగీలు మంటలువ్యాపించి భారీగా తగలబడిన ఉదంతం తెలిసిందే. ఆ మరుసటిరోజే తిరుపతిలో ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు వ్యాపించడం సంచలనంగా మారింది. రైల్వేస్టేషన్‌లో ఉన్న ప్రయాణీకులు మంటలతో భయాందోళనకు గురయ్యారు. అయితే తిరుపతి రైల్వేస్టేషన్‌కు వచ్చే, స్టేషన్‌నుండి వెళ్ళే రైళ్ళకు ఎలాంటి అంతరాయం లేదని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ళ సమయంలోనూ మార్పులేదని, ఎలాంటి ఆలస్యం లేదని వెల్లడించారు.

## నాలుగు విమానాశ్రయాల అభివృద్ధికి వెయ్యి కోట్ల రుణం

>> మార్గదర్శకాలకు అనుగుణంగా విమానాశ్రయాల నిర్మాణానికి కాన్సెప్ట్ మాస్టర్‌ప్లాన్, ఫైనాన్షియల్ మోడల్, ప్రాజెక్ట్ స్ట్రక్చర్లను సిద్ధం చేయాలని తెలిపింది.

## ఎపి స్పేస్ పాలసీని ప్రకటించిన సర్కార్

>> స్టాంపు డ్యూటీ మినహాయింపు, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ సబ్సిడీలు ఇవ్వనున్నట్లు పాలసీలో ప్రకటించింది. భూములు కేటాయించడం, ఇన్‌టివ్‌లను ఇవ్వనున్నట్లు తెలిపింది.

# సామాన్యులకు సైతం డ్రోన్ సేవలు

### డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. డ్రోన్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ను సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. డ్రోన్ మార్ట్ ద్వారా వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేందుకు పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పోరేషన్ రూపొందించింది. ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ద్వారా వ్యవసాయం, ఇన్ఫ్రా, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు. రైతులు తమ పొలాల్లో మందులు పిచికారీ చేయాలంటే డ్రోన్లు వినియోగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా పంటల పర్యవేక్షణ కూడా చేపట్టవచ్చు. ఇలాంటి సేవలను పోర్టల్ ద్వారా సాధారణ రైతులూ వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఇప్పుడు అందరికీ కల్పిస్తోంది. అలాగే డ్రోన్లతో టెక్నాలజీని వినియోగించుకుని సర్వేలు చేపట్టడం, పెద్దఎత్తున పనులు చేపట్టే సందర్భంలో డ్రోన్లతో పర్యవేక్షించడం, సెక్యూర్టీ, మ్యాపింగ్ వంటి సేవలు డ్రోన్ల ద్వారా చేపట్టవచ్చు. ఈ తరహా సేవలను ఇకపై డ్రోన్ మార్ట్ ద్వారా పొందవచ్చు. డ్రోన్ మార్ట్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. డ్రోన్ సేవలు అవసరమైన వారికి సర్వీస్ ప్రొవైడర్లను డ్రోన్ మార్ట్ పోర్టల్ అందుబాటులోకి తెస్తుంది. ప్రభుత్వ విభాగాలను, వివిధ సంస్థలను, సర్వీస్ ప్రొవైడర్లను ఈ పోర్టల్ అనుసంధానం చేస్తుంది. సర్వీస్ ప్రొవైడర్లతో కస్టమర్లు సర్వీస్ ఛార్జీలపై సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులోకి తెచ్చిన సేవలతో పాటు ఈ పోర్టల్ భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. డ్రోన్ సేవలు సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండేలా చూస్తే.. మరింత ఆదరణ పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతికి నిబంధనల మినహాయింపు

### కాంట్రాక్టు ప్రొఫెసర్ల నియామకాన్ని వాయిదా వేయాలని ఆదేశించిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసి) నియమాల మేరకు కొత్త,పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసే నిమిత్తం అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించడానికి కనీస అర్హతల్లో మినహాయింపు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. సర్వీసు నియమాల ప్రకారం 3 సంవత్సరాల బోధానానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తారు.ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల కొరత ఉంది. 202526 సంవత్సరానికి వైద్య విద్య ప్రవేశాలకు ఎన్ఎంసి అనుమతి పొందడానికి ఈ కొరతను పూరించాల్సి ఉంటుంది. ఇందునిమిత్తం ఒక సంవత్సరం బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫె సర్లకు పదోన్నతి కల్పించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదించారు. ఈ సడలింపు ఈ ఒక్కసారికి మాత్రమే వర్తిస్తుంది.ఈ నిబంధన సడలింపు నేపథ్యంలో...కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలన్న గత ప్రతిపాదనను వాయిదా వేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అర్హత నిబంధన సడలింపు మేరకు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించిన అనంతరం అవసరాల మేరకు కాంట్రాక్టు ప్రొఫెసర్ల నియామకాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. విజయనగరం, పాడేరు, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మరియు నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు కొన్ని పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కూడా ప్రొఫెసర్ల కొరత ఉంది. ఈలోటును పూర్తిచేసేందుకు నిబంధనల్లో సడలింపుతో పదోన్నతులు జరుగనున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల లోటును భర్తీ చేయడానికి సర్వీసు నియమాల మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అవసరాల మేరకు పదోన్నతి కల్పించనున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరతను పూరించడానికి గతంలో చేపట్టిన వాకిన్ రిక్రూట్మెంట్ ప్రక్రియను కొనసాగించనున్నారు.



సోమవారం బెంగళూరులో మహిళలకు ఉచిత బస్ టిక్కెట్లు పంపిణీ చేస్తున్న కర్ణాటక సిఎం సిద్దరామయ్య, డి.సిఎం శివకుమార్

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

>> వస్తాయని ప్రకటనలో పేర్కొంది. **ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా** తెలుగు రాష్ట్రాల్లోని సీనియర్ రాజకీయ నేతల్లో అశోక్ గజపతిరాజు ఒకరు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఆయన విజయం సాధించారు. 1978లో తొలిసారి జనతా పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన అశోక్, ఆ తర్వాత టీడీపీలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో టీడీపీ తరఫున విజయం సాధించారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి జయకేతనం ఎగురవేసి కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో అశోక్‌గజపతిరాజు పలు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్టీఆర్ హయాంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మంత్రిగా, చంద్రబాబు హయాంలో ఆర్థిక, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. చాలా కాలంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. ఇక పూసపాటి రాజ వంశానికి చెందిన అశోక్ గజపతి రాజు విజయనగరం ఎస్టేట్ కు అధిపతి! సూర్య వంశపు ఉదయపూర్ మహారాజా వారసులు! వీరి తండ్రి విజయనగరం రాజా సాహెబ్ విజయరామ గజపతి రాజు పార్లమెంట్ సభ్యులుగా పని చేశారు. అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి విజయలక్ష్మి ప్రస్తుతం విజయనగరం టిడిపి ఎమ్మెల్యే గా ఉన్నారు! ఎన్నో భూములను పేదలకు దానం చేసిన వంశం! ఎంతో సింప్లిసిటీ జీవితం! తన కారు కూడా తనే తుడుచుకుని తనే డ్రైవింగ్ చేసుకునే అరుదైనవిలక్షణ వ్యక్తిత్వం ఆయనది. ఇక అశోక్ గజపతిరాజుకు గవర్నర్‌హోదా లభించడం స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ తమ,తమ ఎక్స్ ఖాతాల్లో అభినందించారు.

## గవర్నర్ పదవి ఊహించలేదు: అశోక్ గజపతి రాజు

**విజయనగరం, జులై 14 ప్రభాతవార్త ప్రతినిధి :** తాను గవర్నర్ అవుతానని ఊహించలేదని కేంద్ర మాజీ మంత్రి,గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. గవర్నర్ పదవి ద్వారా తన బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. సోమవారం సాయంత్రం తన బంగ్లాలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే రాజ్యాంగం, చట్ట పరిధిలోనే పని చేయాలని స్పష్టం చేశారు. వీటిని ఎవరూ ఉల్లంఘించడం, లేదా అతిక్రమించ కూడదన్నారు. ఎన్‌డిఏ కూటమి వల్లనే తనకు గవర్నర్ పదవి వచ్చిందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, కేంద్ర హోమ్‌మంత్రి అమిత్ షాతో పాటు గవర్నర్ పదవికి తన పేరు సిఫారసు చేసిన సీఎం చంద్రబాబుకి అశోక్ గజపతి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ఎప్పుడు అనే ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఇంకా నిర్ణయం తీసుకోలేదు అని చెప్పారు. ప్రోటోకాల్ తో పాటు తెలుగు సంప్రదాయం ప్రకారం ప్రమాణ స్వీకారం చేస్తానని అశోక్ స్పష్టం చేశారు. గవర్నర్ పదవి వచ్చినా విజయనగరాన్ని, రాష్ట్రాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని వీడవనని ఆయన విస్పష్టంగా పేర్కొన్నారు. ఇకపై తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని కూడా ఆయన అన్నారు.

## అక్రమ మద్యానికి ఇక చెక్

>> సొంత బ్రాండ్లు ఇప్పుడు కనిపించకుండా పోయాయని అన్నారు. ప్రజలు కూడా దీన్ని గుర్తించారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ అమలు అనంతరం అబ్కారీ శాఖ చరిత్రలో తొలిసారి మద్యం ధరలు దిగి వచ్చాయి. మద్యం పై గతంతో పోలిస్తే కనీసం రూ.10 - 100వరకూ ధరలు తగ్గినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పేద ప్రజల జేబులు కొల్లగొట్టేలా ప్రభుత్వం వ్యవహరించకూడదు, దోపిడీ ఉండకూడదు అనే ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మద్యం ధరలు తగ్గించామని సిఎం అన్నారు. ఈ కారణంగా ప్రతీ నెలా కొనుగోలు దారులపై రూ. 116 కోట్ల రూపాయల మేర భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు తో పోలిస్తే ఏపీలో విక్రయిస్తున్న టాప్ 30 బ్రాండ్ల మద్యం ధరలు తక్కువగా ఉన్నాయన్నారు.

**ఎక్సైజ్ ఐ ద్వారా డేగకన్ను పెట్టండి**

అబ్కారీ శాఖ లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసి ట్రేస్ అండ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిస్టిలరీల నుంచి బెవరేజెస్ కార్పోరేషన్ వరకూ అలాగే దుకాణాల వరకూ వాహనాల కదలికలపై రియల్ టైమ్ లో ట్రాకింగ్ మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీపీఎస్ పరికరాల ద్వారా మానిటర్ చేయాలని సీఎం స్పష్టం చేశారు.

# చంద్రబాబు, రేవంత్ భేటీ

>> తుందన్నారు. 20 టీఎంసీలు నీరు పరిశ్రమలకు అందించగలుగుతామని సీఎం చంద్రబాబు అప్పుడు పేర్కొన్నారు. ఆ తర్వాత పోలవరం బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొందరు నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు, నేతలకు సూచించారు. పోలవరంబనచకర్ల ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదన్నారు. తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదని, పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారని, ప్రజలకు వాస్తవాలు వివరిద్దామని చంద్రబాబు అన్నారు. తెలంగాణ సీఎం కూడా బనచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో ఏపీతో చర్చలు జరుపుతామని పేర్కొన్న తరుణంలో కేంద్ర జలశక్తిమంత్రి వద్ద జరగనున్న సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది.ఇరు రాష్ట్రాల నీటి వాటాల అంశాలపైనా చర్చ జరిగే వీలుంది. పోలవరంబనచర్ల అంశాలతోపాటు కృష్ణ, గోదావరి బోర్డు గురించి కూడా చర్చకు వచ్చే వీలుంది. ఇవే కాకుండా ఇరు రాష్ట్రాలు ఏయే విషయాలను అజెండాలో పొందుపరిస్తే వాటిని ప్రాధాన్యప్రకారం కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ చర్చకు తీసుకునే అవకాశం ఉంది.

## అదనపు జీఎంగా సత్య ప్రకాష్

>>అలాగే దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయంలో సిబిఇగా పనిచేస్తున్న ఎం.రణధీర్‌రెడ్డిని సిఏఓ కన్స్‌ట్రక్షన్స్‌గా నియమించారు.

## 14 రోజుల రిమాండ్

>> రెడ్డిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకురావడంతో ఇక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు. గోవర్ధన్ రెడ్డిని చూసేందుకు ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ నాయకులు భారీగా తరలి రావడంతో పోలీసులు వారిని కోర్టు బయటనే నిలిపివేశారు. కోర్టు అనంతరం గోవర్ధన్ రెడ్డిని నెల్లూరు జైలుకు తరలించారు.

## వారం - వర్జ్యం

15-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పంచమి రా.10.37
శతభిషం ఉ.6.26
వర్జ్యం : మ.12.38-2.12
దు.ఉ.9.19-9.11, రా.11.57-12.49
శుభసమయం:ఉ.7.30-8.30, సా.6.45-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు ఎదుర్కొవలసి వుంటుంది. అంతర్గత శత్రువులు అధికమై సమస్యలు సృష్టించవచ్చు.

**వృషభం :** ఎంత శ్రమించినా ఫలితం అంతంత మాత్రంగా వుంటుంది. రుణ వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలు ఆలోచించి చేపట్టడం అన్ని విధాల మంచిది. ఆరోగ్యం విషయాలలో నిర్లక్ష్యం తగదు.

**కర్కాటకం:** అనుకున్న పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**సింహం:** కీలక నిర్ణయాలలో నిదానంగా వ్యవహరించడం మంచిది, తొందరపాటు తగదు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కొత్త విద్యల పట్ల ఆసక్తి చూపుతారు.

**తుల :** దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ఇంటా బయటా మీదే పై చేయిగా వుంటుంది.

**వృశ్చికం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు. ధనలాభాలు.

**ధనుస్సు:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. రెండు, మూడు విధాలుగా డబ్బు అందుతుంది.

**మకరం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం.

**మీనం :** సన్నిహితులు నుండి సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టిటిడిలో మరో అన్యమత అధికారి



- తన కారుపైనే ఏకంగా అన్యమత ప్రార్థన వాక్యాలు
- క్వాలిటీకంట్రోల్ డిఇఇగా గుర్తింపు

**తిరుపతి,జూలై 14ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమతాన్ని ఆచరించే మరో అధికారి ఏకంగా తనకారుపైన అన్యమతప్రార్థ నల వాక్యాలు రాసుకోవడం,చేతిలో ఆ మత గ్రంథాన్ని పెట్టుకుని అందరూ మతాన్ని ఆచరించాలని బెదిరించడం వెలుగుచూసింది. వారంరోజుల క్రిందట తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో మార్కెటింగ్ విభాగం వేలం విధులు నిర్వహించే అసిస్టెంట్ కార్యనిర్వహణాధి కారి(ఎఇఒ) రాజశేఖరబాబు అన్యమతాన్ని ఆచరిస్తున్నాడని, ప్రార్థనలకు హాజరవుతున్నాడనే సాక్ష్యాధారాలతో సస్పెండ్‌కు గురయ్యాడు. తాజాగా టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇలియాజర్ అన్యమతాన్ని ఆచరిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన సోమవారం కర్నూలు లోని టిటిడి కల్యాణమండపంలో జరుగుతన్న పనుల పర్యవేక్షణకు క్వాలిటీ కంట్రోల్ అధికారిగా వెళ్ళడంతో అతని తీరుపై అనుమానాలు వెల్లువెత్తాయి. అంతేగాక ఆయన ప్రయాణించిన కారుపై తాను అన్యమతస్థుడని, ఆ మతాన్ని ఆరాధించాలని చెప్పే ప్రచారం చేసుకునే స్టిక్కర్లు వేసుకోవడం సంచలనంగా మారింది. అంతేగాక ఆయన చేతిలో ఆ మతానికి చెందిన గ్రంథాన్ని పట్టుకుని మీరు దీన్ని చదవాలని చెప్పాడని ఆరోపణలు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇది నా వ్యక్తిగతమని ఘాటుగా సమాధానమిస్తాడని తెలిపారు. ఈ విషయంపై సోమవారం మధ్యాహ్నం బిజెపి రాష్ట్ర అధికారప్రతి నిధి, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, హిందూ సంఘాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. వెంటనే అన్య మత అదికారిని టిటిడి నుండి తప్పిం చాలని డిమాండ్ చేశారు. అన్యమత స్థులను టిటిడి నుండి తరిమివేయాలని బలంగా వాదనలు వినిపిస్తున్నారు. అంతేగాక మాజీ ఛైర్మన్ భూమన కరు ణాకర్‌రెడ్డి అన్యమత స్థులకు వంతపాడటం ఈ నిదర్శనాలపై ఏమంటారని ఎద్దేవాచేశారు. అన్య మతస్థులను వెంటనే టిటిడి నుండి తరిమివేయాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ కంపెనీ ఏర్పాటుకు అనుమతి

- డైరెక్టర్లుగా వివిధ శాఖల ఉన్నతాధికారులు

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఎక్యూసీసీ) పేరుతో ప్రభుత్వ కంపెనీ ఏర్పాటును ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ శాఖలకు చెందిన 9 మంది అధికారులను బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. రాజధాని అమరావతి పరిధిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాసంస్థలు ,స్టార్టప్‌లు,ప్రపంచ సాంకేతిక సంస్థలు,క్వాంటం కంప్యూటింగ్,దీని సాంకేతికలపై పరిశోధన ల్యాబ్‌లకు కేంద్రంగా అమరావతిని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం అమరావతిలో 50 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. గత నెల 30న విజయవాడలో భాగస్వామ్యపక్షాలతో సమావేశం నిర్వహించి,క్వాంటం డిక్లరేషన్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఐటీ శాఖ కార్యదర్శి,ప్రత్యేక కార్యదర్శి,ఆర్థిక,పరిశ్రమలు,వ్యవసాయ,ఇంధన, వైద్యారోగ్య నైపుణ్యాభివృద్ధి,రియల్ టైం గవర్నెన్స్ శాఖల కార్యదర్శులు బోర్డులో సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది.

# తిరుమల సమాచారం

## ఆణివార ఆస్థానం ముందే కొనసాగుతున్న భక్తుల రద్దీ

- వెంకన్న దర్శనానికి 24గంటలు

**తిరుమల,జూలై 14ప్రభాతవార్తప్రతినిధి:** తమిళభక్తులకు ఎంతో పవిత్రమైె ఆణివార ఆస్థానం పర్వదినానికి ముందే తిరుమల కిటకిటలాడుతోంది. సోమవారం ఉదయానికి తిరుమలలో భక్తులు భారీగా చేరారు. ఈ రద్దీ గత మూడురోజుల నుండి కొనసాగుతోంది. వారాంతంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు వచ్చారని భావించినా సోమవారం కూడా ఈ రద్దీ కొనసాగుతోంది. వైకుంఠమ్ 1,2క్యూకాంప్లెక్స్ లు నిండిపోయి వెలుపల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయానికి స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతుండగా సాయంత్రానికి ఈ రద్దీ విపరీతంగా పెరిగింది. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు 10-12గంటలు నిరీక్షణ తప్పడంలేదు. సోమవారం సాయంత్రం వరకు 46వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. వెలుపల క్యూలైన్లలో, ఆలయంలోపల కంపార్టుమెంట్లలో శ్రీవారిసేవకులు భక్తులకు నిరంతరాయంగా పాలు,టీ, అన్నప్రసాదాలు,తాగునీరు పంపిణీ చేస్తున్నారు.



## తిరుమల క్యాంటిన్లకు ఇఓఐ గడువు మార్పు

**తిరుమల,జూలై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ఐదు పెద్దక్యాంటీన్లు, ఐదు జనతాక్యాంటీన్లు కేటాయింపుల కోసం టిటిడి ఆహ్వానించిన ఈఓఐ పత్రాల జారీ, సమర్పణ పరిశీలనకు తేదీలను మార్పుచేయడం జరిగిందని టిటిడి తెలిపింది. అనివార్యకారణాల వల్ల ఈ తేదీల్లో మార్పు చేశారు. పెద్దక్యాంటీన్లకు పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీని జూలై 15నుండి 26వతేదీ సాయంత్రం 5గంటల వరకు మార్చారు. ఈఓఐ పత్రాల సమర్పణకు 17నుండి 28వతేదీ ఉదయం 11గంటల వరకు మార్చారు. పత్రాలు తెరిచే తేదీని 28వతేదీ మధ్యాహ్నం 12గంటలవరకు మార్చారు. ఇక జనతాక్యాంటీన్ల నిర్వహణకు సంబంధించి పత్రాల డౌన్‌లోడ్ జూలై 28వతేదీ సాయంత్రం 5గంటల వరకు, పత్రాల సమర్పణను జూలై 30వతదీ ఉదయం 11గంటలవరకు మార్పుచేశారు. పత్రాల సమర్పణ జూలై 30 మధ్యాహ్నం 12గంటల వరకు మార్పుచేశారు. ఆసక్తిఉన్న దరఖాస్తుదారులు మారిన తేదీలను గమనించి తగిన విధంగా ఏర్పాట్లుచేసుకోవాలని టిటిడి తెలిపింది.

## కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ భర్తపై కేసు నమోదు

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త రాముపై గుడివాడ ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తెలుగు మహిళా నేత సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నాగవంప్పాడు వంతెన వద్ద సునీతను ఉప్పాల హారిక కారు ఢీ కొట్టింది.గాయపడిన సునీత గుడివాడ ఏరియా ఆస్పత్రిలో చేరారు. కారు ఢీకొన్న సమయంలో వాహనంలో ఉన్న రాము,వైకాపా కార్యకర్తలు తనను అసభ్యంగా దూషించారని ఆరోపించారు. సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం



**కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు సంకష్ట చతుర్థి వ్రతం మహాత్యాన్ని గురి ంచి వివరించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల భక్తులకు ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. ఆలయ అధికారులు, ఆస్థాన మండపంలో భక్తులు సకాలంలో వ్రతాన్ని నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,చిట్టిబాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వరద నిరోధానికి రక్షణ గోడ నిర్మాణం పూర్తి

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ నగరానికి గతేడాది సెప్టెంబరులో బుడమేరు వరద తీరని నష్టం కలిగించింది. భవిష్యత్తులో మళ్ళీ ఇలాంటి వరద వస్తే తమ పరిస్థితి ఏమిటనే భయం నగరవాసుల్లో కల్గింది. దీనిని తొలగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పట్లో విజయవాడ పరిధి లోని శాంతినగర్ వద్ద బుడమేరు వరద ఉధృతికి గట్టు తెగిపోయి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. అప్పట్లోనే తాత్కాలికంగా రాళ్ళు,వట్టి పోసి అడ్డుకట్ట వేసినా నీరు లీకవుతుండటంతో శాశ్వతంగా గోడ కట్టాలని నిర్ణయించారు. మేలో రూ.28 కోట్ల అంచనాతో 11 మీటర్ల లోతు నుండి గట్టుపై 8.6 మీటర్ల ఎత్తు,500 మీటర్ల పొడవునా గోడను నిర్మించే పనులు ప్రారంభించి రికార్డు స్థాయిలో పూర్తి చేశారు.

## భూమిలేని కుటుంబాలకు పింఛన్ పునరుద్ధరణ

విజయవాడ,జులై 14,ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి ప్రాంతంలో భూమి లేని 1,575 పేద కుటుంబాలకు ప్రభుత్వం పింఛన్లు పునరుద్ధరించింది. గృహ సర్వే ఆధారంగా వీరిని అర్హులుగా నిర్ధారించి, పింఛన్ వర్తింపచేయాలని సీఆర్‌డీఏకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వంలో వీరందరినీ వివిధ కారణాలతో అనర్హులుగా ప్రకటించి పింఛన్లు నిలిపివేశారు.

## విజయవాడలో జూలూరు గౌరీశంకర్ బహుజనగణమన దీర్ఘ కావ్యం ఆవిష్కరణ



విజయవాడలో సుప్రసిద్ధ కవి జూలూరు గౌరీశంకర్ బహుజనగణమన దీర్ఘ కావ్యం ఆవిష్కరణ దృశ్యం

**విజయవాడ, జూలై14,ప్రభాత వార్తప్రతినిధి:** రాజకీయ, ఆర్థిక, సామాజిక, న్యాయరంగాలలో బీసీలకు జరుగుతున్న అన్యా యాన్ని ప్రశ్నిస్తూ సుప్రసిద్ధ కవి జూలూరు గౌరీశంకర్ రాసిన బహుజనగణమన దీర్ఘ కావ్యాన్ని సోమవారం విజయవాడ తుమ్మల పల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద వున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ ఆవిష్కరించారు. అనంతరం కలిమిశ్రీ మాట్లాడుతూ బీసీలు పాలితులు కాదు పాలకులుగా నిలవాలన్న బహుజన చైతన్యం ప్రతి బీసీ ఎదలో నింపేందుకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ చొప్పా రాఘవేంద్రశేఖర్, సుప్రసిద్ధ కవి, రచయిత చిత్రాడ కిషోర్ కుమార్, సుప్రసిద్ధ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావు, ప్రసిద్ధ పోటోగ్రాఫర్ వై.డి.ఆనంద్, కడప నుండి వచ్చిన విద్యుత్శాఖ ఉద్యోగి జయన్న పాల్గొన్నారు.ఏపీలో కంచికచర్ల,నందిగామ.నూజివీడు,భీమవరం,రాజమండ్రి,కాకినాడ తదితర ప్రాంతాల్లో బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో బహుజనగణమన దీర్ఘ కావ్యం ఆవిష్కరణ వరుసగా జరిగింది.బరవే ప్రధాన కార్యదర్శి,సరికొండ నరసింహరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.జగ్గయ్యపేట సుప్రసిద్ధ కవి వంశీకృష్ణ ఆధ్వర్యంలో బహుజనగణమన దీర్ఘ కావ్యం ఆవిష్కరణ జరిగింది.

## రాయచోటి రోడ్డు ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**విజయవాడ జులై 14 ప్రభాతవార్త ప్రతినిధి:** అన్నమయ్య జిల్లాలో రాత్రిజరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పుల్లంపేట మండలం రెడ్డిచెరువు కట్టపై మామిడి లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడి 9 మంది మృత్యువాత పడటంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో 9 మంది చనిపోయారని గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. రాజంపేట నుంచి రైల్వే కోడూరుకు వీరు ప్రయాణిస్తున్న సమయంలో రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు సీఎంకు వివరించారు. మృతులంతా రైల్వేకోడూరు సెట్టిగుంట ఎస్టీ కాలనీకి చెందిన కూలీలని తెలియడంతో సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చే సమయంలో మృత్యువాత పడటం బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య చికిత్స అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## ప్రాణాపాయ స్థితిలో గుండె జబ్బుల నియంత్రణకు ఎక్మో సాంకేతికత

**విజయవాడ,జూలై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాణాపాయ సమయంలో గుండె జబ్బుల నియంత్రణకు ఎక్మో సాంకేతికత ఉపయోగపడుతుందని విదేశాల నుంచి వచ్చిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సునీల్ పూబోణి తెలిపారు.స్థానిక ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని వైద్య కళాశాలలకు ఆన్లైన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ పూబోణి మాట్లాడుతూఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ ఊపిరితిత్తులు లేదా గుండె విఫలమైనప్పుడు ఎక్మో అనేది ప్రాణాలను రక్షించే సాంకేతికత కలిగి ఉంటుందన్నారు.సాధారణంగా, తీవ్రమైన న్యుమోనియా వంటి ఊపిరితిత్తుల సమస్యల తర్వాత, వెంటిలేటర్ చికిత్స విఫలమైనప్పుడు ఎక్మో అవసరం తలెత్తుతుంది. అదేవిధంగా, గుండెపోటు తర్వాత, కొన్ని సందర్భాల్లో గుండె చాలా బలహీనంగా ఉంటుంది మరియు శరీరానికి తగినంత రక్త సరఫరాను అందించలేకపోవచ్చు. సాధారణ సాంప్రదాయ ఇంటెన్సివ్ కేర్ శారీరక విధులకు మద్దతు ఇవ్వలేని పరిస్థితులలో నిదిలీవీని ఉపయోగించవచ్చు. ఊపిరితిత్తులు లేదా గుండె కోలుకునే వరకు ఇది తాత్కాలిక ప్రక్రియ. పాశ్చాత్య ప్రపంచంలో, ఈ సాంకేతికత విస్తృతంగా ఉపయోగించబడుతోంది. భారతదేశంలో, కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నాయి. యూనిట్‌ను స్థాపించడానికి, తగినంత సౌకర్యాలు మరియు వైద్యులు, నర్సింగ్ మరియు అలైడ్ హెల్త్ సైన్స్ ప్రొఫెషనల్స్ కు శిక్షణ అవసరం ఎందుకంటే ఇది హార్ట్ లంగ్ బైపాస్ అయినప్పుడు రోగి ప్రాణాలు కాపాడడానికి ఎంతైనా అవసరమని అన్నారు. ప్రభుత్వ రంగంలో శిక్షణ సౌకర్యాలు మరియు ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేయడం వలన ఖర్చులను గణనీయంగా తగ్గించడం సాధ్యమని మేము చర్చించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.నిదిలీవీ రన్ సమయంలో రోగికి కొత్త ఇన్ఫెక్షన్ వస్తే, వైఫల్యం చెందే అవకాశాలు పెరుగుతాయి. ఇన్ఫెక్షన్ లేకపోతే, మెరుగైన ఫలితం వచ్చే అవకాశాలు బాగుంటాయి. నిదిలీవీలో రోగులకు చికిత్స చేస్తున్నప్పుడు సమస్యలు తలెత్తుతాయి కనుక శిక్షణ పొందిన వైద్యులు ఈ సమస్యలను చక్కగా నిర్వహించగలరు. ఇన్ఫెక్షన్ లేకపోతే, మరణం ఖచ్చితంగా ఉన్నప్పుడు, శ్వాసకోశ కేసులలో మనుగడ అవకాశాలు దాదాపు 60 మరియు గుండె సంబంధిత కేసులలో 50 . నిదిలీవీ ఏ వయసులోనైనా చేయవచ్చు. ఈ సమావేశం భారత ప్రభుత్వం మరియు అనుకూలత యొక్క అవకాశాన్ని మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మరియు స్వయంప్రతిపత్తి సంస్థలలో విస్తరణకు అవకాశాలనాలన్నారు.

## మంత్రి రవీంద్ర పగటి వేషగాడు: పేర్ని నాని

**విజయవాడ జులై 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కేవలం రెడ్‌బుక్ పాలన మాత్రమే సాగుతోందన్నారు మాజీ మంత్రి పేర్ని నాని. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే అలా చేసిన వారిని న్యాయస్థానాల్లో నిలబెడతాం అని హెచ్చరించారు. కొల్లు రవీంద్ర ఓ పగటి వేషగాడు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మహానటి అంటూ సైటెరికల్ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక కుటుంబంపై కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. ఉప్పాల హారికపై దాడి చేసి తిరిగి ఉప్పాల రాముపై కేసు నమోదు చేయడం దారుణం దాడి చేసి తిరిగి మా పార్టీ సభ్యులపైనే కేసులు నమోదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ కార్యకర్త ఏం చేశారో అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. టీడీపీ మహిళా కార్యకర్తతో తప్పుడు ఫిర్యాదు చేసింది. ఆమె కొడాలి నాని ఫ్లెక్సీని చించేశారు.

ఫ్లెక్సీని చించి చేతికి గాయం అయితే కారుతో గుద్దారని తప్పుడు ఫిర్యాదు చేశారు. తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే వారిని న్యాయ స్థానాల్లో నిలబెడతాం. చంద్రబాబు హయాం లోనే తప్పుడు కేసుల పరిపాలన కనపడుతోంది.


## తిరుమల విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ ప్రశంస



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో జూలై 14 (ప్రభాతవార్త):** నీట్2025 ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా 19 ర్యాంకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరం తిరుమల విద్యార్థి డి కార్తీక్ రామ్ కిరీటి ని రాష్ట్ర విద్య ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసించినట్లు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు.జేఈఈ అడ్వాన్స్డ్ 2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆల్ ఇండియా ఎనిమిదవ ర్యాంకు సాధించిన కె యశ్వంత్ సాత్విక్, ఎస్సీ కేటగిరీలో ఆల్ ఇండియా రెండవ ర్యాంకు సాధించిన కె.ప్రణీత్ లను మంత్రి లోకేష్ పుష్పగుచ్ఛంతో సత్కరించారన్నారు. ఈ ఘనతను సాధించిన తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలలో మంత్రి లోకేష్ అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి ఆయా విద్యార్థులు మంత్రి లోకేష్ ను ఉండవల్లి కార్యాలయంలో కలిశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకే నేటి తరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని లైఫ్ అంటేనే ఛాలెంజ్ గా స్వీకరించాలని అధైర్య పడకూడదని చెప్పారని విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకుని రాష్ట్ర భవిష్యత్తు మీరేనని ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని కలల సాధనకు నిరంతరం శ్రమించాలని దిశ నిర్దేశం చేశారని తిరుమల రావు తెలిపారు.

# 17న హెచ్‌ఎల్సీకి నీటి విడుదల

- అధికారులతో ప్రభుత్వ విప్ కాలవ సమీక్ష



**అనంతపురం, జులై 14 ప్రభాతవార్త బ్యూరో** తుంగభద్ర ప్రాజెక్టు నుండి ఈ నెల 17న తుంగభద్ర ఎగువ కాలువకు నీటిని విడుదల చేసేలా తుంగభద్ర బోర్డుకు ఇండెంట్ పెట్టాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎల్‌సి లోకలైజేషన్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సోమవారం అనంతపురంలోని తన స్వగృహంలో సమీక్షించారు. ముఖ్యంగా 35 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన కాలువ మరమ్మతు పనులు, నీటి విడుదల అంశాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. మొదట్లో 500 క్యూసెక్కులతో ప్రారంభించి క్రమంగా పెంచుతూ వెళ్లాలన్నారు. ఆంధ్రా సరిహద్దుకు 18న తేదీ చేరుతాయని, ఈలోగా నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం లేకుండా కాలువను సంసిద్ధం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అత్యవసర మరమ్మతు పనులకు రూ.35కోట్లు మంజూరు చేయించామన్నారు. కాలువ బలహీనగా ఉన్న ప్రాంతాల్లో బెడ్, సైడ్ లైనింగ్, శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిలు, అండర్ టర్నల్ ప్రాంతాల్లో కొత్త స్ట్రక్చర్స్ పనులు యుద్ధ ప్రతిపాదికన చేపట్టడం జరిగిందన్నారు. ఆయకట్టు సాగుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, రేయింబవళ్లు కష్టపడి సకాలంలో అన్ని పనులు పూర్తి చేయించారన్నారు. పరివాహక ప్రాంతంలో ప్రస్తుత ఏడాది వర్షాలు ముందే వర్షాలు కురవడంతో తుంగభద్ర ప్రాజెక్టు త్వరగా నిండిందన్నారు. సాధారణంగా గత పదేళ్లలో జులై నాల్గవ వారం, ఆ తరువాత నీటిని తీసుకోగా ప్రస్తుత ఏడాది వారం రోజుల ముందే తీసుకునే వెసులుబాటు లభించిందన్నారు. ఈనెల 17న ప్రాజెక్ట్ వద్ద ఆంధ్రా వాటా నీటిని విడుదల చేస్తే 18న ఆంధ్రా సరిహద్దుకు వస్తాయని తెలిపారు. ఈలోగా అడ్డంగా ఉన్న మట్టి కుప్పలు, ఇతరత్ర అవాంతరాలన్నింటినీ పూర్తిగా తొలగించి శుభ్రం చేయాలన్నారు. నీటి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కాలవ ఆదేశించారు.

## చంద్రబాబు పై పేర్ని నాని చేసిన కామెంట్లు తీవ్ర అభ్యంతరకరం : యనమల రామకృష్ణుడు

**విజయవాడ జులై 14 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబుపై వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుఅన్నారు.జగన్ అయిదేళ్ళ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో విధ్వంసం చేసారన్నారు.కేవలం ఏడాది కాలంలో సీఎం రాష్ట్రాన్ని అభివృద్ధికి దిశలో నడిపిస్తున్నారన్నారు.దాంతో ఆయనకు పెరిగిన అపార ప్రజాబలం చూసి నైరాశ్యంతో వైసిపి నాయకులు మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో యనమల ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు పై తీవ్ర అభ్యంతరం తెలిపారు. చంద్రబాబు ఉన్నంత కాలం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్న భావన జగన్, వైకాపా నేతలను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రత్యర్థులను తొలగించడం వైఎస్ కుటుంబానికి కొత్త కాదని అన్నారు. తనకు సీఎం పదవి ఇవ్వలేదన్న అక్కసుతో రోశయ్య , కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో జగన్ అనైతిక రాజకీయాలకు పాల్ప డ్డారని మండిపడ్డారు. వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలు అమానుషనమైనవి, నేరపపూరిత మైనవి. రాజకీయంగా తీవ్ర నిరాశలో ఉన్న ఆ పార్టీ నేతలు ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడలేకే ఆ పార్టీ దాడులకు ప్రేరేపిస్తూ అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోంది అని యనమల మండిపడ్డారు. ఉదయం నిద్రలేస్తూనే నాలుగు రకాల మందులు వాడుతూ పది సంతకాలు పెట్టడానికి చేతులు వణికే చంద్రబాబు వయసు గురించి మాట్లాడు తున్నారని హోం శాఖ మంత్రి అనిత మండిపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల రైల్వే యాంత్రిక విభాగంలో అధికారుల బదలీలు

**గుంతకల్లు రైల్వే, జూలై 14,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే యాంత్రిక విభాగంలో పనిచేస్తున్న పలువురు అధికారులకు బదిలీలు చేస్తూ సంబంధిత ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ పరిధిలోని తిరుపతి సిఆర్ఎస్‌లో డిప్యూటీ సిఎంఇగా పనిచేస్తున్న వి రమేష్‌ను గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇగా పనిచేస్తున్న ప్రమోద్‌ను నియమించారు. రాయనపాడు వర్క్‌షాపులో డిప్యూటీ సిఎంఇగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను లాలాగూడ లోని ఎస్‌టిఎస్ ప్రిన్సిపాల్ గాను,జోనల్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సిఎంఇ ప్లానింగ్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను హైదరాబాద్ డివిజన్ సీనియర్ డిఎంఇగా,ప్రిన్సిపల్ సిఎస్ఓ కార్యాలయంలో డిప్యూటీ సిఎస్ఓ(మెకానికల్)గా పనిచేస్తున్న స్వరాజ్‌కుమార్‌ను డిప్యూటీ సిఎంఇ ప్లానింగ్‌గా,విజయవాడ డివిజన్‌లో సీనియర్ డిఇఎన్‌హెచ్ఎంగా పనిచేస్తున్న కిశోర్‌ను డిప్యూటీ సిఎస్ఓ(మెకానికల్)గా, సదరన్ రైల్వే మెకానికల్ క్యాడర్‌లో పనిచేస్తున్న ఎం వంశీకాంత్‌ను దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ డిఇఎన్‌హెచ్ఎంగా పోస్టింగ్స్ కల్పించారు. కాగా హైదరాబాద్ డివిజన్‌లో సీనియర్ డిఎంఇగా పనిచేస్తున్న కమల్‌కాంత్‌ను ఆగ్నేయ రైల్వే జోన్‌కు బదిలీ చేశారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada – 520002 (A.P)

**E Procurement Tender Notice**
APCRDA invites tenders for the following works.

| S.No. | NIT Number | Name of the Work |
|---|---|---|
| 1 | 13/MAU61-USIOHB(OTH)/170/2025-HB Dt:02.07.2025 | Providing Comprehensive Annual Maintenance Contract to the seven (07) Nos. of UPS systems installed in the buildings of the High Court of A.P at Nelapadu, Amaravati, for the period of 1 Year"– Estimate Cost Rs.7,10,000/- |
| 2 | 11/ MAU61-USIOHB(OTH) /139/ 2025-HB /2nd call Dt:08.07.2025 | "Providing Comprehensive Annual Maintenance Contract to VRV and Split based Mitsubishi Make Air Conditioning Units installed in the buildings of the High Court (Main building and Annexe building) of Andhra Pradesh Nelapadu, Amaravati"– Estimate Cost Rs.1,80,000/- |
| The bid can be downloaded on AP e-procurement portal from **16.07.2025 to 31.07.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **31.07.2025 up to 15.00 Hrs**, Technical bid opening **31.07.2025 @16.00Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in** | | |
| 3 | NIT No. 07/ MAU61-USIOT-T(RCW)/6/2025-IFR1 Dt. 11-07-2025 | "Providing BT Hot mix Road & Central Divider with Street Lighting from Salipeta Road Junction to Ganguru Donka Road (Chapalakundilu road)" Estimate Cost: Rs. 620.00 Lakhs. |
| The bid can be downloaded on AP e-procurement portal from **15.07.2025 to 29.07.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bids **29.07.2025 up to 15.00 Hrs**, Technical bid opening **29.07.2025 @16.00Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in** | | |

Sd/- Commissioner, APCRDA, Vijayawada

# వార్త

మూర్ఖుడు ఏదో దూరాన సుఖం ఉందని నమ్ముతాడు, వివేకవంతుడు అది తన పాదాల దగ్గరే ఉందని భావిస్తాడు.

-జేమ్స్‌బస్వెన్ హేమ్

## 'కల్తీ'ని ఆపలేమా!

కల్తీకల్లు ప్రాణాలు తీస్తోంది. కాసులకు కక్కుర్తి పడి కలపకూడనివి ప్రాణాంతక, నిషేధిత విషపదార్థాలను కల్తీ చేస్తే జరిగేదిదే. ఈ విషయం తెలియనిదేమీ కాకపోయినా నిర్వాహకులు అధిక సంపాదన కోసం చేసే పనులు పరుల ప్రాణం మీదకు తెస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణలో 'కల్లు' సంప్రదాయం శ్రామికజనానికి ఉల్లాసంగా ఉంటుంది. దానినాసరాగా తీసుకుని కల్తీ చేయడం వలన అది గుర్తించలేకపోవడం వారి ఆరోగ్యం పాడవుతోంది. కల్తీ శ్రుతి మించితే అనారోగ్యం వెంటాడుతుంది. కల్లు కంపౌండ్‌లపై కంట్రాక్టర్ల గుత్యాధిపత్యం ఉందని అదొక మాఫియాలా నడుస్తుంటాయని ఎన్ని ఆరోపణలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆ కారణం చేతనే అకారణంగా ఎన్నో ప్రాణాలు హరించుకుపోతున్నాయి. హైదరాబాద్ నగరంలోనే అధికారికంగా 104 కల్లు దుకాణాలున్నాయి. అయితే ఒకరికే ఎక్కువ దుకాణాలుండడం వలన 'కల్తీ'కి సంబంధించి అల్ప్రజోలమ్, సోడియం, బైకార్బొనేట్ అమ్మోనియం, శాఖరిన్ వాటిని కల్తీ చేసేందుకు వీలైన యంత్రాంగం, సరంజామా సమకూర్చుకునేందుకు వీలుంటుందని కల్లుగీత కార్మిక సంఘాల విశ్లేషణ. ఇంతవరకు గ్రేటర్ హైదరాబాద్‌లో కుకట్‌పల్లి దుర్ఘటనలో కల్తీ కల్లుకు పది మంది బలయ్యారు. కల్తీ కల్లు ఎవరికందినా ప్రాణం మీదకు తెస్తోంది. మొన్నటికి మొన్న జీడిమెట్లలో కల్తీకల్లు తాగిన నిజామాబాద్ జిల్లా బోపాల్‌కు చెందిన దంపతులు రామ్‌రెడ్డి నగర్‌లోని కల్లు దుకాణంలో కల్లుతాగి మంచానపడ్డారు. కాళ్లు, చేతులు లాగడం, పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం, పిచ్చిప్రేలాపనలు వారిని నిర్వీర్యుల్ని చేసింది. శరీరంలో సత్తా ఉడిగి మంచాన పడి ఉన్నారు. నేరుగా తాటి చెట్టు నుంచి తీసే 'నీరా' శరీరానికి మంచిదేనని వైద్యులే చెబుతుంటారు. కాగా అందులో 'కల్తీ' జరిగితే ఇంకేముంది? అని కల్తీకల్లు మరణాలు సంభవించినప్పుడల్లా తేటతెల్లమయ్యేదే. కానీ ఇప్పుడున్న పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ముడిపదార్థాలు సరఫరా కాకుండా చూడడంలోనూ ప్రభుత్వ వైఫల్యం కనపడుతోంది. ఈ వృత్తి మీద దాదాపు రెండున్నర లక్షల మంది గీతవృత్తి కార్మికులు ఆధారపడి ఉంటారు. కల్తీ కల్లు విక్రయాలు కూడా నేలకు కోట్ల మీదనే ఉంటుంది. ఇంతవరకు పొడిగా లభించే క్లోరల్ హైడ్రేట్, డెజోపామ్, ఆల్ప్రాజోలంను లిక్విడ్‌గా మార్చి అసలు సిసలు కల్లులో కలపడం వల్లనే కల్తీ ప్రభావతీవ్రత ఎక్కువ కనపడుతోందని తాజా వ్యవహారంలో ఆరోపణలున్నాయి. ఇలా వచ్చే ఏ రకమైన ఆరోపణలకూ ఇటు ఎక్సైజ్ శాఖ కానీ అటు ప్రభుత్వం కానీ సమాధానమిచ్చే పరిస్థితి లేదు. ఏదో మద్యం ధరలు పెరగడం వల్లనే కల్లుకు గిరాకీ పెరిగిందని కొందరు చెప్పబోతున్నా గిరాకీని ఆసరాగా మరో చుక్కకలిపి కల్తీగా మార్చేయడం ఎలా చూసినా తప్పే అవుతుంది. కల్లులో ఎలాంటి రసాయనాలు కలపకుండా సేవిస్తే ప్రాణాలకు ముప్పేమీ ఉండదు. సామాన్యులకు ఈ విషపూరిత ద్రావకాన్ని అందించే కల్తీకల్లును నిరోధించేందుకు ఎన్నో మార్గాలున్నాయి. 'నీరా'కల్లు తప్ప మరేదీ తాగద్దని చెబుతున్నా అందులో కల్లు కలపకుండా తీసుకోవలసిన ప్రామాణికాలు ఏవీ ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు లేదు. ప్రధానంగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లుకన్నా ఎక్కువ పరిమాణంలోనే కల్లు అమ్మకాలు జరుగుతున్నాయని ప్రభుత్వం వద్ద లెక్కలున్నాయి. కాగా ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఇవన్నీ తెలిసినా కల్లు ప్రియుల పక్షాన కావల్సినంత కల్లుకోసం కళ్లుగప్పు కుని కూర్చుంటున్నారా అన్నట్లు వారి అజమాయిషీ ఉంటోంది. ఇదే అభ్యంతరకరం. నిషేధిత మత్తు పదార్థాలు మోతాదుకు మించి కలిపినప్పుడే కల్తీ మరణాలు సంభవిస్తాయి. లేకున్నా వికారాలకు తక్కువేం లేదు. ఆస్పత్రుల పాలవడం, ఆర్థికంగా చితికిపోవడం కూడా ఈ వ్యసన పర్యవసానమే. మిథైల్ ఆల్కహాల్, కూడా కల్లులో కలిపితే బాగా మత్తువస్తుందని, దీనిని కూడా కలుపుతారని వెల్లడి. గత కొద్దికాలంగా జంటనగరాలకు, పరిసర గ్రామాల్లో సైతం ఆధునీకరణ పేరిట రహదార్ల విస్తరణకు, ఇతరత్రా నిర్మాణ కార్యక్రమాల కోసం రోడ్డువారనే ఉన్న తాటి, ఈత చెట్లు నరికివేతతో కల్లు తక్కువగా లభ్యమవుతోందని అంచనాలున్నాయి. 'కల్తీ'కల్లు తాగి బలౌతున్నారన్న విషయం ఇవ్వాళ కొత్తేమీ కాదు. కానీ దానిని నిరోధించాలని, విస్తృత వ్యాప్తిని అరికట్టాలని దృఢసంకల్పం లేకపోవడమేఈనాటి దుర్ఘటనలకు కారణమౌతోంది. ప్రధానంగా కోరల్ హైడ్రేట్ నాడీ మండలంపై ప్రభావం చూపుతుంది. పేగును మెలి పెడుతుంది. లివర్ డ్యామేజి అవుతుంది. ఇలా కల్తీకల్లునే మరో రూపంలో సింథటిక్ కల్లు అని కూడా అంటుంటారు. చాలా మందికి ఈ దుర్వ్యసనంలో 'కల్తీ' రకాలు తాగితే ప్రాణం వదిలేయా ల్సి వస్తుందని, తెలుసున్నా కల్తీ ఏదో స్వచ్ఛమైనదేదో పసికట్టలేక కానీ వ్యసనానికి ఆగలేక తాగడం మాన లేకపోతున్నారు. కల్లు ప్రియు లకు ప్రభుత్వం నుంచి స్వచ్ఛ మైన కల్లు సరఫరాకు భరోసా లేకపోవడం దురదృష్టకరం. కల్లు దుకాణాలపై నిఘాలో నిర్లక్ష్యం వహించిన ఎక్సైజ్ ఠాణా సిఐని సస్పెండ్ చేశారు. ఎక్సైజ్ సిబ్బందిని విచారణకు ఆదేశించారు. 2014లో కనీసం 20 మంది మృతి చెందారు. తాజా దుర్ఘటనలో ఇంతవరకు 10 మంది మృతి చెందారు. చాలా మంది ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. దుర్ఘటనను ప్రభుత్వం ఛాలెంజ్‌గా తీసుకుని కల్తీకల్లు జనానికి అందకుండా పకడ్బందీ వ్యూహంతో ముందుకు కదిలితే మరో మరణానికి అవకాశం లేని పరిస్థితులను చూడవచ్చు.

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు.



జియోర్జ్ ఎలైట్

పాఠకుల తక్కువ సమయం తీసుకొని ఎక్కువ విజ్ఞానం అందించే రచయిత ప్రతిభావంతుడు.



సి.సి.కోల్టన్

## ప్రజావాక్కు



### ఎంత మందికని ఇస్తారు

మంత్రి పదవికోసం తరచు ఢిల్లీకిచక్కర్లు కొట్టడం, పైరవీలు చేయడం, మంత్రిపదవి ఇవ్వకపోతే రాజీనామా బెదరింపులు, ఫిరాయింపులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం మంత్రివర్గ విస్తరణ సమయంలో ఎమ్మెల్యేల తీరు ఇలా ఉంటోంది. శాసనసభ స్థానాలను బట్టి మంత్రి పదవులు ఇవ్వవలసి ఉంటుంది. పరిమితులు దాటి పదవులు ఇవ్వటానికి కుదరదు. ఎమ్మెల్యే ఎన్నికయిన వారికి ఈ మాత్రం తెలియదా? మంత్రివర్గ విస్తరణ జరిగే ప్రతీసారి ఎందుకు మొండిగా, మూర్ఖంగా ప్రవర్తిస్తుంటారు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### పరిశోధనలకు కీలకపాత్ర ఇవ్వాలి

విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిమితి కాదు. జ్ఞానాన్ని సృజనాత్మకంగా అన్వేషించడమే నిజమైన విద్య. ఈఅన్వేషణలో పరిశోధనకు కీలకపాత్రఉంది. విశ్వ విద్యాలయాల ప్రతిష్ఠ, విద్యార్థుల మేధోవికాసం అన్నీ పరిశోధనపై ఆధారపడిఉంటాయి. పరిశోధన విద్యార్థుల్లో లోతైన ఆలోచనలను, సమస్యలపై విశ్లేషణాత్మక దృష్టిని పెంపొందిస్తుంది. ఇది నూతన ఆవిష్కరణలకు దారితీసే మార్గం. పైగా, సమాజానికి అవసరమైన పరిష్కారాలను అందించగల సామర్థ్యాన్ని విద్యార్థులకు కలిగిస్తుంది. ఇది కేవలం విశ్వవిద్యాలయాలకే పరిమితం కాకుండా, పాఠశాల స్థాయిలోనే ఈ సంస్కృతిని ప్రారంభించాలి. చిన్న తరగతుల్లో నుంచే పర్యావరణం, సైన్స్, సమాజశాస్త్రం తదితరాల్లో చిన్న ప్రాజెక్టుల రూపంలో పరిశోధనోన్ముఖ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవ్వాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రాజ్యాంగాన్ని అనుసరించి పాలించండి

విశ్వాసాలు కలిగి ఉన్న వారిపైన దాడి చేస్తుండడం విషాదం. ఇక్కడ గమనించవలసిన విషయం ఇంకొకటి ఉంది. రాజ్యం తమ సొంత పౌరులపైనే దాడి చేస్తుండడం గమనించవచ్చు. దేశంలో2004లో మొదటి సారి ఉమ్మడి రాష్ట్రంలోచర్చల ప్రయోగం జరిగింది. దానికి ప్రజా మద్దతు కూడా లభించింది. భూ సంస్కరణలు గిరిజనులు 1/70 చట్టం లాంటివి చాలా వరకు చర్చకు వచ్చాయి. ఇవ్వాళ ప్రజా ఉద్యమాల వల్లనే ఉపాధి హామీ చట్టం భూ సేకరణ చట్టం లాంటివి రూపుదిద్దుకున్నాయి.

- భారత శ్రీరాములు, ముత్తారాం

### విమానంలో తెలుగు భాషకు పట్టం

తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష వినియోగంపై భాషాభిమానులు ఆందోళనచెందుతున్న వేళ హైదరాబాదునుంచి దుబాయ్ వెళ్లే ఎమిరేట్స్ విమానంలో తెలుగు భాషకు పట్టం కట్టడం భాషా అభిమానులను ఆనందింప చేస్తోంది. ఎమిరేట్స్ విమానంలోభోజన పట్టికను అరబిక్, ఇంగ్లీష్‌తో పాటు తెలుగులోనూ ముద్రించారు. విమాన భోజన మెనూ కార్డులో తెలుగు అక్షరాలు చూసిన ఆంధ్రులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. ఇటీవల మహా కుంభమేళాలోనూ తెలుగు బోర్డులు వెలిశాయి. ఇటువంటి వార్తలు వింటుంటే తెలుగు ప్రేమికుల హృదయం ఉప్పొంగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలుగు భాష వినియోగం పట్ల శ్రద్ధ పెట్టాలి.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### చిట్‌ఫండ్ కంపెనీలతో మోసపోకండి

అనేక చిట్‌ఫండ్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టి తర్వాత దివాలా తీసేసే కంపెనీలు కొన్ని. దివాలా తీశామంటున్నారో లేకపోతే మొత్తం డబ్బులుతీసుకుని పారిపోతున్నారో ఎవ్వరికీ తెలియదు. రెండవదే నిజం. యాడ్‌లో చూసి తమ ప్రియతమ సెలబ్రిటీ ఇదిగోగోతిలో దూకమన్నాడు అని దూకి చేతులు కాలాక లోబోదిబో అంటూ రోడ్ ఎక్కేవారు కొందరు. అలాంటిదే మొన్న జరిగిన ఒక రియల్ ఎస్టేట్‌కి ఒక ప్రముఖ నటుడు ఇచ్చిన యాడ్. ఇక్కడ కొనేవారే కాక యాడ్ ఇచ్చే ప్రముఖులు కూడా ఆయా కంపెనీ క్రెడిబిలిటీ చూసి యాడ్ ఇవ్వాలి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### ఇంటి పరిస్థితులను కూడా పట్టించుకోండి

భారత ప్రధాని నరేంద్ర మోడీ గత ప్రధానులు ఇతర దేశాల పార్లమెంట్లలో చేసిన 17ప్రసంగాలతోసమానంగా తాను ఒక్కడే గత పదకొండేళ్లలో అన్ని దేశ పార్లమెంట్లలో ప్రసంగించిన ఘనతను పొందారు. దీనితో ప్రధాని పదవిని చేపట్టిన నుండి ఇప్పటి వరకు 27 అంతర్జాతీయ అత్యధిక గౌరవ పురస్కారాలు పొందిన ప్రధాని నరేంద్ర మోడీ ఒకే ఒక్కరు గావచ్చు. ఈయన రచ్చ గెలుస్తున్నారు. ఇంటగెలిచారా అంటే అనుమానస్పదమే. ఐపి ఎస్95లో రిటైరయిన పబ్లిక్ సెక్టార్ఉద్యోగులు గత 11 సం॥రాలుగా నెలకు వెయ్యి రూపాయల ఫించన్ తో బతకలేక వయసు మీద పడ్డా బయట ఏవేవో చిన్నా చితకా పనులు చేస్తూ చావలేక బ్రతకలేక బ్రతుకీడుస్తున్నారు. ఇంటి పరిస్థితులను కూడా పట్టించుకోండి.

- డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## ఈసారైనా డీలిమిటేషన్ జరిగేనా?

**ప్రజాస్వామ్యంలో సంఖ్యా బలానిదే పైచేయి. చట్టసభలలో మెజారిటీ సభ్యుల నిర్ణయాలను మైనారిటీ సభ్యులు భరించాల్సిందే. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వ భౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ సంఖ్యాబలం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 42 స్థానాలు ఉండగా తమిళనాడుకు 39, కర్ణాటకకు 28, కేరళకు 20 స్థానాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా వున్నసమయంలో కేంద్రంలో కీలకంగా వుండేది.**



అన్నవరపు బ్రహ్మయ్య

మన దేశంలో నిజానికి 1981లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కార్యక్రమం నిర్వహించాల్సి వుంది. అయితే ఆనాడు దేశ జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందుగా దేశంలో జనాభా నియంత్రణ కార్యక్రమాలుఅమలు చేయాలన్న తలంపుతో డీలిమిటేషన్ కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో నిర్వహించే జనగణన తర్వాత చేయాలని ఆనాటి పార్లమెంటులో తీర్మానం చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులు గమనిస్తుంటే ఈసారైనా డీలిమిటేషన్ ప్రక్రియ అసలు జరుగుతుందా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. సహజంగా డీలిమిటేషన్ ప్రక్రియను పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన 'డీలిమిటేషన్ కమిషన్' నిర్వహిస్తుంది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1951, 1961, 1971లలో జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ నిర్వహించారు. ప్రస్తుతం లోక్‌సభలో వున్న 543 నియోజకవర్గాల సీట్ల సంఖ్యను 1971జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించారు. ఆనాటి దేశ జనాభా 54.8 కోట్లు. సహజంగా జనాభా సంఖ్యను బట్టి నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయిస్తారు. కాని ప్రస్తుతం పరిస్థితుల్లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను నిర్ణయించే పక్షంలో కొన్ని రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం వుంది. అందువల్ల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహ పలువురు ముఖ్యమంత్రులు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజను వ్యతిరేకిస్తున్నారు. 1971 జనాభా లెక్కల సేకరణ తర్వాత దేశవ్యాప్తంగా విస్తృతంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేశారు. అయితే ఆయా రాష్ట్రాల సామాజిక పరిస్థితులను బట్టి కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా అమలయ్యాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా మందకొడిగా అమలయ్యాయి. ఇదే సమయంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా పగడ్బందిగా అమలయ్యాయి. దాంతో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సరిగా అమలు కాని రాష్ట్రాలలో జనాభా ఎక్కువగా వుంటే, నియంత్రణ కార్యక్రమాలు సక్రమంగా అమలైన రాష్ట్రాలలో జనాభా తగ్గిపోయింది. ఈ స్థితిలో జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగే పక్షంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు విపరీతంగా పెరిగే అవకాశం వుండగా, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సవ్యంగా అమలు చేసిన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతాయి. ఉదాహరణకి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలు పెంచే పక్షంలో ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సభ సీట్ల సంఖ్య 80నుంచి 91కి, బీహార్ రాష్ట్రంలో 40నుంచి 50సీట్లకు పెరుగుతాయి. ఇదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వున్న 42సీట్లసంఖ్య 34కి, తమిళనాడులో 39సీట్ల సంఖ్య 31కిపడిపోతాయి. ఈ స్థితిలో డీలిమిటేషన్‌లో లోక్‌సభ స్థానాలను యధావిధిగా కొనసాగించడం మంచిదని కొంతమంది మేధావులు సూచిస్తున్నారు.





ఎందుకంటే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచడం ఆచరణ సాధ్యం కాదు. ముందుగా చెప్పుకొన్నట్టుగా 1971వ సంవత్సరంలో దేశ జనాభా 54.8 కోట్లు. ఆనాటి జనాభా ప్రకారం 543స్థానాలు వుంటే, నేటి జనాభా దాదాపు 150 కోట్లకు కనీసం 1500 స్థానాలకు పెరగాల్సి వుంటుంది. ఈ స్థానాలకు తోడు మూడోవంతు అంటే500 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలను కూడా కలపాల్సి ఉంటుంది. ఇంతమంది సభ్యులకు పార్లమెంటు భవనంలో సీట్లు కేటాయించడం కూడా సాధ్యంకాదు. కొత్తగా నిర్మించిన పార్లమెంటు భవనంలో లోక్‌సభ, రాజ్యసభలో మొత్తం 1272 సీట్లు మాత్రమే వున్నాయి. అంతేకాకుండా భారత దేశ జనాభా భవిష్యత్తులో అంటే మరో మూడు దశాబ్దాల పాటు పెరుగుతూనే వుంటుంది. భారతదేశ జనాభా సగటున 15 శాతం వంతున రాబోయే మూడు దశాబ్దాలలో దాదాపు 165170 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. (మూడు దశాబ్దాల తర్వాత జనాభా తగ్గడం ప్రారంభం అవుతుంది). ఈ స్థితిలో ప్రతి పది సంవత్సరాలకు లోక్‌సభ స్థానాలు పెంచడం అసాధ్యం. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1913వ సంవత్సరానికి ముందు ప్రతి పదేళ్లకు జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్(పార్లమెంటు)లో సీట్ల సంఖ్య పెంచినప్పటికీ 1913 నుండి ప్రతినిధుల సభలో సీట్లసంఖ్య 435కి పరిమితం చేశారు. అమెరికా జనాభా 1911లో 9.4 కోట్లు వుండగా ప్రస్తుతం అంటే 2024 నాటికి దాదాపు నాలుగు రెట్లు పెరిగి 34 కోట్లకు చేరుకుంది. అయినా అమెరికా కాంగ్రెస్లో ప్రతినిధుల సీట్ల 435 గానే ఉంది. అదే విధంగా భారతదేశంలో కూడా పైన పేర్కొన్న అంశాల నేపథ్యంలో రాష్ట్రాలలో అసెంబ్లీస్థానాలలో మార్పులు చేర్పులు చేసినా, లోక్‌సభ స్థానాల సంఖ్యను యధాతథంగా 543 ఉండే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు. ఇదే జరిగితే దక్షిణాది, ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల మధ్య తలెత్తిన సీట్ల గొడవ కూడా సద్దుమణుగుతుంది. జనాభా ప్రాతిపదికన కాకుండా నిర్ణీత నిష్పత్తిలో 543లోక్‌సభ స్థానాలను 843కి పెంచే పక్షంలో రాష్ట్రాల జనాభాతో నిమిత్తం లేకుండా అన్ని రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు పెరుగుతాయనే ప్రతిపాదనను కూడా కొన్ని రాజకీయ పార్టీలు ప్రతిపాదిస్తున్నాయి. నిష్పత్తి ప్రకారం నిర్వహిస్తే అన్ని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి. ఉదాహరణకి పైన తెలిపిన నిష్పత్తిలో లోక్‌సభ స్థానాలు పెంచే పక్షంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సభ సీట్ల సంఖ్య 80 నుంచి 143కి, బీహార్ రాష్ట్రంలో 40నుంచి 79సీట్లకు పెరుగుతాయి. ఇదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న 42 సీట్ల సంఖ్య 54కి, తమిళనాడులో 39 సీట్ల సంఖ్య 49కి పెరుగుతాయి. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలానిదే పైచేయి. చట్టసభలలో మెజారిటీ సభ్యుల నిర్ణయాలను మైనారిటీ సభ్యులు భరించాల్సిందే. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వభౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ సంఖ్యాబలం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 42 స్థానాలు ఉండగా తమిళనాడుకు 39, కర్ణాటకకు 28, కేరళకు 20 స్థానాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా వున్నసమయంలో కేంద్రంలో కీలకంగా వుండేది. ఉదాహరణకి కేంద్రంలో ఒక సమయంలో తెలుగుదేశంపార్టీ 36 స్థానాలతో లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించగలిగింది. అదే సమయంలో తమిళనాడు, ఆంధ్రప్రాంతానికి చెందిన అధికారులు కూడా కేంద్రంలో ఎక్కువగా వుండేవారు. దాంతో కేంద్రంలో ఏపనైనా వేగంగా జరిగేది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణ 17 లోక్‌సభ స్థానాలకు పరిమితం అయ్యాయి. దాంతో కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. •

## నైపుణ్యమే యువత భవిష్యత్ మూలధనం

వెంకటరమణ గిలకత్తుల

ప్రపంచ జనాభాలో సుమారు 16 శాతం మంది యువత (15–24 సంవత్సరాల వయస్సు) ఉండటం, మానవ వనరుల పరంగా అపూర్వమైన అవకాశం. అయితే, ఈ సమృద్ధి యువతరం సవాళ్లను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం, పేదరికం, 40 యువతకు మార్కెట్ అవసరాలకు తగినట్లు నైపుణ్య శిక్షణ లేకపోవడం వల్ల సామర్థ్యం పూర్తిగా వినియోగించబడట్లేదు. ప్రపంచం వేగంగా డిజిటల్ వైపు ప్రయాణిస్తున్న తరుణంలో, కాలానుగుణ మార్పులకు సన్నద్ధం చేయడం అత్యవసరం. నైపుణ్యాలు కేవలం ఉపాధి మార్గమే కాదు – అవి వ్యక్తిగత అభివృద్ధికి, ఆత్మవిశ్వాసానికి, ఆవిష్కరణలకు పునాది. యువత ఉద్యోగం కోసం ఎదురుచూసే స్థితిలో కాకుండా, స్వయం ఉపాధికి సిద్ధమయ్యే స్థితికి చేరే మార్గం నైపుణ్యమే. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, డిజిటల్ కంపెటెన్సీలు, వ్యవసాయం నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ప్రతి రంగంలో నైపుణ్యాలతో శిక్షణ పొందిన యువత దేశాభివృద్ధికి కీలకం. ప్రతి నైపుణ్యం ఒక విలువైన సంపదగా మారుతుంది. అది వ్యక్తిని మాత్రమే కాదు సమాజాన్ని కూడా వెలుగులోకి తీసుకురాగలదు. యునెస్కో, ఐఎల్‌వో, యునిసెఫ్, యునిడో వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ యువత కోసం స్కిల్స్ ఫర్ యూత్, డీసెంట్ జాబ్స్ ఫర్ యూత్, ఫ్యూచర్ ఆఫ్ వర్క్ వంటి కార్యక్రమాల ద్వారా శిక్షణా అవకాశాలు అందిస్తున్నాయి. నైపుణ్యాలను సమాజ సంక్షేమమే పునాదిగా, సమాన అవకాశాల కల్పన దిశగా ఈ సంస్థలు గ్లోబల్ అవగాహన పెంచుతున్నాయి. భారత ప్రభుత్వం



2015 లో ప్రారంభించిన స్కిల్ ఇండియా మిషన్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది యువత శిక్షణ పొందుతున్నారు. ప్రత్యేకించి గ్రామీణ యువత, మహిళా యువత, వలస కార్మికులు వంటి వర్గాలకు చేరువయ్యే ప్రయత్నాలు అభినందనీయం. నాణ్యమైన శిక్షణ, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన కార్యక్రమాలు, ఉపాధికి అనుసంధానించే వ్యవస్థలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది. నగర, గ్రామం మధ్య నైపుణ్య బేధం తగ్గించేందుకు మొబైల్ డిజిటల్ ట్రైనింగ్ ల్యాబ్‌లు, మెంటార్ కౌన్సిలింగ్ కేంద్రాలు, వర్చువల్, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తరించడం అత్యావశ్యం. నైపుణ్యం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, నమ్మకం పెరుగుతుంది. ఈ నైపుణ్యాలు వారిని ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చగలవు. యువతకు తగిన మార్గనిర్దేశం, శిక్షణ, కాలానుగుణ మార్పులను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని అందించడం ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, పరిశ్రమల బాధ్యత. నాయకత్వ లక్షణాలపైశిక్షణ, కమ్యూనికేషన్, జట్టు కృషి, భావోద్వేగ నియంత్రణ మొదలగు అంశాలపై శిక్షణ ఇప్పించాలి. యువత దేశ భవిష్యత్తుకు పునాది. సరైన అవకాశాలు కల్పించడం ఓ విధి మాత్రమే కాదు. అది మన భవిష్యత్తు పట్ల నిబద్ధత. నైపుణ్యం లేని సమాజం చైతన్యం లేని భవిష్యత్తుతో సమానం. నైపుణ్యం అనేది వ్యక్తిగత విజయం కోసం మాత్రమే కాదు, సమాజ సుస్థిరతకు, ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శక శక్తి. యువతను సాంకేతికత, సృజనాత్మకత, మానవీయ విలువల మేళవింపుతో తీర్చిదిద్దితే వారి చేతుల్లో ఉండే జ్ఞానం ప్రపంచ సుస్థిర భవిష్యత్తు వైపు నడిపిస్తుంది. •

## ప్లాస్టిక్ బెడద నివారణకు ఓ అద్భుత శిలీంధ్రం!



యేచన్ చంద్రశేఖర్

ప్లాస్టిక్ వ్యర్థాలు, సముద్రాలు, నదులు, భూమితోసహా వివిధ పర్యావరణ వ్యవస్థలలో పేరుకుపోయి, మైక్రోప్లాస్టిక్‌లు, నానోప్లాస్టిక్‌లుగా రూపాంతరం చెందుతాయి. మారుమూల ప్రాంతాలలో సైతం కనుగొనబడే ఈ సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు వాతావరణంలో స్థిరంగా ఉంటాయి. ప్లాస్టిక్ పూర్తిగా కుళ్లిపోవడానికి, మట్టిలో కలిసిపోవడానికి వందల లేదా వేల సంవత్సరాలు పట్టేఅవకాశం ఉంది. ఏటా 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడం అత్యంత ఆందోళనకరమైన అంశం. అయితే, అమెజాన్ ఉష్ణమండల వర్షారణ్యాలలో (అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్) కనుగొనబడిన "పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా" అనే అద్భుతమైన శిలీంధ్రాలు (ఫంగస్) ప్లాస్టిక్ కాలుష్య సమస్యను పరిష్కరించడంలో సహాయపడే సామర్థ్యం ఉన్నందున పర్యావరణ శాస్త్రవేత్తల దృష్టిని అమితంగా ఆకర్షించింది. అమెజాన్ వర్షారణ్యంలో శాస్త్రవేత్తలు ఒక అద్భుతమైన శిలీంధ్రాన్ని (ఫంగస్) కనుగొన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన పర్యావరణ సమస్యలలో ఒకటైన ప్లాస్టిక్ కాలుష్యాన్ని పరిష్కరించడంలో సహాయపడుతుంది. యేల్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనం ప్రకారం, పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా అని పిలువబడే ఈ శిలీంధ్రం, ఇన్సులేషన్ నుండి పాదరక్షల వరకు ప్రతిదానిలోనూ ఉపయోగించే సాధారణ రకం ప్లాస్టిక్ అయిన పాలియురేతేన్‌ను విచ్ఛిన్నం చేసే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది వాయురహిత లోతైన ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు వాతావరణాలలో సైతం మనుగడ సాగించి ప్లాస్టిక్‌ను క్షీణింపజేయగలదు. ప్లాస్టిక్ అత్యంత ప్రబలమైన సముద్ర కాలుష్య కారకంగా మారి ప్లాస్టిక్ ఉపరితలాలు సముద్రంలో వేగంగా పెరుగుతున్న తరుణంలో హవాయి విశ్వవిద్యాలయ పరిశోధకులు ఇటీవల హవాయి సమీప తీర వాతావరణం నుండి అనేక జాతుల శిలీంధ్రాలు ప్లాస్టిక్‌ను క్షీణింపజేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని కనుగొనడంతో పాటు కొన్నింటిని వేగంగా అభివృద్ధి చేయవచ్చని తెలుసుకున్నారు. నేటి వాతావరణంలో అత్యధిక కాలంపాటు మనగలిగే ప్లాస్టిక్‌ను ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో అధోకరణం చేయడం దాదాపు అసాధ్యం అని హవాయి విశ్వవిద్యాలయం పరిశోధకులు అన్నారు. ప్రకృతి నుండి ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించడానికి, పునర్వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కొత్త మార్గాలను అన్వేషించేందుకు సముద్ర శిలీంధ్రాలు ఒక ఆశాజనకమైన అంతగా ఉపయోగించని వనరులుగా వారి పరిశోధన తెలియచేస్తుందన్నారు. ఈ ఆవిష్కరణను ముఖ్యంగా ఉత్తేజపరిచే విషయం ఏమిటంటే, శిలీంధ్రం కార్బన్ ఏకైక వనరుగా ప్లాస్టిక్‌పై జీవించగలదు. ఇతర పోషకాలేవీ అవసరం లేకుండా మనుగడ సాగించే ఈ శిలీంధ్రాలు ప్రత్యేకించి ఆక్సిజన్ లేని వాతావరణాలలో, అంటే చెత్త ప్రదేశాలలో



లోతైన పొరలలో ప్లాస్టిక్‌వ్యర్థాలను క్షీణింపచేస్తాయి. ప్లాస్టిక్‌ను అధోకరణం చేస్తున్నప్పుడు, శిలీంధ్రం దానిని పర్యావరణానికి హానిచేయని సేంద్రీయ సమ్మేళనాలుగా మారుస్తుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, సింథటిక్ పాలిమర్‌లలోని కఠినమైన రసాయన బంధాలను విడదీయగల ఫంగస్ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఎంజైమ్‌ల ద్వారా ఈ ప్రక్రియ సాధ్యమవుతుంది. కాలుష్య కారకాలను శుభ్రపరచడానికి జీవులను ఉపయోగించే ప్రక్రియ అయిన బయోరిమిడియేషన్ (బ్యాక్టీరియా లేదా ఫంగస్‌వంటి జీవుల వాడకంద్వారా పర్యావరణం నుండి కాలుష్య కారకాలను తొలగించడం) కోసం సాధనాలుగా శిలీంధ్రాల సామర్థ్యంపై ఈ ఆవిష్కరణ ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీనిని వాణిజ్యపరంగా అభివృద్ధి చేయడానికి మరిన్ని పరిశోధనలు అవసరం అయినప్పటికీ, మానవ నిర్మిత పదార్థాల వల్ల కలిగే కొన్ని నష్టాలను తొలగించడానికి ప్రకృతి మనకు ఎలా సహాయపడుతుందో చెప్పడానికి పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ఫంగస్‌ను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడానికి మరింత లోతైన పరిశోధనలు అధ్యయనం అవసరమైనప్పటికీ ఇది ప్లాస్టిక్ కాలుష్యాన్ని పరిష్కరించడంలో అద్భుతమైన సామర్థం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఉత్పత్తిదారులకు తక్కువ ఉత్పత్తి వ్యయం, వినియోగదారులకు చౌకైనవి, తేలికైనవి, దృఢమైనవి, మన్నికైనవి, బహుళార్థప్రయోజనకరమైనవి, అచ్చు వేసేందుకు లేదా పోత పోసేందుకు అనువైనవి కావడంతో ప్లాస్టిక్ విస్తృతంగా ఉపయోగించబడుతుంది. ఈ విలక్షణ లక్షణాల కారణంగా ప్యాకేజింగ్ నుండి నిర్మాణం ఆరోగ్య సంరక్షణ వరకు వివిధ పరిశ్రమలలో విస్తృత శ్రేణిలో ప్లాస్టిక్ ఉపయోగించబడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం ప్లాస్టిక్ వినియోగంలో ప్యాకేజింగ్ పరిశ్రమ దాదాపు 40శాతం వాటా కలిగిఉంది. ప్లాస్టిక్‌లతేలికైన స్వభావం, మన్నిక, తక్కువ ఖర్చు, ఉత్పత్తులను సురక్షితంగా ఉంచడంతోపాటు నిల్వ జీవితాన్ని పొడిగించే సామర్థ్యం కారణంగా ప్యాకేజింగ్‌లో వాటికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్లాస్టిక్‌ను ఉపయోగించే పరిశ్రమలలో బొమ్మల పరిశ్రమ ఒకటి. మొత్తం బొమ్మలలో 90శాతం కంటే ఎక్కువబొమ్మలు ప్లాస్టిక్‌తో తయారు చేయబడతాయని ఒక అంచనా. కొన్ని నివేదికల ప్రకారం 80 శాతం వరకు ప్లాస్టిక్ బొమ్మలు కొనుగోలు చేసిన ఒక సంవత్సరంలోపు నిరుపయోగంగా మారి ప్లాస్టిక్ వ్యర్థాలుగా పర్యావరణంలోకి వచ్చి చేరుతాయి. పర్యారణానికి ప్రమాదకరంగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించడానికి ముందుగా ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, ప్రత్యేకించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను తగ్గించడానికి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలు అవసరం. వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, పునరుత్పత్తి సేకరణ నిష్పత్తిని పెంచడంసహా సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను అమలుచేయడం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌లకు బదులుగా పునర్వినియోగించదగిన, స్థిరమైన ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహించడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చు. గ్లోబల్ ప్లాస్టిక్ ఒప్పందం వంటి అంతర్జాతీయ ఒప్పందాలు ప్లాస్టిక్ మొత్తం జీవిత చక్రాన్ని పరిష్కరించే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆదిశగా కృషి చేస్తు న్నాయి. ప్లాస్టిక్ కాలుష్యంతో సంభవించే పర్యావరణ, ఆరోగ్య ప్రమాదాలు ప్లాస్టిక్ పై ఆధారపడటాన్ని తగ్గించడం తోపాటు దానిహానికరమైన ప్రభావాలను తగ్గించడానికి తీసుకోవలసిన చర్యల ఆవశ్యకతను నొక్కిచెబుతున్నాయి. వివిధ పరిశ్రమ వర్గాలతో పాటు వ్యక్తిగత వినియోగదారులు కూడా ప్లాస్టిక్ వినియోగం విషయంలో 3ఆర్ సూత్రాన్ని త్రికరణ శుద్ధిగాపాటించి పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలి. •

# ఇక నిమిషకు రక్ష 'బ్లడ్‌మనీ' ఒక్కటే!




## ఆమె మరణశిక్ష ఆపేందుకు అవకాశాలు అతితక్కువ

## సుప్రీంకోర్టులో జరిగిన విచారణ, 18కి వాయిదా

### నర్సు ప్రాణాలు కాపాడాలని జైశంకర్‌కు లేఖరాసిన సిఎం విజయన్

**ఢిల్లీ:** జులై 16న యెమెన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొం టున్న కేరళ నర్సు నిమిష ప్రియ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా హత్య కేసులో మరణశిక్ష ఎదు ర్కొంటున్న నిమిషను కాపాడేందుకు భారత ప్రభుత్వం వద్ద ఉన్న అవకాశాలు అతితక్కువని కేంద్రం తరపున భారత అటార్నీ జనరల్ సుప్రీం ధర్మాసనానికి నివేదించారు. ప్రియ ఉరిశిక్ష ఉత్తర్వును నిలిపివేయడానికి భారత ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. అయితే, బ్లడ్ మనీ సెటిల్‌మెంట్ మాత్రమే నిమి షను కాపాడగలిగే ఏకైక మార్గం అని ఏజీఐ వెం కటరమణి సుప్రీంకోర్టుకు తెలియజేశారు. నిమిష ప్రియను ఉరిశిక్ష నుంచి దౌత్యపరమైన చర్చల ద్వారా రక్షించేలా భారత ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆమె తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో జులై 10వ తేదీన అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ పై విచారణ జరిపింది. కేంద్రం తరపున భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తన వాదనలు వినిపించారు. జులై 16న కేరళ నర్సు మర ణశిక్షను ఆపేందుకు లేదా వాయిదా వేయిం చేందుకు భారత ప్రభుత్వం వద్ద మిగిలి ఉన్న అవకాశాలు అతి తక్కువని తెలిపారు. భారత్ యెమెన్‌ల మధ్య దౌత్యపరంగా సత్సం బం ధాలు లేకపోవడమూ ఒక కారణమని అన్నారు. యెమెన్ సున్నితత్వాన్ని దృష్టిపెట్టు కుని కేంద్ర ప్రభుత్వం ఈవిషయంలో పెద్దగా చేయగలి గిందేమి లేదన్నారు. ఇక బ్లడ్ మనీ మాత్రమే నిమిషను కాపాడేందుకు ఉన్న చిట్టచివరి అవ కాశమని, అది కూడా ప్రైవేటు ఒప్పందం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నిమిష తరపు న్యాయవాది వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు ఈ కేసు తదుపరి విచా రణను జులై 18కి వాయిదా వేసింది. కేసు స్థితి గురించి ఇరువర్గాల తదుపరి విచారణలో కోర్టుకు తెలియజేయవచ్చు అని బెంచ్ తన ఉత్తర్వులో పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ సందీప్ మెహతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ లోగా ఆమె ప్రాణాలు కోల్పోతే అది అత్యంత విచారకరమని అన్నారు. అయితే, ఇప్పటికే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిమిషను ప్రధాని కాపాడాలని కోరుతూ నిన్న విదేశాంగ శాఖ మంత్రి జై జైశంకర్‌కు లేఖ రాశారు. కేరళకు చెందిన నిమిష ప్రియ నర్సు కోర్సు పూర్తి చేసి 2008లో యెమెన్‌లో ఉద్యోగంలో చేరింది. 2011లో ఆమెకు థామస్ అనే వ్యక్తితో వివా హమైంది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి క్లినిక్ తెరవాలనుకున్నారు. యెమెన్‌లో ఇతర దేశస్థులు సొంతంగా వ్యాపారం చేయడం కుదరదు. అం దుకని స్థానికుడైన తలాల్ అదిబ్ మెహదితో కలిసి అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను మొదలుపెట్టారు. అయితే, 2014లో నిమిష భర్త, కూతురు ఆర్థిక కారణాల కారణంగా ఇం డియాకు తిరిగొచ్చేశారు. నిమిష మాత్రం యెమెన్ అంతర్యుద్ధంలో చిక్కుకుని ఇంటికి తిరిగి రాలేకపోయింది. ఆ తర్వాత నుంచి మెహది ఆమె పాస్ పోర్టు, డబ్బు లాక్కుని చిత్రహింసలకు గురిచేశాడు. దీంతో 2016లో ఆమె పోలీసులకు కంప్లైంట్ చేసింది. అయినా ఫలితం దక్కకపోవడంతో 2017లో ఓ రోజున తన పాస్ పోర్టు తీసుకునేందుకు మెహదీకి మత్తుమందు ఇచ్చింది. దురదృష్టవశాత్తూ డోసు ఎక్కువై మెహదీ చనిపోవడంతో అతడి మృతదే హాన్ని వాటర్ ట్యాంకులో పడేసి సౌదీకి పారిపో యేందుకు ప్రయత్నిస్తూ పోలీసులకు పట్టుబ డింది. అనూహ్యంగా హత్య కేసులో ఇరుక్కున్న కేరళ నర్సు నిమిషను కాపాడేందుకు బ్లడ్ మనీ మాత్రమే చివరి అవకాశం. అంటే, మృతుడి కుటుంబం నిమిష కుటుంబం ఇవ్వజూ పుతున్న రూ.8.6 కోట్ల మొత్తాన్ని పరిహారంగా తీసుకుని క్షమించేందుకు అంగీకరించాలి. యెమెన్ చట్టాల ప్రకారం అలా ఒప్పుకుంటే నిందితుడిని వదిలేసే అవకాశం ఉంది.



# పగలు తేనెలూరే మాటలు.. రాత్రి బాంబు దాడులు

### రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ట్రంప్ ధ్వజం

**వాషింగ్టన్, జూలై 14:** ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనను రష్యా తోసిపుచ్చింది. దీంతో ఆగ్రహించిన అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై మరోసారి మండిపడ్డారు. ఆయన తీరు తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్న ట్రంప్.. మాస్కోపై ఆంక్షలకు సిద్ధమయ్యారు. మరోవైపు, ఉక్రె యిన్‌కు అత్యాధునిక ఆయుధాలను అందించేం దుకు అంగీకరించారు. 'ఆయన (పుతిన్) ఉద్దే శమేంటో అర్థమవుతోంది. పగలు ఆయన చాలా అందంగా మాట్లాడుతారు. రాత్రయితే ప్రజలపై బాంబులతో విరుచుకుపడతారు. అలాంటి ప్రవ ర్తన మాకు నచ్చట్లేదు' అని ట్రంప్ దుయ్య బట్టారు. ఈ సందర్భంగా మాస్కోపై ఆంక్షలను విధించే అంశాన్ని సూచనప్రాయంగా వెల్లడిం చారు. 'రష్యాపై కొత్త, కఠిన ఆంక్షలు అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. దీనిపై ఏం చేద్దామో సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) చూద్దాం' అని అన్నారు. కాగా మాస్కోపై ఆంక్షల కోసం ఓ ద్వైపాక్షిక బిల్లును యుఎస్ సెనెటర్లు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రష్యాకు సాయం చేసే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధించేలా ఈ బిల్లును రూపొందిం చినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ తెలిపారు.

**ఉక్రెయిన్‌కు ఆయుధాలు:** మరోవైపు, రష్యాతో సుదీర్ఘంగా పోరాటం చేస్తోన్న ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించనున్నట్లు ట్రంప్ అం గీకారం తెలిపారు. పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను కీవ్‌కు పంపించనున్నట్లు వెల్లడిం చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ దేశానికి చాలా అత్యవసరమని పేర్కొన్నారు. అయితే, ఎన్ని ఆయుధాలను పంపిస్తామన్న విషయాన్ని మాత్రం ఆయన చెప్పలేదు. ఉక్రెయిన్‌కు కీలక ఆయుధాల సరఫరాను నిలిపివేస్తామని ఇటీవలే ప్రకటించిన ట్రంప్ కొద్ది రోజులకే తన నిర్ణ యాన్ని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఆ దేశానికి రక్షణాత్మక ఆయుధ వ్యవస్థలను అం దించాల్సిన అవసరం ఉందని అభిప్రాయప డ్డారు. అయితే, ఈ ఆయుధాలను తాము ఉచి తంగా ఇవ్వబోమని తెలిపారు. వీటికి 100 శాతం చెల్లింపులు జరుగుతాయని, మేం వ్యాపారం చేస్తామని స్పష్టం చేశారు.




## యునెస్కో వారసత్వ సంపదలో

# 'మరాఠా కోటలు'

**ప్యారిస్, జూలై 14:** పారిస్‌లో జరిగిన 47వ యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ సమా వేశంలో భారతదేశం మరో చారిత్రక విజయాన్ని సాధించింది. 'మరాఠా సైనిక కోటలు' యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరాయి. దీంతో భారతదేశంలో ఉన్న యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ల సంఖ్య 44కు చేరింది. ఈ గుర్తింపు మరాఠా సామ్రాజ్యం యొక్క సైనిక చాతుర్యం మరియు కోటల నిర్మాణ కళను ప్రపంచానికి చాటిచెప్పింది. 17వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దం వరకు నిర్మితమైన 12 కోటల సమూహం ఈ సీరియల్ నామినేషన్‌లో భాగం. మహారాష్ట్రలోని 11 కోటలు సల్హేర్, శివనేరి, లోహగఢ్, ఖండేరి, రాయగఢ్, రాజగఢ్, ప్రతాపగఢ్, సువర్ణదుర్గ్, పన్హాలా, విజయదుర్గ్, సింధుదుర్గ్ మరియు తమిళనాడులోని జింజీ కోట ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కోటలు మరాఠా రాజులు, ముఖ్యంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క వ్యూహాత్మక సైనిక దృష్టిని మరియు స్వరాజ్య భావనను ప్రతిబింబిస్తాయి.

# అమెరికా, సౌదీలకు దీటుగా బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా

**మనామా, జూలై 14:** గల్ఫ్ దేశాల్లో శాశ్వత నివాసం కోసం చూస్తున్న వారికి బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా ఒక బంపర్ ఆఫర్ అనొచ్చు. 2022లో ప్రవేశపెట్టిన ఈ వీసా, యూఏఈ గోల్డెన్ వీసా మరియు సౌదీ అరే బియా ప్రీమియం రెసిడెన్సీ కంటే ఎక్కువ స్వేచ్ఛ, తక్కువ ఖర్చుతో కూడిన ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఈ వీసా ప్రొఫె షనల్స్, ఇన్వెస్టర్లు, రిటైర్ అయినవారికి అనువైనదిగా ఉంది. సులభమైన అర్హతలతో, సరళమైన దరఖాస్తు ప్రక్రియతో అందుబాటులోకి తెచ్చారు. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా యొక్క ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, ఉద్యోగ స్పాన్సర్‌షిప్ లేకుండా పనిచేసే స్వేచ్ఛ. గల్ఫ్ దేశాల్లో సాధారణంగా రెసిడెన్సీ వీసా ఒక నిర్దిష్ట యజమాని లేదా ఉద్యోగ ఒప్పందంతో ముడిపడి ఉంటుంది. కానీ, బహ్రెయిన్ వీసా హోల్డర్లు ఏ యజమాని వద్దనయినా పనిచేయ వచ్చు, సొంత వ్యాపారం ప్రారంభించవచ్చు లేదా ఫ్రీలాన్స్‌గా పనిచేయవచ్చు. గల్ఫ్ దేశాల్లో ఇటువంటి వెసులుబాటు చాలా అరుదైన విషయం. ఇది ప్రొఫెషనల్స్‌కు ఆకర్షణీయంగా



ఉంటుంది. బహ్రెయిన్‌లో జీవన వ్యయం యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. గృహ, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు రోజువారీ ఖర్చులు చవక అని చెప్పాలి. అయినప్పటికీ ఉన్నత జీవన ప్రమాణాలు పొందవచ్చు. ఈ అంశం కుటుంబాలకు ఆర్థిక ఒత్తిడి లేకుండా దీర్ఘకాల నివాసం కోసం బహ్రెయిన్‌ను ఆకర్షణీయ గమ్యస్థానంగా చేస్తుంది. అదనంగా, ఈ వీసా కుటుంబ సభ్యులను స్పాన్సర్ చేసే సౌలభ్యాన్ని కలిగి ఉంది. ఇతర గల్ఫ్ దేశాల్లో రెసిడెన్సీని కొనసాగించడానికి నిర్దిష్ట సమయంలో దేశంలో ఉండాల్సిన అవసరం ఉంటుంది. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసాదారులకు ఈ ఇబ్బంది లేదు. వీసా హోల్డర్లు విదేశాల్లో ఎంత కాలం ఉన్నా రెసిడెన్సీ స్థితిని కోల్పోకుండా ఉండేలా చేస్తుంది. ఈ సౌలభ్యం గ్లోబల్ ప్రొఫెషనల్స్‌కు బహ్రెయిన్‌ను ఒక స్థిరమైన ఎంపికగా చేస్తుంది. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసాకు అర్హత సాధించడం సులభం మరియు సరళమైనది. ఇన్వెస్టర్లు, ప్రొఫెషనల్స్ లేదా రిటైర్ అయిన వాళ్లు ఈ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్థిక స్థిరత్వం, ఆరోగ్య బీమా మరియు నేర చరిత్ర లేని నేపథ్యం వంటివి అర్హతలుగా ఉంటాయి. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా లేదా బహ్రెయిన్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ ద్వారా జరు గుతుంది, ఇందులో ఆర్థిక పత్రాలు, గుర్తింపు పత్రాలు సమర్పించాలి. ఈ ప్రక్రియ యూఏఈ లేదా సౌదీ అరేబియా కంటే సరళమైనది మరియు వేగవంతమైనది. బహ్రెయిన్ యొక్క ఆర్థిక వైవిధ్యీకరణ వ్యూహంలో భాగంగా, విజన్ 2030 కింద ఈ వీసా ప్రవేశపెట్టారు. యూఏఈ యొక్క అధిక ఖర్చులు లేదా సౌదీ అరేబియా యొక్క కఠిన సామాజిక నిబంధనలు అడ్డంకిగా ఉన్నవారికి, బహ్రెయిన్ స్వాగతం చెపుతోంది. భారతీయులకు ఈ వీసా ఒక అందివచ్చిన అవకాశం. ఇది గల్ఫ్‌లో స్థిరమైన, సౌకర్యవంతమైన జీవనాన్ని వాగ్దానం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# ఆ స్విచ్‌లతో జాగ్రత్త.. పైలట్లకు ఎతిహాద్ ఎయిర్‌వేస్ అలర్ట్

**అబుదాబి, జూలై 14:** అహ్మదాబాద్‌లో ఎయిరిండి యాకు చెందిన ఎఐ-171 విమానం కూలిన ఘటనలో ఇంధన స్విచ్‌ల వైఫల్యం వల్ల ఇంజిన్లకు ఇంధనం సరఫరా నిలిచిపోయిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిన విషయం తెలిసిందే. దీంతో బోయింగ్ విమానాల్లో ఇంధన సరఫరా స్విచ్‌లపై చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ పైలట్లకు పలు సూచనలు జారీ చేసింది. బోయింగ్ 787 విమానాల్లో ఇంధన స్విచ్‌ల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ పైలట్లకు సూచించినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఎయిర్‌లైన్స్ చెందిన అన్ని విమానాల్లో స్విచ్‌లు పనిచేస్తున్న విధా నంపై కూడా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబం ధించిన ప్రాథమిక నివేదిక వెలువడిన తర్వాత



ఎతిహాద్‌దక్షిణ కొరియాకు చెందిన విమానయాన సంస్థలు కూడా తమ పైలట్లకు ఇదేవిధమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) సంస్థ 2018లోనే బోయింగ్ 737 జెట్‌లలోని ఇంధన స్విచ్‌ల వినియోగంపై హెచ్చ రికలు చేసినట్లు తెలుస్తోంది. పలు బోయింగ్ 737 విమానాల్లో లాకింగ్ ఫీచర్‌తో ఉన్న ఇం ధన నియంత్రణ స్విచ్‌లు పనిచేయట్లేదని పేర్కొంది. అయితే దీని దర్యాప్తుపై 'ఎయిర్ వర్తీ నెస్ బులెటిన్' నుంచి ఆదేశాలు రాకపోవడంతో దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలో కూడా అదే స్విచ్ డిజైన్లు ఉన్నట్లు సమాచారం.

# 'నేరాల రాజధాని'గా బీహార్: రాహుల్

**పాట్నా, జులై 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు విమ ర్శలకు పదునుపెడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీ వల చోటు చేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పం దించారు. 'నేరాల రాజధానిగా బీహార్' మారిందని విమర్శించారు. నిరుద్యోగ యువత హత్యలు చేస్తూగూండాలుగా మారుతుంటే సిఎం నితీశ్ కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. ఈసారి ఓటు అనే ఆయుధాన్ని ప్రభుత్వాన్ని మార్చ డానికి మాత్రమే కాకుండా బీహార్‌ను కాపాడేం దుకువినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టపగలు ఓ లాయర్‌ని, అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా, బిజెపి నేత సురేంద్రకేవాట్‌లు హత్యకు గురయ్యారు. ఈ క్రమంలోనే ప్రభుత్వఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని, వచ్చే అయిదేళ్లలో కోటిమందికి ఉద్యోగాలు కల్పి స్తామని రాహుల్ కీలక ప్రకటన చేశారు.

# శవమై తేలిన అదృశ్యమైన ఢిల్లీ విద్యార్థిని



**న్యూఢిల్లీ, జూలై 14:** ఆరు రోజులుగా అదృశ్యమైన ఓ విద్యార్థిని యమునా నదిలో శవమై తేలింది. ఈ ఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురకు చెందిన 19 ఏళ్ల స్నేహ దేబ్‌నాథ్ తన ఫ్యామిలీతో కలిసి ఢిల్లీలోని పర్యవరణ్ కాంప్లెక్స్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆత్మ రామ సనాతన్ ధర్మ కళాశాలలో బీఏ మ్యాథమెటిక్స్ చదువు తోంది. అయితే, స్నేహ జులై 7వ తేదీ ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. స్నేహితురాలు పిటునియాను కలిసేందుకు సరాయ్ రోహిల్లా రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఈనెల 7న ఉదయం 5:15 గంటలకు స్నేహ ఇంటి నుంచి క్యాబ్‌లో బయల్దేరింది. 8:45 గంటల సమయంలో కుటుంబ సభ్యులు స్నేహను సంప్రదించగా ఫోన్ స్విచ్చాఫ్ అని వచ్చింది. దీంతో వారు స్నేహ స్నేహితురాలు పిటునియాకు ఫోన్ చేయగా తన వద్దకు రాలే దని చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను సంప్రదించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్నేహ కోసం తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలో స్నేహ సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద కనిపించినట్లు స్థానికులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సాయంతో యమునా నదిలో విద్యార్థిని కోసం గాలించారు. ఈ క్రమంలో అదృశ్యమైన ఆరు రోజుల తర్వాత ఆదివారం సాయంత్రం సిగ్నేచర్ బ్రిడ్జికి పది కిలోమీటర్ల దూరంలోని గీతా కాలనీ ఫ్లైఓవర్ సమీపంలో స్నేహ మృతదేహాన్ని గుర్తించారు. స్నేహ కొంత కాలంగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్టు ఆమె స్నేహితులు తెలిపారు.

# ఖైదీ కడుపులోంచి సెల్‌ఫోన్ బయటకు తీసిన వైద్యులు

**బెంగళూరు, జూలై 14:** కర్ణాటకలో ఓ ఖైదీ కడుపు నుంచి సెల్‌ఫోన్ బయటపడింది. కడుపునొప్పి అంటూ ఫిర్యాదు చేసిన బాధితుడిని జైలు అధికారులు ఆస్పత్రికి తరలించగా అతడి కడుపులో సెల్‌ఫోన్ కనిపించింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి సెల్‌ఫోన్ బయటికి తీశారు. భారత న్యాయ సంహితలోని పలు సెక్షన్ల ప్రకారం ఖైదీపై పోలీసు కేసు నమోదు చేశారు. కర్ణాటకకు చెందిన దౌలత్‌ఖాన్ గంజాయి అక్రమ రవాణా కేసులో దోషిగా తేలటంతో పదేళ్ల శిక్ష పడింది. అతను శివమొగ్గ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గతనెల23న కడుపునొప్పి వస్తోందని అధికారులకు ఫిర్యాదు చేశాడు. దౌలత్‌ఖాన్‌ను జైలు వైద్యుడి దగ్గరకు తీసు కెళ్లారు. అతడిని ఏం తిన్నావని అడగగా, రాయి ని మింగినట్లు చెప్పాడు. ఆ తర్వాత తీవ్రమైన



కడుపు నొప్పి రావడంతో 24న శివమొగ్గలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే నిర్వ హించిన వైద్యులు ఖైదీ కడుపులో సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. సెల్‌ఫోన్ బయటికి తీయా లంటే శస్త్రచికిత్స చేయాలన్నారు. ఏదో అను కుంటే మరేదో అయిందనుకున్న ఖైదీ దౌలత్ ఖాన్ చేసేది లేక శస్త్రచికిత్సకు అంగీకరించాడు. శస్తచికిత్స చేసి ఖైదీ కడుపు నుంచి కీప్యాడ్ ఫోన్ ను బయటికితీశారు. ఈ నెల 8న జైలు అధికా రులకు సీల్డ్ కవర్‌లో దాన్ని అప్పగించారు. అదే రోజున ఖైదీని కూడా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. సిబ్బంది సహకా రంతో జైల్లో సెల్‌ఫోన్ వాడిన ఖైదీ అధికారుల సోదాల సమయంలో ఆ విషయం బయటపడ కుండా మింగినట్లు తెలుస్తోంది. ఆ విషయం చెప్పకుండా కడుపు నొప్పి అంటూ దృష్టి మరలించేందుకు ప్రయత్నం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. భారత న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద సదరు ఖైదీపై కేసు నమోదు చేశారు. నిషేధిత వస్తువుల జాబితాలో ఉన్న సెల్‌ఫోన్ కట్టుదిట్టమైన భద్రత ఉండే జైల్లోకి ఎలావచ్చిందనే అంశాన్నితేల్చును న్నట్లు చెప్పారు. జైలుసిబ్బందే ఖైదీకి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తు న్నట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మిథున్ కుమార్ తెలిపారు.

# నెలరోజులుగా కేరళలోనే బ్రిటన్ ఫైటర్‌జెట్!

**తిరువనంతపురం, జూలై 14:** బ్రిటన్ నౌకాదళానికి చెందిన సూపర్ ఫైటర్‌జెట్ ఎఫ్-35 ఇంకా కేరళలోనే ఉంది. ఈ విమానం హైడ్రాలిక్ వ్యవస్థ విఫలం కావడంతో గతనెల 14వ తేదీ తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. గతవారం తిరువనంతపురం వచ్చిన 24 మంది సభ్యుల బ్రిటిష్ నిపుణుల బృందం ఈ ఫైటర్‌జెట్ రిపేర్లకు కసరత్తులు చేస్తోంది. 14మంది సాంకేతికనిపుణులు, మరో పదిమంది క్రూ సిబ్బంది ఉన్నారు. నెలరోజుల్లో అనేకసార్లు హైడ్రాలిక్‌సమస్య పరిష్కారానికి యత్నించినా అన్నీ విఫలం అయ్యాయి. ప్రస్తు తం ఈ విమానం సమీపంలో బ్రిటన్‌భద్రతా సిబ్బందినే ఉంచారు. భారత సిబ్బంది దూరంగా గస్తీకాస్తున్నారు. సాంకేతిక సిబ్బంది ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే కొన్నిభాగాలు విడదీసి భారీ విమానం అయిన సి-17గ్లోబ్‌మాస్టర్‌లోకి ఎక్కించి బ్రిటన్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇది కేవలం లఖీద్‌మార్టిన్ ఇంజనీర్లకే సాధ్యం అని నిపుణులు చెపుతున్నారు.

# ఉరుములు మెరుపుల వర్షాలకు 12మంది మృతి

## మరో ఏడుగురికి తీవ్రగాయాలు

**రాంచి, జూలై 14:** జార్ఖండ్‌లోని వివిధ జిల్లాల్లో ఉరుములు మెరుపులతోకురిసిన భారీ వర్షాల కుగాను 12 మంది చనిపోయారు. మరో ఏడు గురికి తీనరవస్థాయిలో గాయాలు కావడంతో వారిని ఆసుపత్రులకు తరలించారు. తమ పొలాల్లో పనిచేస్తున్నపుడే పిడుగులు పడిన శబ్దాలు భారీ వర్షాలకు ఎక్కువమంది చనిపో యారని ప్రభుత్వం ప్రకటించింది. గిరిధ్, దుంకా, జిల్లాల భారీస్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ రెండుజిల్లాలోను ముగ్గురుచొప్పున చనిపోయార. చారాలో గీతాదేవి, అనితాదేవిలు పిడుగులుపడి చనిపోయారు. సవితాదేవి తీవ్రస్థాయిలో



కాలినగాయాల పాలయ్యారు. గిరిధ్‌లో 18 ఏళ్ల దస్తగిర్ ఆలమ్ 50ఏళ్ల ఝూరియాదవ్‌లు చనిపోగా అశోక్‌మెహతో, ఆయన భార్య ప్రమీలాదేవిలకు తీవ్రగాయాలయ్యాయి. ఇక పశ్చిమ సింగ్‌భుమ్‌జిల్లాలో భరిదా నరగామంలో కూడా 14 ఏళ్ల విద్యార్థి చనిపోయారు. గతజూన్ ఒకటవ తేదీనుంచి జార్ఖండ్‌లో 510 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సగటు సాధారణ వర్షపాతంకంటే 61శాతం అదనపు వర్షపాతం నమోదయింది. అధిక వర్షాలు జనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగించారు. వ్యవసాయ పనులకు విఘాతం కలిగింది. వరిసాగు తీవ్రంగా దెబ్బతిన్నది. 25శాతం నాట్లు వరదలకారణంగా కొట్టుకొనిపోయాయి. తుపాను తరహాలోనే భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని, బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావం ఉందని వెల్లడిం చారు. పశ్చిమ సింగ్భుమ్, సిండేగా, కుంటి, గుమ్లా జిల్లాల్లో ఇప్పటికే ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసారు. రాంచి, లోహార్‌డాగా, గిరిధ్, దేవ్ ఘర్, ధన్‌బాద్, జంతారా, సరాయికేలా, తూర్పు సింగ్‌భుంజిల్లాల్లోకూడా ఎల్లో అలర్ట్ జారీ చేసారు.


# ఈశాన్యభారత్‌లో ఉల్ఫా వేర్పాటువాదులపై భారత్ మెరుపుదాడులు

**న్యూఢిల్లీ, గువాహటి, జూలై 13:** ఈశాన్య ప్రాం తంలోని వేర్పాటువాద గ్రూపులపై భారత సైన్యం సర్జికల్ దాడులకు దిగింది. మయన్మార్ లోని తమ శిబిరాలపై భారత సైన్యం డ్రోన్, క్షిపణిదాడులు చేసినట్టు నిషేధిత ఉల్ఫాఐ (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోంఇం డిపెండెంట్)ప్రకటించింది. ఈ దాడుల్లో ముగ్గురు సీనియర్ నాయకులను కోల్పోయామని, దాదాపు 19మంది గాయపడ్డారని వెల్లడించింది. మయ న్మార్ సైన్యం సహకారంతో ఉల్ఫా, ఎన్ఎస సీఎన్‌కే (నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగా లాండ్ ఖప్లాంగ్) స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున భారత సైన్యం డ్రోన్ దాడు లు చేసినట్టు సమాచారం. భారత సరిహద్దులోని మయన్మార్‌లో నాగా స్వయం పాలిత ప్రాం తమైన హోయత్ బస్తీలోని ఉల్ఫా తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం, వక్తం బస్తీలోని 779 శిబిరంతోపాటు మరో రెండు శిబిరాలు లక్ష్యంగా రెండు గంటలకుపైగా దాడులు జరిగాయి. ఈ దాడులకు 300కుపైగా డ్రోన్లను వినియోగించినట్టు తెలిసింది. ఈ దాడుల్లో ఉల్ఫా అగ్ర కమాండర్ నయన్ మేధి అలియాస్ నయన్ అసోం మరణించినట్టు ఉల్ఫా తెలిపింది. కాగా, మయన్మార్‌లోని నిషేధిత ఉల్ఫాఐ శిబిరాలపై డ్రోన్ దాడులు చేయలేదనిభారత సైన్యం ఆది వారం స్పష్టంచేసింది. ఉల్ఫాఐ చేసిన ప్రకటనను భారత సైన్యం ఓ ప్రకటనలో ఖండించింది.

# భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణించొచ్చు

## విడాకుల కేసులో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు!

**న్యూఢిల్లీ, జులై14:** భార్యాభర్తల విడాకుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిం చవచ్చని వెల్లడించింది. వారి మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికా ర్డింగ్స్ స్పష్టం చేస్తాయని అత్యున్నత న్యాయ స్థానం అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై పంజాబ్, హర్యానా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కోర్టు పక్కనపెట్టింది. పంజాబ్‌లోని బఠిండాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్ర యించారు. తన పట్ల భార్య క్రూరంగా ప్రవర్తి స్తోందని ఆరోపించిన ఆయన అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికా



ర్డులను సమర్పించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకుల కేసు విచారణను ప్రారంభించింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ ఆమె పంజాబ్, హర్యానా హైకో ర్టును ఆశ్రయించారు. తన సమ్మతి లేకుండా తనకు తెలియకుండా ఆ సంభాషణలను రికార్డ్ చేశారని వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లేనని వాదించారు. ఆమె అభ్యర్థనను అంగీకరించిన హైకోర్టు ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టింది. దీంతో ఆ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య సంభా షణకు సంబంధించిన సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిస్తే వైవాహిక బంధాలు ప్రమాదంలో పడతాయని, భాగస్వాములపై నిఘా పెట్టడాన్ని ప్రోత్సహిం చినట్లు అవు తుందని కొందరు వాదిస్తున్నారు. కానీ ఆ వాదన సమర్థనీయమైన దని మేం భావించడం లేదు. ఒకరిపై ఒకరు నిఘా పెట్టే పరిస్థితికి వచ్చారంటే వారి మధ్య వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చు. పరస్పరం విశ్వాసం లేదని స్పష్టమవుతోంది. అందుకే ఆ రికార్డింగ్స్‌ను సాక్ష్యాలుగా పరిగణించుకోవచ్చు అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం ఈ విడాకుల కేసులో ట్రయల్ కోర్టు తమ విచారణ కొనసాగించవచ్చని తెలిపింది.

## సంక్షిప్తంగా

# నేషనల్ హెరాల్డ్ కేసులో తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీ, జూలై 14:** నేషనల్ హెరాల్డ్ మనీలాం డరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును పరి గణనలోకి తీసుకునే అంశంపై రౌస్‌అవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ నెల 29న దీనిపై తీర్పు వెలువరించనుంది. మనీలాండరింగ్‌కు ఇదొక 'క్లాసికల్ ఎగ్జాంపుల్' అంటూ ఇడి ఇం తకుముందు పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేతలు రూ. 2,000 కోట్ల మేరకు నేరపూరిత కుట్ర, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ వివా దానికి కీలకంగా ఉంది. ఇం దు లో సోనియా



గాంధీ, రాహు ల్ గాంధీకి సం యుక్తంగా 76 శాతం వాటా ఉంది. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ప్రచు రించే అసోసి యేటెడ్ జర్న ల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వాడుకుందని ఇడి ప్రధాన ఆరోపణగా ఉంది.


# విజయ్ బేసిక్ రాజకీయాలు తెలుసుకోవాలి



**చెన్నై, జూలై 14:** తమిళనాడు లో అజిత్ కుమార్ అనే ప్రైవేట్ సెక్యూరిటీగార్డు పోలీస్ కస్టడీలో మర ణించిన ఘటన ఆ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. అధికార డీఎంకే (డిఎంకె) బాధ్యతార హిత్యంవల్లే కస్టోడియల్ డెత్స్ జరుగుతు న్నాయని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తుం డటంతో ఈ ఘటన రాజకీయ రంగు పులు ముకుంది. అజిత్ కుమార్ కస్టోడియల్ డెత్‌ను నిరసిస్తూ టీవీకే పార్టీ భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టింది. టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. టీవీకే శ్రేణులు భారీ సం ఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విజయ్ అధికార డీఎంకేపై విమ ర్శలు గుప్పించారు. అజిత్‌కుమార్ కుటుం బానికి ముఖ్యమంత్రి స్టాలిన్ సారీచెప్పడంపై స్పందిం చారు. సారీ చెబితే సరిపోదని, బాధిత కుటుం బానికి న్యాయంచేయాలని డిమాండ్ చేశారు.

# స్వామినాథన్ స్మారక రూ.100ల నాణెం

**న్యూఢిల్లీ, జూలై 13:** ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వా మినాథన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరిం చుకుని రూ. 100 విలువ గల నాణెం విడుదల చేస్తూ కేంద్రం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. స్వామినాథన్‌ను భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. అధిక దిగు బడినిచ్చే వంగడాలను ప్రవేశ పెట్టడంలో ఆయన చేసిన కృషి కారణంగా దేశం ఆహారోత్పత్తిలో



స్వయం సమృద్ధి సాధించగలి గింది. ఈ ప్రత్యేక నాణెం 44 మిల్లీ మీటర్ల చుట్టు కొలతతో, 35 గ్రాముల బరువుతో ఉంటుంది. ఇది 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమాలతో తయారయింది.

# చికెన్ ముక్క కోసం స్నేహితుని విందులో హత్య



**బెళగావి, జూలై 14:** పెళ్లి విందులో చికెన్ ముక్క కోసం స్నేహితుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ.. చివరకు హత్యకు దారితీసింది. విస్మయానికి గురిచేసే ఈ ఘటన కర్ణాటకలోని బెళగావిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెళగావి జిల్లా యరగట్టి తాలూకాకు చెందిన అభిషేక్ కొప్పాడ్ అనే యువకుడికి కొద్ది రోజుల కిందట వివాహం జరిగింది. ఈ క్రమంలో అభిషేక్ తన ఫామ్‌లో స్నేహితులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విందుకు అతడి స్నేహితుడు వినోద్ హాజరయ్యాడు. విట్టల్ అనే వ్యక్తి వడ్డిస్తుండగా.. తనకు చికెన్ తక్కువైందని 'ఇంకొక ముక్క వేయమని' వినోద్ అడిగాడు. దీంతో విట్టల్, తోటి అతిథుల మధ్య వాగ్వాదం చోటుచేసు కుంది. ఈ వివాదం చినికిచినికి గాలివానై పెద్ద గొడవకు దారితీసింది. ఘర్షణ పెరగడంతో చివరకు కోపంతో ఊగిపోయిన విట్టల్, పక్కనే ఉన్న ఉల్లిపాయలు కోసే కత్తి తీసుకుని వినోద్‌పై దాడి చేసి, విచక్షణా రహితంగా పొడి చాడు. తీవ్రంగా గాయపడిన వినోద్ రక్తస్రా వంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

# కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యం

## - బిసిలపై దాడులను ఖండించిన డా ఎన్ మారేష్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డా మారేష్

**విజయవాడ, జులై 14, ప్రభాతవార్త :** దేశంలో కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తమ విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధిసూచీలో ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో మన దేశ స్థానాన్ని మెరుగుపరుచుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా ఎన్ మారేష్ అన్నారు. 90ఏండ్ల తరువాత జరుగుతున్న ఈ కులగణన ద్వారా వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయం అందించడం సాధ్యమవుతుందన్నారు. కులగణన చేయడానికి నిర్ణయం తీసుకున్న ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌నుండి డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్‌ను ఏపికి తరలించాలన్నారు. కులగణన కోసం పలు మార్గదర్శకాలను ఆయన వెల్లడించారు. జనగణంలో కులగణన అంతర్భాగంగా వుండాలని, ప్రత్యేక ఫారం వుండకూడదని, సెన్సెస్ డిపార్ట్‌మెంట్లో శిక్షణ పొందిన వారిచే లెక్కింపు చేయాలని, ప్రతి కులానికి ఒక కోడ్ కేటాయించాలని, కేంద్ర, రాష్ట్రాల మధ్య తేడాలు రాకుండా బిసి లేదా ఓబిసి కాలం కొత్తగా ఏర్పాటు చేయాలన్నారు. బిసిలకు నియోజకవర్గా పునర్విభజనలో బిసిలకు న్యాయం జరగాలంటే కులగణన పారదర్శకంగా జరగాలన్నారు. ఏపి బిసి సంఘం ఆధ్వర్యంలో విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో సభలు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. 2029 ఎన్నికలకంటే ముందే చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బిల్లులో బిసిలకు ప్రత్యేక కోటా ఇవ్వాలన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో బిసిలపై దాడులను ఖండించారు. భవిష్యత్తులో దాడులు జరిగితే తీవ్ర చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో జక్కా శ్రీనివాసరావు, యార్లగడ్డ సందీప్, వీరబాబు, ఎల్లబాబు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

## డిఎస్పీ పార్థసారథి

## - 5తులాల బంగారం.. కిలో వెండి స్వాధీనం !

**కుప్పం, జులై 14 ప్రభాతవార్త** ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లాలోని కరంబూరు గ్రామానికి చెందిన శక్తివేలు (36) డ్రైవర్‌గా పనిచేస్తాడన్నారు. ఇతను తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి ఒంటరిగానే చోరీలకు పాల ్పడేవాడన్నారు. ఇతనిపై ఆంధ్ర, తమిళనాడులో సైతం కేసులు నమోదయ్యాయన్నారు. గత నెల 28వతేది రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, శ్రీనివాసులు తమిళనాడుకు వెళ్లి శక్తివేలు గురించి ఆరా తీసి అతన్ని అదుపులో తీసుకుని విచారించగా అతని చోరీల వ్యవహారం వెలుగుచూసిందన్నారు. నిందితుడి నుంచి 5తులాల బంగారం, కిలో వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకేసును ఛేదించిన నేపథ్యంలో పోలీసు సిబ్బందికి క్యాష్ రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు, రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుతో బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్ భేటీ

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృ ష్ణారావును సోమవారం బేగంపేట టూరిజం ప్లాజాలో ప్రముఖ బాలీవుడ్ నటుడు, జీ టీవీ రామాయణంలో రాముడి పాత్రధారి, బుద్ధిజం ప్రచారకులు గగన్‌మాలిక్ మర్యా దపూర్వకంగా కలిశారు. గగన్‌మాలిక్‌ను బుద్ధవనం ప్రాజెక్ట్‌స్పెషల్ ఆఫీసర్‌గా మల్లేపల్లి లక్ష్మయ్య.. మంత్రి జూపల్లికి పరిచయం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచ దేశాల్లో ప్రాచుర్యం కల్పించడం, వివిధ బౌద్ధదేశాలను బుద్ధ వనానికి రప్పించడం, వారి సాంస్కృతిక కేంద్రాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయ డంతో పాటు ఈ యేడాది అక్టోబర్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన బౌద్ధభిక్షువులు సుమారు 100 మందితో గుల్బర్గా మీదుగా బుద్ధవనానికి పాదయాత్రగా రావడం అంశాలను చర్చించారు.

# గంజాయి కేంద్రంగా పేరొందిన ఏజెన్సీ ప్రాంతం అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌గా మారింది

## - హోంమంత్రి వంగలపూడి అనిత



**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** గంజాయి కేంద్రంగా పేరొందిన ఏజెన్సీ ప్రాంతంపై ఆ అపవాదు పోగొట్టి అరకు బ్రాండ్ ఇమేజ్ తిరిగి తీసుకొచ్చామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. సోమవారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గంజాయిపై డేగ కన్ను ఉండాలనే లక్ష్యంతో ఈగల్ పేరు గంజాయ్ నిర్మూలన బృందానికి సీఎం చంద్రబాబు సూచించారని వివరించారు. ఈగల్ టీమ్ సభ్యులు సమర్థంగా పని చేస్తున్నారన్నారు. ప్రత్యేకంగా టీమ్‌లు ఏర్పాటు చేసుకొని గంజాయిపై ఉక్కుపాదం మోపారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అరకు, పాడేరు అంటే గంజా పండిస్తారనే స్థాయి నుంచి అరకు అంటే కాఫీకి ప్రపంచస్థాయి బ్రాండ్ అనే విధంగా చేశామన్నారు.. గంజాయిపై యుద్ధంలో భాగంగా ఏడాదిలో చేపట్టిన చర్యల వల్ల ఎన్నో మార్పులు తీసుకొచ్చాం. గత ప్రభుత్వ హయాంలో గంజాయి సాగు ఓ కుటీర పరిశ్రమ ద్వారా ప్రోత్సహించారని ఆరోపించారు.స్కూల్ పిల్లల బ్యాగుల్లోకి కూడా గంజాయ్ వెళ్లిన సంఘటనలు గత ప్రభుత్వంలో చూశామన్నారు. రాష్ట్రం నుండి గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండే ఒక యజ్ఞాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో బాగంగా విద్య, వైద్య, ఎక్సైజ్, గిరిజన సంక్షేమం మరియు హోం శాఖల మంత్రులతో ప్రభుత్వం ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ నేతృత్వంలోఅమరావతి హెడ్ క్వార్టర్ తో పాటు రాజమహేంద్రవరం మరియు విశాఖపట్నం కేంద్రాలుగా ఈగల్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 26 జిల్లాల్లో ఈగల్ సెల్స్ ను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నియంత్రణకై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని ప్రముఖ కేంద్రాల్లో చెక్ పోస్టులు, సిసి కెమేరాలు పెట్టి గంజాయి సాగును, రవాణాను నియత్రించడం జరిగిందన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 831 కేసులను బుక్ చేసి 2,114 మందిని అరెస్టు చేయడమే కాకుండా 23,770 కేజీల గంజాయిని, 27 లీటర్ల హాషిష్ ఆయిల్ ను సీజ్ చేయడం జరిగిందన్నారు.

# విధుల్లోకి రాకపోతే ఎస్మా చట్టం ప్రయోగించి చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ వినోద్ కుమార్




**వి, అనంతపురం, జులై 14 :(ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా లో శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం క్రింద రూ.3.83 కోట్ల నిధులు విడుదల కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకంపై ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం క్రింద 3.83 కోట్ల రూపాయల డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్ లో జమ కావడం జరిగిందన్నారు. వేతనాలు లేకపోవడం వల్ల ఏప్రిల్ 6వ తేదీ నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లడం జరిగిందన్నారు. కార్మికుల జీతాలు పిఎఫ్ చెల్లింపు కోసం ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం ద్వారా డబ్బులు విడుదలకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రోజు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ శివారెడ్డి అకౌంట్లోకి సి.ఎఫ్.ఎం.ఎస్ ద్వారా డబ్బులు ప్రభుత్వం నుంచి చెల్లింపు చేయడం జరిగిందని ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్ కింద పని చేసే కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం, రాయదుర్గం బ్రాంచ్ లకు సంబంధించి మార్చి వరకు జీతాలు ఇవ్వడం జరిగిందని, 2023 24 సంబంధించి ఎస్ఆర్ ఇన్ ఫ్రా వారు కార్మికులకు 16 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పీఎఫ్ బకాయిలు చెల్లించేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.ప్రభుత్వం నుంచి డబ్బులు రావడంతో కార్మికులు వెంటనే మంగళవారం నుంచి విధుల్లోకి రావాలని, కార్మికులు విధుల్లోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొంతమంది కార్మికుల విధుల్లోకి వచ్చారని, మరికొంతమంది విధుల్లోకి రాలేదని, కార్మికులు విధుల్లోకి రాకపోతే ఎస్మా చట్టం ప్రయోగించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు శ్రీరామిరెడ్డి త్రాగునీటి పథకం కింద ముగ్గురు కాంట్రాక్టర్లకు 16 కోట్ల రూపాయల డబ్బులు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్ డిఈ శిరీష, కార్యాలయం ఎస్ఈ పిఏ రామారావు పాల్గొన్నారు...

# తూర్పు ఇండొనేసియా ప్రాంతంలో భూకంపం

## రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.9గా నమోదు

**జకార్తా, జులై 14:** ఇండోనేసియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.9గా నమోదైంది. అయినప్పటికీ ఎలాంటి సునామీ ముప్పు లేదని ఫసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, తూర్పు మలుకు ప్రావిన్స్‌లోని తువాలుకు పశ్చిమాన 177 కి.మీ దూరంలో 80 కిమీ లోతులో భూకంపం కేంద్రీకృతమైంది. పశ్చిమ ఇండోనేసియాలో మధ్యా హ్నం 12:49 గంటల సమయంలో భూకంపం సంభవించింది. దీని ఫలితంగా తూర్పు ఇండోనేసియాలోని అనేక చిన్న పట్టణాల్లో ప్రకంపనలు సంభవించాయని ఆ దేశ విపత్తు ఉపశమన సంస్థ (ఇండోనేసియా డిజాస్టర్ మిటిగేషన్ ఏజెన్సీ) తెలిపింది. మరోవైపు జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగి, సహాయక చర్యలు ప్రారంభించాయి. అనేక ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బ తిన్నాయని, నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



### రింగ్ ఆఫ్ ఫైర్

సుమారు 27 కోట్ల జనాభా కలిగిన ఇండోనేషియా ఫసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అనే ప్రాంతంలో ఉంది. ఇది అత్యంత క్రియాశీల భూకంప కేంద్రాల జోన్. ఇక్కడ భూమి లోని క్రస్టులో వివిధ ప్లేట్లు కలుస్తాయి. కనుక ఇవి ఒకదానికొకటి ఢీకొనే టప్పుడు లేదా దూరంగా జరిగినప్పుడు భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇండోనేసియాలో 2004లో 9.1 తీవ్రతతో ఏర్పడిన భూకంపం వచ్చింది. దీని తరువాత హిందూ మహాసముద్రంలో వచ్చిన సునామీ అనేక దేశాల్లో తీవ్ర విషాదం నింపింది. ఒక్క ఇండోనేసియాలోనే ఈ సునామీ ధాటికి దాదాపు 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 2018లోనూ ఆ దేశంలోని పాలూ ప్రాంతంలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ తరువాత వచ్చిన సునామీ కారణంగా 2,200 మందికి పైగా మృతి చెందారు. ఇక 2021లో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా వేలాది మంది నిరాశ్రయులు అయ్యారు.

# ఎఐసిసి బిసి సలహా సమావేశాలకు తెలంగాణ నుంచి ఏడుగురికి ఆహ్వానం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఎఐసిసి బిసి సలహా మండలి బెంగుళూరు సమావేశాలకు హాజరుకావడానికి తెలంగాణ నుంచి ఏడుగురు బిసి నాయకులను ఆహ్వానించారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పశుసంవర్థకశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వి.హనుమంతరావు ఎంపి అనిల్‌యాదవ్,మాజీ ఎంపి మధుయాష్కీలకు హాజరు కాబో తున్నారు. తెలంగాణలో జరిగిన కులగణనపై వివరించడంతో పాటు, రాబోయే రోజుల్లో విద్య, ఉద్యోగంతోపాటు అధికారంలో కూడా 42శాతం బిసిలకు వాటా ఇవ్వడానికి చేస్తున్న కృషిని వివరిం చనున్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ వీటిపై మాట్లా డుతారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య నాయకత్వంలో 24మందితో ఎఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ సలహాకమిటిని వేశారు. పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్‌గౌడ్, హనుమంత రావులకు రాష్ట్రం నుంచిచోటు లభించింది. కొండా సురేఖ, వాకిటి శ్రీహరి అనిల్‌కుమార్, మధు యాష్కీలకు ప్రత్యేక ఆహ్వాని తులుగా మిగితా వారికి అవకాశం కల్పించారు.

# జగన్మాత సన్నిధిలో చాగంటి కోటేశ్వరరావు దంపతులు



**ఇంద్రకీలాద్రి, జులై 14, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో తీసుకోవాల్సిన ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలకు సంబంధించిన నివేదికను ఏపి ఫైర్‌సేఫ్టీ అధికారులకు సోమవారం ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. జులై 11న అగ్నిమాపక అధికారుల బృందం దుర్గమ్మవారి ఆలయాన్ని పూర్తిగా పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలను నివేదిక రూపొందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతు భక్తుల భద్రత ప్రధాన ధ్యేయంగా చర్యలు తీసుకుంటామన్నారు. - దుర్గమ్మవారి సేవలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు: దుర్గమ్మవారిని ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు వారికి ఇఓ ఆలయ మార్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశ్వీరచనాలు పలికారు. - వేదోక్తంగా గణపతి హోమం: దుర్గమ్మవారి ఆలయంలో సంకటహర చతుర్ధి సందర్భంగా గణేశ హోమం నిర్వహించారు. ఆలయంలో వేంచేసియున్న గణేశునికి సిద్ధి, బుద్ధి అమ్మవార్లకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్ పాల్గొన్నారు. - భక్తుల విరాళాలు: దుర్గమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రు.1,20,000లను విరాళంగా సోమవారం నవీన్ కుమార్ ఘట్టమనేని తమ తల్లిదండ్రులు రాజగోపాల్, రుసూద్ర పేరిట ఇఓకు అందించారు. విజయవాడకు చెందిన కరిపినేని నాగేశ్వరరావు తమ తండ్రి జ్ఞాపకార్థం రు.1,11,116ల విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి ఇఓకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# కార్యకర్తలకు పెద్దపీట వేస్తాం : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

## - కూటమి హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి - యేడాదికే టిడిపిపై వ్యతిరేకత



**రొంపిచర్ల, జులై 14, ప్రభాతవార్త :** గ్రామాల్లో వైఎస్ఆర్సీపీని బలోపేతం చేసిన కార్యకర్తలకు రాబోవు రోజులలో పెద్దపీట వేస్తామని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన సోమవారం రొంపిచెర్ల మండలం, పెద్దగొట్టిగల్లు సమీపంలోని వీఎంఆర్ కళ్యాణ మండపంలో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరిస్తున్నారని ఆరోపించారు. కనీ విని ఎరుగని రీతిలో ఏడాదికే తెలుగుదేశం పార్టీ మీద వ్యతిరేకత వచ్చింది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సరం దాటిన ప్రజలు చేసేది ఏమీ లేదన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబు రైతుల సమస్యలు కనబడడం లేదన్నారు. ఎప్పుడు అధికారం ఉన్న రైతులను విస్మరించడం చంద్రబాబు నైజం అన్నారు. రాష్ట్రంలో 40 శాతం ఓట్లు సాధించి 11 స్థానాలు గెలిచాం. మనం ఎలా ఓడిపోయామని కారణాలు అవసరం లేదని అన్నారు. ఈవీఎంల, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీల, మూడు పార్టీలు కలసి పోటీ చేయడం వలన ఓడిపోయామా కారణాలు అవసరం లేదన్నారు. 40 శాతం వున్న ఓట్లను 60 శాతంకు పెంచుకోవాలని అన్నారు. తల్లికి వందనం పథకంలో విద్యార్థులకు రూ.13.200 కోట్లు నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రూ 3,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసి విద్యార్థులకు మోసం చేశారని ఆరోపించారు. ఉచిత బస్సు వలన మహిళలకు ఎలాంటి ఉపయోగం ఉండబోదని అన్నారు. బాబు షిరిడి మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో నిర్వహించడం జరిగిందన్నారు. తాను ఎప్పుడు అధికారంలో ఉన్న ప్రజా సేవ చేసాం తప్ప దాడులు, దౌర్జన్యాలు, డబ్బులు వసూలు చేయడం చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పుంగనూరు నియోజకవర్గంలో త్రాగునీటి ట్యాంకులు మంజూరు అయితే వాటి నిర్మాణాలకు ఎవరికి ముందు రాకపోతే తానే ముందుకు వచ్చిన నష్టాల్లో ఉన్న త్రాగునీటి ట్యాంకు పనులు పూర్తి చేశామని అన్నారు. ప్రతి ఇంటికి త్రాగునీటి అందించడమే తన ధ్యేయమన్నారు. గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు రాబోవు రోజుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు వైసీపీ కార్యకర్తలుపై చేస్తున్న దాడులకు ప్రతి దాడులు తప్పవన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. వారణాసివారిపల్లి చెందిన టీడీపీ నాయకులు పి.నాగరాజ, ఎం.మహేష్, వైఎస్ఆర్సీపీలోకి ఎమ్మెల్యే సమక్షంలో చేరారు.

# నేడు తాడిపత్రిలో వైసిపి కార్యకర్తల సమావేశం

**అనంతపురం, జులై 14, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించేందుకు వైసీపీ సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశాలు ముగిసాయి. వైసీపీ సీనియర్ నేత , జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి , అనంతపురం పార్లమెంటు పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి , తదితర నాయకులు అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం చర్యలను, ఏడాది కాలంలో వైఫల్యాలను వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి ఎండ కడుతూ వస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో మిగిలిన తాడపత్రి నియోజకవర్గంలో నియోజకవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వైసిపి జిల్లా నేతలతో పాటు, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళ వారం తాడపత్రి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తాడపత్రి నియోజకవర్గ కేంద్రంలో జరిగే వైసీపీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తదితరులు వెళ్తే పోలీసులు అనుమతి ఇస్తారా? లేక హౌస్ అరెస్ట్ చేస్తారా అన్నది సస్పెన్స్ గా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాడపత్రి లోకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అనుమతించడం రాష్ట్ర హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ వివిధ కారణాలు చెబుతూ పెద్దారెడ్డి తాడపత్రి కి వెళ్లేందుకు జిల్లా ఎస్పీ అనుమతి ఇవ్వడం లేదు. గత నెలలో పోలీసులకు తెలియకుండా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడపత్రి కి వెళ్లి తన స్వగృహానికి వెళ్ళినప్పటికీ అనుమతి లేదనే కారణంతో మళ్లీ తాడపత్రి నుంచి పెద్దారెడ్డిని అనంతపురానికి తీసుకొచ్చారు.. ఈ చర్యపట్ల వైసీపీ జిల్లా నేతలు అనంతపురంలో నిరసన వ్యక్తం ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వంలో జేసీ కుటుంబాన్ని ఇబ్బందులు పాలు చేయడంతో పాటు అనేక కేసులతో జేడి పాలు చేశారని, జెసి వర్గీయుడు రవీంద్రారెడ్డిని జిల్లా బహిష్కరణ చేశారని తాడపత్రిలో జెసి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు ఆదినారాయణరెడ్డి సతీమణి వికె పార్వతమ్మ అంత్యక్రియలకు తరలివచ్చిన వామపక్ష అభిమానులు

**అనంతపురం, జులై 14, (ప్రభాతవార్త బ్యూరో)** స్వాతంత్ర సమరయోధులు సిపిఐ అగ్ర నాయకులు గుత్తి మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ (100 రెండునెలలు )అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం ఇక్కడి హరిచంద్ర ఘాట్ లో ఆమెకు ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.వంద సంవత్సరాల రెండు నెలలు పాటు జీవించిన వీకే పార్వతమ్మ పార్టీ శ్రేణులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని వెన్ను తట్టి ప్రోత్సహించేవారు. వికే దంపతులకు సంతానం లేదు. సంతానం కలిగితే పార్టీకి సేవలు చేయటం కష్టమవుతుంది అన్న భావనతో వారు పిల్లలను వద్దనుకున్నారు.పార్టీ కార్యకర్తలు నాయకులనే తమ పిల్లలు గా చూశారు. ఇప్పుడు రాష్ట్ర కేంద్ర నాయకత్వంలో సిపిఐ లో ఉన్నవారు అనేకమంది పార్వతమ్మ గారి ఆశీర్వాదాలు పొందిన వారే. వీకే ఆదినారాయణ రెడ్డి గారు తన జీవితాంతం కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం రాయలసీమ జిల్లాలకు సాగునీటి కోసం,కృష్ణా జలాలను రాయలసీమ జిల్లాలకు మళ్ళించాలని సుదీర్ఘ పోరాటాలు నిర్వహించారు . ముఖ్యంగా 1989 నుండి 1994 వరకు అప్పటి ప్రభుత్వం సాగించిన ప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలను వాపక్ష పార్టీలను విద్యార్థి యువజన సంఘాలను కదిలించి వీరోచిత పోరాటం సాగించారు.ఆ పోరాటంలో శ్రీమతి పార్వతమ్మ ఆయనకు వెన్నంటి నిలిచారు. కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి 1997 జులై 18న మరణించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఎస్‌పి నేత వాంగ్మూలం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యా పింగ్ కేసులో బాధితుల వాంగ్మూలం నమోదు కొనసాగుతోంది. ఇప్పటి వరకు కాంగ్రెస్, బిజెపి నేతలు వాంగ్మూలం ఇవ్వగా సోమవారం నాడు తొలి సారిగా బిఎస్‌పి నేత ఒకరు వాంగ్మూలమిచ్చారు. గత అసెంబ్లీ ఎన్ని కల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి బిఎస్‌పి నుంచి పోటీచేసిన వట్టే జానయ్య ఫోన్ అప్పట్లో ట్యాపింగ్‌కు గురయ్యిందని గుర్తించిన సిట్ అధికా రులు దీనిపై ఆయనకు నోటీసు ఇవ్వడంతో సోమవారం నాడు ఆయన జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. అప్పట్లో జ రిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సంభాషణలను సిట్ అధికారులు జానయ్యకు వినిపించి నాటి ఘటనలపై వివరాలు తీసుకున్నారు. విచారణ అనంతరం జానయ్య మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ చాలా దుర్మార్గమైన చర్యగా తెలిపారు. అప్పట్లో మంత్రి జగదీష్ రెడ్డి తన ఫోన్ ను ట్యాపింగ్ చేయించాడని ఆరోపించారు. దీనికి సంబంధించిన తన వద్ద వున్న ఆధారాలను సిట్ అధికారులకు అందించారు. ఫోన్ ట్యాపింగ్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీగా వెంకటేశ్వరబాబు

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖలో అడిష నల్ ఎస్పీగా వెంకటేశ్వరబాబు సోమవారం పదవీబాధ్యాతలు స్వీకరించారు. ఇదే పోస్టులో పనిచేసిన భాస్కర్ పదవీవిమరణ పొందారు. ఖాళీగా ఉన్న ఈ పోస్టులోకి మెదక్ ఇంటెలిజెన్స్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వెంకటేష్‌బాబు ఎక్సైజ్‌శాఖలోకి వచ్చారు.

# విరువూరు ఇసుక రీచ్‌లో యువకుడి హత్య

## - ఆర్థిక లావాదేవీలే కారణం



మోహన్‌చంద్ (ఫైల్‌ఫొటో)

**పొదలకూరు (నెలూరు), జులై 14, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరు గ్రామం వద్ద ఉండే ఇసుక రీచులో ఓ యువకుడు మృతదేహం వెలుగు లోకి రావడంతో కేసును చేధించిన పోలీసులు దారుణ హత్యగా నిర్ధారించారు. ఈ ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. నెల్లూరు రూరల్ మండలం యనమలవారిదిన్నె గ్రామానికి చెందిన కాయల మోహన్ చంద్ అనే యువకుడు ఒక కార్ల కంపెనీలో సేల్స్ విభాగంలో పనిచేస్తుండేవాడని విక్రయాల సమయంలో కొంత మందితో పరిచయాలు ఏర్పడి స్నేహితులుగా మారారని ఈ క్రమంలో పొదలకూరు మండలం విరువూరు, మాముడూరుకు చెందిన ఐదుగురు యువకులతో స్నేహ బంధాలు ఏర్పడ్డాయని డెమో కార్లను ఈ యువకులకు ఇచ్చి విక్రయిస్తూ వచ్చిన సొమ్మును వాటాలు చేసుకునే వారని ఇటీవల రెండు కార్లను విరువూరుకు చెందిన యువకులు మోహన్ చంద్ వద్ద తీసుకున్నారని, ఒక కారును అమ్మేసుకున్నారని, ఆ కారు విషయం మోహన్ చంద్ ఆరా తీయగా బేధాభిప్రాయాలు ఏర్పడి వాధించుకున్నారని గత నాలుగు రోజుల క్రితం ఈ స్నేహితులు ఓ కార్యక్రమానికి చంద్‌ను ఆహ్వానించడంతో వారి మాటలు నమ్మి చందు విరువూరుకు వెళ్లాడని పోలీసులు చెప్పారు.

# సహజనటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన సినీ నటి సరోజాదేవి

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటి బి.సరోజాదేవి సహజ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవారని ఆమె మృతి సినిమా రంగానికి ఎంతోలోటని పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. ప్రముఖ సినీనటి, పద్మభూషణ్ పుర స్కారగ్రహీత బి.సరోజాదేవి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో తన సహజనటనతో కోట్లాది ప్రేక్షకుల అభిమానం చూరగొన్నారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. సరోజాదేవి కుటుంబసభ్యులకు, ఆమె అభిమా నులకు సర్వశక్తిమంతుడైన దేవుడు విషాదసమయంలో వారి మనోధైర్యం పెంచేందుకు తోడ్పాటు నివ్వాలని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ప్రగాఢ సంతాప సందేశంలో పేర్కొ న్నారు. సరోజాదేవి భారత సినీరంగానికి అందించిన సేవలు చిరస్మరణీ య మని వివరించారు. ఆమె నటనకు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయని, ఆమె మృతి సినీలోకానికి తీరనిలోటని అభిప్రాయపడ్డారు.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మంగళవారం 15 - జూలై - 2025


## ప్రజల నెత్తిన చేతులు పెట్టారు..ఐదేళ్లు విధ్వంసం సృష్టించారు : డివి

**అంబాజీపేట , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి భ్రమించి మాట్లాడుతున్నారని, నోరుంది కదాని మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజలు రాళ్లతో తరిమి తరిమి కొడతారని పి.గన్నవరం నియోజకవర్గం టిడిపి కో- కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో దాసరి మాట్లాడుతూ మీరు ఎమ్మెల్యేగా కొత్తపేట నియోజకవర్గంలో ఇసుక తువ్వ,మట్టి అడ్డదారిలో ఎంత అమ్ముకున్నారో,ఎన్ని భూ దందాలు చేసారో జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. రాష్ట్రంలో జేపీ ఇన్ఫ్రా సంస్థకే ఇసుక కాంట్రాక్ట్ ను కట్టబెట్టి జగన్మోహన్రెడ్డి అడ్డదారిలో దోచుకున్నది నిజం కాదా,మా ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నది వాస్తవం కాదాని ప్రశ్నించారు.మా ఎమ్మెల్యే లు నెలనెలా రేషన్ డిపోల నుండి బియ్యం బస్తాలు తీసుకుంటున్నట్టు, డ్వాక్రా మహిళల నుండి డబ్బులు తీసుకున్నట్టు మాట్లాడుతున్న మీకు దమ్ము,ధైర్యం ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. మీ వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాలని సర్వనాశనం చేస్తే మా ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తుంటే మీరు తట్టుకోలేక అవాకులు, చవాకులు మాట్లాడుతున్నార న్నారు.2019లో ఎన్నికల ముందు మీరు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన మీరు, అమ్మ ఒడి ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తానని చెప్పి ఒక్కరికి మాత్రమే ఇచ్చి మిగిలిన వారిని గాలికి వదిలేసారన్నారు.అదే మా ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చామని, రూ.2 వేలు ఉన్న పెన్షన్ ని రూ.3 వేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన మీకు ఐదేళ్ళు పట్టిందని ఎద్దేవా చేశారు.

## వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి 1లక్ష విరాళం..స్వామివారి ఆదాయం రూ.5,24,380లు



**ఆత్రేయపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ పుణ్యక్షేత్రం గా శోభి ళ్ళుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం సోమవారం వేలాది మంది భక్తులతో కిట కిటలాడింది. ఉదయం మేలుకొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి దర్శించుకొని అన్నప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ. 5,24, 380లు స్వామి వారికి ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి ఆత్రేయపురం మండలం, నార్కెడిమిల్లి పాలెం చెందిన బొక్క వెంకన్నబాబు ,శ్రీమతి లోహిత దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 1,01,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు శ్రీ స్వామి వారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్ని వర్గాలకు నచ్చేలా..జనం మెచ్చేలా కూటమి పాలన : మంత్రి సుభాష్

**కోనసీమ బ్యూరో , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

రాష్ట్రంలో కూటమి పాలన అన్ని వర్గాలకు నచ్చేలా.. జనాలు మెచ్చేలా సుపరిపాలన సాగుతు ఒదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని 10,11 వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటా ప్రచారం చేశారు. ఒకపక్క ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం వివరిస్తూనే .. ప్రజల బాగోగులు అడిగి తెలుసుకుంటూ మై- టిడిపి యాప్ లో వివరాలు పొందుపరిచారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందు తున్నాయా..లేదా.. కూటమి ప్రభుత్వం ఏడాది అభివృద్ధి ఎలా ఉంది అంటూ ప్రచారం సాగిం చారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని పలువురు మంత్రి సుభాష్ కు వివరించారు. ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి



కూటమి ప్రభుత్వం అద్వితీయ పాలన అందించి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల మన్ననలు అందుకుందని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆత్మీయ పలకరింపుల మధ్య సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని ఆద్యాంతం కొన సాగించారు. పార్టీ నాయకులతో కలిసి వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఏడాది కూటమి పాలనలో ప్రజల మంచి కోసం అందించిన సంక్షేమ పథకాలు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు వివరిస్తూ, ప్రచార కరపత్రాలు అందించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రజానీకానికి మంత్రి సుభాష్ భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని తీసుకెల్లాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్ప మన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన పాలన దిశగా ముందడుగు వేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అనునిత్యం కృషి చేస్తున్నా నన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని, వచ్చే ఆగస్టు 15 న ఉచిత బస్సు పథకం కూడా ప్రారంభం కానున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలి : డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్

**అంబాజీపేట , జులై 14 , ( ప్రభాతవార్త )**

పర్యావరణ పరిరక్షణ బాధ్యతపై విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇరుసుమండ సెయింట్ జోషఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తడి, పొడి చెత్తపై పంచాయతీ కార్యదర్శి ఆర్. ఏడుకొండలు చంటి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతికి హాని కల్గించే ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామాగ్రికి స్వస్థి చెప్పి జూట్ బ్యాగ్లను వినియోగిద్దామని, ప్రజారోగ్యం, పర్యావరణం, నీటి సంరక్షణ పరిపూర్ణం అవ్వాలంటే పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత పాటించా లన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాన్ని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు. ఇంటింటికి ఇచ్చిన ప్లాస్టిక్ టబ్లలో తడి, పొడి చెత్తలను వేరు



వేరుగా, వేయాలన్నారు. వాటితో సంపద కేంద్రాల వద్ద కంపోస్టు ఎరువును తయారు చేస్తారన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకున్నా మని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు.

తడి, పొడి చెత్తలపై ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. సిస్టర్ మేరీ,నాగాబత్తుల సత్యానందం, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పాఠశాలకు చెందిన 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జె.కొత్తూరు పేకాట శిబిరంపై పోలీసు దాడి



**జగ్గంపేట , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాలతో ఎక్కడా పేకాటలు, బొమ్మ బొరుసు ,క్రికెట్ బెట్టింగ్లు, ఎత్తులాట, కోత బంతి లాంటి ఎటువంటి జూద క్రీడలు జరగడానికి వీలులేదని వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.దానిలో భాగం గా జగ్గంపేట సీఐ వైఅర్ కె కు రాబడిన సమా చా రం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు తన సిబ్బందితో జగ్గంపేట మండలం జె. కొత్తూరు శివారులో పేకాట శిబిరం పై దాడులు నిర్వహించారు. దాడిలో భాగంగా నలుగురు పేకా ట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 11, 300 రూపాయలను స్వాధీనం చేసుకోవడం జరి గింది.వారిపై కేసు నమోదు చేయడం జరిగింది.

## తిరుమల విద్యార్థులను మంత్రి నారా లోకేష్ ప్రశంస

### తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

నీట్-2025 ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా 19 ర్యాంకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరం తిరుమల విద్యార్థి డి కార్తీక్ రామ్ కిరీటి ని రాష్ట్ర విద్య ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు.జేఈఈ అడ్వాన్స్ 2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆల్ ఇండియా ఎనిమిదవ ర్యాంకు సాధించిన కె యశ్వంత్ సాత్విక్, ఎస్సీ కేటగిరీలో ఆల్ ఇండియా రెండవ ర్యాంకు సాధించిన కె.ప్రణీత్ లను మంత్రి లోకేష్ పుష్పగుచ్చం తో సత్కరించారన్నారు. ఈ ఘనతను సాధించిన తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలలో మంత్రి లోకేష్ అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి ఆయా విద్యార్థులు మంత్రి లోకేష్ ను ఉండవల్లి కార్యాలయంలో కలిశామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకే నేటి తరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని లైఫ్ అంటేనే ఛాలెంజ్ గా స్వీకరిం చాలని అధైర్య పడకూడదని చెప్పారని విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకుని రాష్ట్ర భవిష్యత్తు మీరేనని ఇది కేవలం ప్రారంభం మాత్రమే నని కలల సాధనకు నిరంతరం శ్రమించాలని దిశ నిర్దేశం చేశారని తిరుమల రావు తెలిపారు.

## ఈనెల 15న జగ్గంపేటకు పురపాలక శాఖ మంత్రి నారాయణ

### - సూపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి



**జగ్గంపేట , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జగ్గంపేట టౌన్ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జిలు, టిడిపి ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 వ తేదీ మంగళవారం జగ్గంపేట పట్టణంలో పురపా లక శాఖ మంత్రి పి నారాయణ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 15వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగ్గంపేట రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయానికి చేరుకుంటారని. అక్కడ నుండి జగ్గంపేటలో కూటమి ప్రభుత్వం ఏడాది సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తామని ఈ కార్యక్రమాన్ని జగ్గంపేట నాయకులందరూ విజయవంతం చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకవిల్లి రాజు, వేములకొండ జోగారావు, నండ్ల చిరంజీవి, పీల మహేష్, గెద్దాడ సత్యవేణి, దేగల సత్తిబాబు, వైభోగుల కొండబాబు యాదవ్, ఎండి కాజా, ముక్క పాలు బాబు, పలివెల యేసు రాజు, రిస్ రమణ, గొర్ల వీరబాబు, వాకారెడ్డి, ఆయిల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐ ప్రవేశం కొరకు 23న రెండవ విడత కౌన్సిలింగ్



**జగ్గంపేట , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

జగ్గంపేట ప్రభుత్వ ఐటిఐ 2025-26 విద్యా సంవత్సరం గాను మిగిలిన సీట్ల భర్తీకి రెండవ విడత ప్రవేశం కొరకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.ఆర్.ఆర్. కృష్ణన్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎల్.ఆర్.ఆర్. కృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ జగ్గంపేట నందు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ మరియు సివిల్ ట్రేడ్స్ కలవన్నారు.కావున అభ్యర్థులు సవరించిన షెడ్యూల్ ప్రకారము తేది. 20-07-2025 సాయంత్రం 5.00 లోపు ఐ.టీ.ఐ.ఏపీ.జి.ఓ.వి.ఇన్ అనే వెబ్ సైట్లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఆ యొక్క ప్రింట్ కాఫీతో పాటు,ఒరిజినల్ సర్టిఫికెట్స్,హాల్ టికెట్స్ యొక్క నకలు,పాస్ పోర్ట్ సైజు ఫోటో తో జగ్గంపేట ప్రభుత్వ ఐ.టి.ఐ లో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.వెరిఫికేషన్ చేయించని యెడల ఆయొక్క దరఖాస్తు చెల్లుబాటు కాదన్నారు.పూర్తి వివరాలకు 9440262266, 8142345444, సంప్రదించాలని సూచించారు.ముఖ్యంగా ఆన్లైన్లో వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులంతా ఈనెల 23వ తేదీన ఉదయం జరిగే కౌన్సిలింగ్ కు హాజరుకావాలని సూచించారు.

## వలస కూలీల చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం

### : ప్రముఖ మనస్తత్వవేత్త శ్యామ్ జాదూగర్



**ఆత్రేయపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

వివిధ రాష్ట్రాల నుంచి పొలం పనులు చేసుకోవడానికి వచ్చిన వలస కూలీల చిన్నారులకు ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు జన్మదినం పురస్కరించుకొని మచ్చా కుమార్ రాజా సౌజన్యంతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అనంతరం చిన్నారులకు పుస్తకాలు పలకలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ పేదరికం చదువుకి ఆటంకం కాకూడదని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం అన్నపూర్ణ డే కేర్ హెూం నందు వృద్ధులకు అన్నదానాన్ని నిర్వహించి ఇద్దరు పేద చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ సభ్యులు డాక్టర్ మోహిత్, శ్యామ్, అన్నపూర్ణ, తేజశ్రీ, రుషిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలో ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు : సిఐసి హెచ్.విద్యాసాగర్

**ఆత్రేయపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

కోనసీమ తిరుమల వాడపల్లి వచ్చే భక్తులను ఆటోలలో ఎక్కువమంది ప్రయాణికులను ఎక్కుంచుకుంటే చర్యలు తప్పవని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ అన్నారు. వాడపల్లి శ్రీనివాస ప్రాంగణం నందు సోమవారం ఆటో డ్రైవర్ల తో సమావేశం ఏర్పాటు చేశారు. వారికి రోడ్ సేఫ్టీ గురించి రోడ్ యాక్సిడెంట్ ఎక్కువమంది ప్యాసిం జర్లు ఎక్కించుకూడద ని సూచనలు చేసి వారికి ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో



ఆత్రేయపురం ఎస్ ఐ, రాము, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## యనమదల సొసైటీ అధ్యక్షుడిగా ఆనందరావు ఏకగ్రీవం

**రామచంద్రపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

రామచంద్రపురం మండలం యనమదల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా తాడిపల్లి గ్రామానికి చెందిన మాదాల ఆనందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం సొసైటీ కార్యాల యంలో ప్రమాణ స్వీకారం మహెూత్స వం ఘనంగా జరిగింది. సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ రైతులకు, వ్యవసాయదారులకు కావలసిన రుణ సదుపాయాలు కల్పించి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకుంటానని అన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన సహకార భవనాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తన మీద నమ్మకంతో అధ్యక్ష



పదవి బాధ్యతలు అప్పగించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కు సొసైటీ అధ్యక్షుడు ఆనందరావు కృతజ్ఞతలు తెలిపారు. యనమదల, ఓదూరు,తాడిపల్లి మూడు గ్రామాలకు చెందిన యనమదల సొసైటీ అధ్యక్ష పదవి తాడిపల్లి గ్రామానికి రావడం తో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఆనందరావుకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు , డైరెక్టర్లు గుణ్ణం కృష్ణమూర్తి, రొక్కాల రామారావు , పాలకవర్గం సభ్యులు,కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## " పాడా " పీజీఆర్ఎస్ కు 74 అర్జీలు

**పిఠాపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :**

పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 74 అర్జీలు అందినట్లు, పాడా ఏపీడి వసంత మాధవి తెలిపారు.పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి వివిధ అర్జీలను ఆమె స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ -31, మునిసి పాలిటీ-11, పిఆర్ - 7,ఇతర శాఖలకు సంబ ంధించినవి-25 వచ్చాయన్నారు.

ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని,ఆమె అధికారులను ఆదేశించారు.

అర్జీలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవాలంటే 1100 కి నేరుగా కాల్ చేయవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

# జ్యోతులనవీన్ ను కలిసిన మల్లేపల్లి సొసైటీ చైర్మన్ దిడ్డి వెంకట్ రాజు



**జగ్గంపేట , జులై 14 , ( ప్రభాతవార్త ) :** స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మల్లేపల్లి సొసైటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దిడ్డి వెంకట్ రాజు (చిన్న శ్రీను) కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవీన్ శ్రీనుకి శుభాకాంక్షలు తెలియజేసి మల్లేపల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వెలిది సుబ్రహ్మణ్యం, ఐ. గురు నాయుడు, ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల రామాంజనేయులు, తెలగ రెడ్డి భద్రరావు, తెలగ రెడ్డి ప్రకాష్, చింతపల్లి వీరభద్రరావు, కాటేపల్లి భద్రం, తలాడి బాబురావు, దిడి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# సామర్లకోట సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మృతి



**సామర్లకోట , జులై 14 , ( ప్రభాతవార్త ) :** సామర్లకోట పట్టణానికి చెందిన సీనియర్ కౌన్సిలర్. పితాని కృష్ణ మృతి చెందారు. ఆయన కౌన్సిలర్ గా, సామర్లకోట పట్టణన ప్రజలకు, వారు ఎన్నో సేవలు అందించారు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా. రెండు పర్యాయాలు, ఆయన కొనసాగారు, అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా గెలిచారు, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయి, ఆ పార్టీకి విజయం చేకూర్చే విధంగా, తెలుగుదేశం పార్టీ తరపున పని చేశారు, ప్రస్తుతం కౌన్సిలర్ గా కొనసాగుతున్నారు, ఇటీవల ఆయన పెద్దాపురం ఎమ్మెల్యే, నిమ్మకాయల చినరాజప్ప. ద్వారా ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటికి వచ్చి మూడు నెలలు రెస్ట్ తీసుకున్నారు. తర్వాత ఆయన కార్యక్రమాలు చేసుకుంటూ. ప్రజలకు సేవ చేసుకుంటూ ఉండేవారు. ఈ మధ్యకాలంలో మరల ఆసుపత్రికి వెళ్లడం జరిగింది. కొద్దిగా ఇబ్బంది పడడం జరిగింది. కౌన్సిలర్ కృష్ణ మృతి పట్ల వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తున్నాను. మన మధ్య ఆయన లేకున్నా. వారిని స్మరిస్తూ. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటున్నానని సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి సానుభూతిని తెలియజేశారు

# పెత్తందార్లకు కొమ్ముకాస్తున్న పంచాయతీ కార్యదర్శి : ఏ కుమారపురం


Grievance Receipt
PGRS - Monday Mandal Level
Kakinada

| | |
|---|---|
| Grievance No | [illegible] |
| Registered Date | 14-07-2025 |
| Name | SUDHIMELLA SRI VEERA RAGHAVACHARYULU |
| Mobile No | [illegible] |
| Grievance Details | Panchayat Raj->Sp-Encroachments/ Layouts->Removal Of Encroachments |
| Address | KUMARAPURAM (R), 10490407, Pithapuram, Kakinada |
| SLA | 30 Day(s) |
| SLA End Date | 13-08-2025 Day(s) |



**పిఠాపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :** పారదర్శకంగా పనిచేయాల్సిన గ్రామ పంచాయతీ కార్యదర్శి, పెత్తందార్లకు కొమ్ము కాస్తున్నారు. అందుకున్న ఫిర్యాదులో న్యాయాన్ని చూడకుండా పలుకుబడిని చూస్తున్నారు. ఇవి నేను అంటున్న మాటలు కాదు, అదే గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి యొక్క ఆవేదన. వివరాల్లోకి వెళితే...గుదిమెళ్ళ శ్రీ వీర రాఘవాచార్యులు అనే వ్యక్తి , 2018 సంవత్సరంలో పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో ఇల్లు కట్టుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. తాను నివాసం ఉ ంటున్న ఇంటిని, ఆ పరిసరాల్లో ఉండే వేరే కుటుంబం తమకు అమ్మాలని అడగగా, రాఘవాచార్యులు సున్నితంగా తిరస్కరించాడు. దీంతో ఆ కుటుంబం కక్ష సాధింపు చర్యలకు బీజం వేసింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేని ఆ ప్రాంతంలో ఇంటి నుండి వచ్చే వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడం సర్వసాధారణం. దీన్నే అదునుగా చేసుకుని, ఆ కుటుంబం రాఘవాచారి పై స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా,ఆయన తనదైన శైలిలో వ్యవహరించాడు. ఇదే సమస్య వీధిలోని అన్ని ఇళ్ల దగ్గర ఉంటే నన్నే ఎందుకు ప్రశ్నిస్తున్నారు, మిగిలిన సమస్యలు కనపడడం లేదా అని, సదరు కార్యదర్శిని, రాఘవాచారి ప్రశ్నించాడు. అయినప్పటికీ, పంచాయతీ కార్యదర్శి తీరు మారకపోవడంతో " పాడా " కార్యాలయంలో సోమవారం రాఘవాచారి ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ అధికారులు పెత్తందార్లకు కొమ్ము కాయడం, అది ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం కావడం విశేషం.

# కూటమి పాలనతో పేదల బతుకుల్లో వెలుగులు : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి , జులై 14 , ( ప్రభాతవార్త ) :** కూటమి పాలనతో పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయని, వైసీపీ నాయకులు ఎన్ని కుతంత్రాలు వేసినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం గండేపల్లి మండలం మురారి గ్రామంలో క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే నెహ్రూ హాజరై ఇంటింటా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగించడం జరుగుతుందని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతుంటే చైతన్యవంతులైన ప్రజలు ఆశీర్వదించి ఆదరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా జాస్తి వసంత్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మురారి ప్రజలు ఎదురుచూస్తున్న గుబ్బాలమ్మ గుడి నుండి హైస్కూల్ వెళ్లే రోడ్డుకు కోటి యాభై లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు డ్రైన్ నిర్మించి మురారి ప్రజల,హై స్కూల్ విద్యార్థులకు కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు ప్రజలందరూ బ్రహ్మరథం పడుతున్నారని వసంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకవిల్లి రాజు, మురారి సొసైటీ చైర్మన్ చావా తమ్మన్న చౌదరి, తాళ్లూరు సర్పంచ్ శీలామంతుల వీరబాబు, గద్దె అబ్బన్న,కుక్కల ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నలుగురు నిందితులు అరెస్టు..రూ. 16 లక్షల సొత్తు స్వాధీనం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 14 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి రూ.16లక్షల రూపాయల విలువ చేసే 119గ్రాముల బంగారు ఆభరణాలు,1567గ్రాముల వెండి ఆభరణాలను, ఒక పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ డిఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ వెల్లడించారు. స్థానిక డీఎస్పి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జగన్నాధపురం కు చెందిన గంపల సతీష్(25),యానాం కు చెందిన మల్లాడి దుర్గాప్రసాద్(26),కాలాడి అర్జున రావు (23),బిక్కవోలుకు చెందిన గొర్రిపూడి వెంకటరమణ (42)ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారన్నారు. 5కేసులలో వీరిని అరెస్ట్ చేశామన్నారు. మరో కేసులో రేఖాడి వెంకటేశ్వర్లు(23)ను అరెస్ట్ చేసి రూ.1,60,000లు విలువ చేసే 16గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు .క్రైమ్ సీఐ వి.కృష్ణ, పోర్ట్ సీఐ పి.సునీల్ కుమార్, ఇంద్రపాలెం ఎస్సై ఎమ్. వీరబాబు,ఇంద్రపాలెం, పోర్టు పోలీసు స్టేషన్ల పోలీసులు, సీసీఎస్ పోలీసులు పాల్గొన్నారు.

# ఆ నలుగురు ల్యాబ్ సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగింపుకు ప్రభుత్వానికి నివేదిక : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 14 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు లాబ్ సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగింపుకు ప్రభుత్వానికి సూచిస్తున్నామని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ రంగరాయ కళాశాలను సందర్శించి కళాశాలలో లాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్లు తమను లైంగికంగా వేధిస్తున్నారని ఇటీవల ఫిర్యాదు చేసిన పారామెడికల్ విద్యార్థినులను కలుసుకుని వారి పట్ల జరిగిన అకృత్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు నిర్భయంగా వివరాలను తెలిజేసేందుకు , కళాశాల ఆడిటోరియం ఉప మందిరంలో ఇతరులు ఏవరినీ అనుమతించకుండా బాధిత విద్యార్థినిలతో చైర్ పర్సన్ ఏకాంత సమావేశం నిర్వహించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ సభ్యులతో కూడా సమావేశమై విద్యార్థినుల పట్ల అనుచిత వ్యవహారాల నిరోధానికి చేపట్టవలసిన చర్యలను సూచించారు. అనంతరం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆర్ఎంసి పారామెడికల్ విద్యార్థినులపై జరిగిన దురాగతాల పట్ల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసారు. చదువుకునేందుకు దూర ప్రాంతాల నుండి వచ్చిన పేద కుటుంబాల బాలికలు లైంగికంగా వేధింపులకు లోనై, మానసికంగా క్షోభకు గురికావడం బాధాకర మన్నారు. న్యాయం జరుగుతుందో లేదోనన్న సంశయం, ఫెయిల్ చేస్తారేమో, ఉద్యోగంలో ఇబ్బందులు కలిస్తారామో నన్న భయాలతో ఇటువంటి వేధింపులకు గురైన విద్యార్థినులు, ఉద్యోగినులు ఫిర్యాదు చేయకుండా మౌనంగా కుమిలి పోతున్నారన్నారు. తమ పట్ల జరిగిన అకృత్యాలు మరొకరికి జరుగకూడదని ధైర్యంగా ఫిర్యాదు చేసిన ఆర్ఎంసి పారామెడికల్ విద్యార్థినులను చైర్ పర్సన్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో పనిచేస్తున్న లాబ్ అసిస్టెంట్, ముగ్గురు లాబ్ టెక్నిషియన్లు అభ్యంతరకరమైన రీతిలో తమ ఫొటోలు తీసి వన్ టైమ్ యూజ్ మోడ్ లో మెస్సెజ్ లుగా పంపి లైంగిక వేధింపులకు గురిచేసారని, ఇలాగే జిజిహెచ్ కు వచ్చే మహిళా రోగుల పట్ల కూడా ఈ నలుగురు



వ్యవహించేవారని విద్యార్థినులు తనకు వివరించారన్నారు. దీనిపై 60 మంది విద్యార్థినులు ఈ నెల 8న తమ హెచ్ఓడి కి కంప్లయింట్ చేసి, 9వ తేదీన ప్రిన్సిపాల్ కు మెయిల్ ద్వారా తెలియజేశారన్నారు. ఈ ఫిర్యాదులపై కళాశాల ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారించి సమర్పించిన నివేదిక ఆధారంగా దోషులు నలుగురిని ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసారని, వీరిపై పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రిమాండలో ఉంచడం జరిగిందని తెలిపారు. బాధిత విద్యార్థినులలో మైనర్లు కూడా ఉన్నందున దోషులపై ఫోక్స్ చట్టం క్రింద కేసులు నమోదు చేసారన్నారు. దోషులు తాము రిగ్యులర్ ఉద్యోగులమని, తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో ఇటువంటి అకృత్యాలకు పాల్పడ్డారని, ఇటువంటి వారందరికీ గట్టి హెచ్చరికగా దోషులు నలుగురిని ఉద్యోగాల నుండి తొలిగించాలని మహిళా కమీషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుందని తెలిపారు. ధైర్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులను మిగిలిన కళాశాల సిబ్బంది ఎవరైనా టార్గెట్ చేసే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి ఉంటుందని స్పష్టం చేసారు. మహిళల రక్షణకు కళాశాలలు, కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీల గురించి విద్యార్థినులకు, ఉద్యోగినులుకు అవగాహన కల్పించి వారిలో నిండు భరోసా కల్పించాలని చైర్ పర్సన్ ప్రిన్సిపాళ్లను, కార్యాలయాధిపతులను కోరారు. తమ పట్ల జరిగే లైంగిక అకృత్యాలను ఎదిరించే ధైర్యాన్ని ఆడబిడ్డలలో తల్లిదండ్రులు పెంపొందించాలని ఆమె కోరారు. అనంతరం మహిళా కమీషన్ చైర్ పర్సన్ డా.శైలజ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించి సమస్యలు, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలను ఆదుకుని, రక్షణ, ఆశ్రయం, సాధికారత కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలోని క్లినికల్ లాబోరేటరీని, మెటర్నిటీ వార్డులను ఆమె సందర్శించి మహిళల అందుతున్న ప్రసూతి పూర్వ, అనంతర సేవలను పరిశీలించి వార్డులోని మహిళలతో అవి అందుతున్న తీరును మహిళా కమీషన్ చైర్ పర్సన్ పరిశీలించారు. ఈ పర్యటనలలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ దేవరాజ్ పాటిల్, ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డా.విష్ణువర్ధన్, పిడి-ఐసిడిఎస్ సిహెచ్.ఎస్.కె.దుర్గాదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, ఏఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### శరవేగంగా వకుళా మాత అన్నదాన భవన నిర్మాణ పనులు : డిప్యూటీ కమీషనర్, ఈఓ,నల్లం సూర్య చక్రధరరావు



**ఆత్రేయపురం , జులై 14 , ( ప్రభాతవార్త )** ఏడువారాల వెంకన్న గా భక్తుల కు నిత్యదర్శనం ఇస్తున్న కలియుగ దైవం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తరలివచ్చే భక్తులకు నిత్యాన్నదాన నిమిత్తం శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళా మాత అన్నదాన భవనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర రావు . త్వరలోనే వకుళమాత అన్నదాన భవనం పనులు పూర్తవుతాయని, ఒకేసారి 3,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతున్నట్లు అయన తెలిపారు.

# గోపాలపురంలో 20 మంది పందెం రాయుళ్లు అరెస్ట్





**గోపాలపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :** గోపాలపురం మండలంలోని వెంకటాయపాలెం, దొండపూడి గ్రామాల్లో కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు జరిపారు. ఎస్సై పీ.మనోహర్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ ఘటనలో 20 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వెంకటాయపాలెంలో 8 మంది వ్యక్తులను, 2 కోడి పుంజుల, 2 కోడి కత్తులు, రూ.3800 నగదును స్వాదీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా దొండపూడిలో 12 మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేశా మన్నారు. వారి వద్ద నుంచి రూ.8020 నగదు, 2 కోడి పుంజులు, 2 కోడి కత్తులను స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎవరైన కోడిపందాలు, పేకాట వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మనోహర్ హెచ్చరించారు.

# ఉమెన్, గర్ల్ సేఫ్టీ , సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన

**ఆత్రేయపురం , జులై 14 , ( ప్రభాతవార్త ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారి ఉత్తర్వులు ప్రకారం కొత్తపేట సబ్ డివిజన్ పోలీస్ వారి పర్యవేక్షణలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్ రాము, ఆత్రేయపురం మండలం అంకం పాలెం గ్రామంలో గల హైస్కూల్ నందు ఉమెన్, గర్ల్ సేఫ్టీ , సైబర్ క్రైమ్, డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు.

# మరో 20 ఏళ్లు అధికారంలో కూటమి ప్రభుత్వమే : కొల్లు రవీంద్ర



**కాత్రేనికోన , జులై 14 , ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలో జగన్ అరాచక పాలన భరించలేకనే కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని మరో 20 ఏళ్ల పాటు అధికారంలో కూటమి ప్రభుత్వమే కొనసాగుతుందని రాష్ట్ర భూగర్భ గనులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర జోస్యం చెప్పారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రంధి నాగేశ్వరరావు ఫంక్షన్ హాల్ లో స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలు బుద్ధి చెప్పిన వైసీపీ నాయకుల తీరు ఏమాత్రం మారలేదు అన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని సైకోల తయారయ్యారని,రాత్రి చీకట్లో కను సైగ చేస్తే తెలుగుదేశం నాయకులను అంతం చేయాలని పిలుపునిస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు. వైసిపి నాయకుల అరాచకాలకు పేర్ని నాని ఉదాహరణ అన్నారు. కార్యకర్తలే తెలుగు దేశం పార్టీకి అధినేతలని, గత ప్రభుత్వ హాయంలో ఎన్ని దౌర్జన్యాలు చేసిన సైనికులు లాగా తెలుగు దేశం కార్యకర్తలు ప్రతిఘటించారని కితాబులు ఇచ్చారు. మహిళల పట్ల జుగ్గు శకరమైన వాక్యాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పి ఫోర్ విధానాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. మును పెన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 35 వేల కోట్ల రూపాయల వ్యాయంతో ప్రతి నెల వివిధ రకాల పెన్షన్లు ఒకటవ తారీఖునే పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల మందికి తల్లికి వందనం పేరట తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజవర్గంలో క్లస్టర్ ,యూనిట్, బూత్ ఇన్చార్జులు ,కార్యకర్తలు అద్భుతంగా పనిచేస్తున్నారని కితాబుని ఇచ్చారు. పార్లమెంటు పరిధిలోనే ముమ్మిడివరం నియోజవర్గం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని కొనియాడారు. నియోజవర్గంలో 10 క్లస్టర్లు ఉండగా అందరూ ఎంతో బాధ్యతతో పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నామన్నారు. నియోజవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 210 మంది లబ్ధిదారులకు ఒక కోటి 90 లక్షల రూపాయలు నిధులు పంపిణీ చేసామని, ఉపాధి హామీ పథకం ద్వారా 38 కోట్ల రూపాయలు కూలీలకు ఇవ్వడం జరిగింది అన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా ద్వారా 24 కోట్ల రూపాయలు పంపిణీ చేశామని, ఓ ఎన్ జి సి నష్టపరిహారం రూపంలో మత్స్యకారులకు 132 కోట్ల రూపాయలు పంపిణీ చేశామన్నారు. మహిళలకు కుట్టు మిషన్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామన్నారు. నియోజవర్గంలో 50 గ్రామాల్లో 50 కిలోమీటర్లు పైబడి 30 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించమన్నారు. అలాగే రెండు సబ్ స్టేషన్ లో నిర్మాణానికి నాంది పలికామన్నారు. రైతులకు గోసాలలు నిర్మించమన్నారు. జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సి ఎస్ ఆర్ నిధులు ద్వారా ముమ్మిడివరంలో డిగ్రీ కాలేజీ నిర్మాణానికి ముందడుగు వేశామన్నారు. లంక గ్రామాలు వరదల సమయంలో నది కోతకు గురి కాకుండా రూ.250 కోట్ల ప్రతిపాదనలతో గ్రోయిన్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపమన్నారు. తీర ప్రాంత గ్రామాలకు వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని రెండు లైన్ల వంతెనలగా నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపమని త్వరలోనే వాటి నిర్మాణాన్ని చేపడతామని ఎమ్మెల్యే దాట్ల తెలిపారు. అనంతరం మత్స్యకార గ్రామమైన పల్లం గ్రామంలో సుపరిపాలనలో తొలు అడుగు కార్యక్రమాన్ని మంత్రి రవీంద్ర ఎమ్మెల్యే ఎంపీ ఇతర నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, పిఎస్ఎన్ రాజు,మోకా ఆనంద్ సాగర్, చెల్లి అశోక్ ,గుత్తుల సాయి, తాడి నరసింహారావు, గొల్లకోటి దొరబాబు, ఆకాశం శ్రీనివాస్,ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps



# మన ఉత్పత్తులు ప్రతిష్ట



- నర్సాపురం లేసు ఉత్పత్తులు
- బొబ్బిలి వీణ

ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డు పథకం క్రింద 2024-25 సం.లకు నరసాపురం లేసు అల్లికకు, బొబ్బిలి వీణలకు ఎంపికయ్యాయి. నరసాపురం లేసుకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం లేసు పార్కును సందర్శించి లేసు ఉత్పత్తులను కొనకుండా వెళ్లరు. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం లేసు ఉత్పత్తుల అలంకరణ కనపడుతోంది. ఇతర రాష్ట్రాలు, దేశాలకు లేసు అల్లికలు ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ద్వారా ఎగుమతి అవుతున్నాయి. లేసు అల్లికలకు గత కొద్ది నెలల నక్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. ఇప్పుడు లేస్ ఉత్పత్తులకు పూర్వ వైభవం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. అందుకే వాటి ప్రాభవం ఎన్నటికీ తగ్గదు.

'ఒన్ డిస్ట్రిక్ట్.. ఒన్ ప్రొడక్ట్' కింద బొబ్బిలి నమూనా వీణ, నర్సాపురం లేసు ఉత్పత్తులకు పురస్కారాలు అందాయి. కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడి నాగరాణిలు పురస్కాలు అందుకున్నారు.

నర్సాపురం లేసు ఉత్పత్తులు, బొబ్బిలి వీణకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి నుంచి వచ్చిన సాంప్రదాయ సరస్వతి వీణ విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. సర్వస్వతి వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతి, జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలూ ఇవ్వడం ఆనవాయితీ బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి బొబ్బిలి వీణల తయారీకి ఆలవాలం వీణల తయారీ ఒక అరుదైన హస్త కళ. దాదాపు 300 కుటుంబాలు గత 100 సంవత్సరాలకు పైగానే తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నాయి. □

# ఉద్యాన రంగంలో బంగారు పతకాలు

యువత అంతా కంప్యూటర్ విద్య, ఏఐ సాంకేతికత వైపు పరుగులు తీస్తోంటే.. ఈ ఇద్దరమ్మాయిలూ సాగు విద్యలో చేరారు. ఉద్యాన రంగంలో భవిష్యత్తు కోసం కలలు కన్నారు. అనుకున్నది సాధించడానికి ఇష్టపడి చదివారు. ఆ శ్రమకు ఫలితంగానే జి. చైతన్య, అచ్యుత మోనికా శ్రీనాగిని బంగారు పతకాలు సాధించారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా వాటిని అందుకున్నారు.

**మొక్కల డాక్టర్ కావాలని..**

**జి. చైతన్య............**

మాది వ్యవసాయ కుటుంబం కాదు. అయినా ఎంతో ఇష్టంగా ఉద్యాన కోర్సులో చేరాను. మేముండేది. హైదరాబాద్‌లోని చందానగర్. నాన్న రమణారెడ్డి చిరుద్యోగి, అమ్మ పద్మ గృహిణి. ఇంట్లో ఇద్దరాడపిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు. పేదరికంలో ఉన్నా నా చదువుకోసం వారు ఎంతగానో కష్టపడ్డారు. నేను చిన్నప్పటి నుంచీ మెరిట్ స్టూడెంట్‌ని ఇంటర్ తర్వాత డాక్టర్ కావాలనుకుని నీట్ పరీక్ష రాశా ప్రైవేటు కళాశాలలో సీటు వచ్చింది. ఆర్థికస్థోమత లేకపోవడంతో మనుషుల డాక్టర్‌ను కాకపోయినా మొక్కల (ప్లాంట్) డాక్టర్ కావాలనుకున్నా. ఇంట్లో ఒప్పించి తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హార్టీకల్చర్) కోర్సులో చేరారు. ప్రణాళికాబద్ధంగా చదివి నాలుగు బంగారు పతకాలను సాధించా, విశ్వవిద్యాలయ చరిత్రలో నాలుగు పతకాలు సాధించిన మొదటి విద్యార్థిని నేనే కావడం గర్వంగా ఉంది. యూనివర్సిటీలో చేరాకు... వ్యవసాయం, ఉద్యాన పంటలు, రైతుల జీవన స్థితిగతులపై అవగాహన ఏర్పడింది. ఈ రంగంలోనే శాస్త్రవేత్తగా ఎదుగుతా అన్నదాతలకు అన్ని విధాల అండగా నిలుస్తా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టిసారిస్తా. నాలాంటి పేద విద్యార్థులు ఉద్యాన విద్యను అభ్యసించేందుకు సహకరిస్తా.





**రైతుల కోసం.... - అచ్యుత మోనికా శ్రీనాగిని...**

తాడేపల్లిగూడెం సమీపంలోని ఆవపాడు మా స్వస్థలం. నాన్న కలికిమూర్తి, అమ్మ అనంతలక్ష్మి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. చిన్నప్పటి నుంచీ వారితో పాటు పొలాల్లో తిరిగేదా అన్నదాతల కష్టాలను దగ్గరగా చూడడంతో... ఎప్పటికైనా వాటిని దూరం చేయాలనుకున్నా. అందుకే, ఇంటర్ తర్వాత ఎంసెట్ రాసి ఏపీలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఈ (హార్టీకల్చర్) కోర్సు పూర్తి చేశాను. ఈ డిగ్రీతోనూ ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నా... శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీజీ సీటు పొంది ఎమ్మెస్సీ పూర్తి చేయడంతో ఉద్యాన రంగంలో సంపూర్ణ అవగాహన కలిగింది. రెండు బంగారు. పతకాలను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. నేను నేర్చుకున్న జ్ఞానాన్ని మా నాన్న లాంటి రైతులకు అందించి, వారి అభ్యున్నతికి కృషి చేస్తాను, □

# ప్లాస్టిక్‌తో ముప్పు

**ప్లాస్టిక్ వినియోగం విషయంలో** చాలామందికి ఈ సందేహం ఉంటుంది. ప్లాస్టిక్, క్యాన్సర్ మధ్య గల సంబంధాన్ని పరిశీలిస్తే.. ప్లాస్టిక్ తయారీ వాడే రసాయన సమ్మేళనాలు ఇందుకు కారణమవుతుంటాయి.



ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. వాటిని పీల్చినప్పుడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఫుడ్ గ్రేడ్ కాని ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను పెట్టకపోవడం, అవెన్‌లో పెట్టి వేడి చేయకపోవడం, అలాంటి వస్తువులను వాడకపోవడం మంచిది.

అలాగే క్యాన్సర్‌ను కారణమయ్యే రసాయనాలను విడుదల చేసే పరిశ్రమలకు దూరంగా ఉండడం అన్ని రకాలుగానూ మంచిది. ఏ రకంగా సర్వే ప్లాస్టిక్ వినియోగానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉన్నప్పుడే ఇటు క్యాన్సర్ అటు ఇతర ఆర్యోగాల ముప్పును తగ్గించు కోవచ్చు. □

# పొట్ట తగ్గడం ఎలా?

**చాలామంది అమ్మాయిలు ఇబ్బంది పడే అంశాల్లో పొట్ట దగ్గర కొవ్వు. అది తగ్గడం కోసం కడుపు మాడ్చుకోవడం, కెలోరీలు లెక్కేసుకొని తినడం, కిలోమీటర్ల కొద్దీ నడవడం వంటివెన్నో చేస్తారు. అవసరమైన పోషకాలు అందక కొత్త సమస్యలు తెచ్చుకుంటారు. అలా కాకూడదంటే కొన్ని అలవాట్లు చేసుకుని, క్రమంగా పాటించాలి అంటున్నారు నిపుణులు. అవేంటంటే...**



✦ అల్పాహారం మానొద్దు. ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బొహైడ్రేట్లు, పీచు ఎక్కువగా ఉండే గుడ్లు, ఓట్స్, రాగి, తాజాపండ్లు, నట్స్ వంటివాటికి దానిలో చోటివ్వాలి. ఇవి మెటబాలిజాన్ని మెరుగుపరుస్తాయి. శరీరానికి కావల్సిన శక్తినివ్వడంతోపాటు జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. రోగనిరోధకతనూ పెంచుతాయి.

✦ రోజూ కొద్దిసేపైనా వ్యాయామానికి చోటివ్వాలి. మధ్యస్థ స్థాయి వాటికి వారంలో రెండున్నర. గంటలైనా కేటాయించాలి. కండలతో మాకేం పని అనుకోకుండా రోజూ కొంచెం సేపు బరువులు ఎత్తి దించండి. డంబుల్స్ వగైరా కొనాల్సిన పనిలేదు కానీ. రెండు వాటర్ బాటిళ్లతో చేసినా సరే! ఇంకా గుంజీళ్లనూ జోడించుకుంటే మేలు. ఇవి కొవ్వును కరిగిస్తూనే మెటబాలిజాన్నీ మెరుగుపరుస్తాయి.

✦ బోర్ కొట్టినా, ఒత్తిడి పెరిగినా చిరుతిళ్లవైపు మనసు మళ్లుతుంది. అందుబాటులో బాదం, తాజా పండ్లు, క్యారెట్, కీర వంటి కాయగూరల ముక్కలను దగ్గర ఉంచుకొని తింటే సరి. ఇవి ఆకలిని అదుపు చేయడమే కాదు, జీర్ణక్రియనీ మెరుగుపరుస్తాయి.

✦ నీళ్లు బాగానే తాగుతున్నారా? ఇదీ 'పొట్ట'కు కారణమే! కనీసం 2 లీటర్లు తాగుతున్నారో లేదో చూసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేస్తూనే ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తాయి. మజ్జిగ, హెర్బల్ టీ, పండ్ల రసాల రూపంలో తీసుకున్నా మంచిదే. ఇంకా ఏం తింటున్నాం, తాగుతున్నాం అన్నది గమనించుకుంటే ఉండాలి. కాబట్టి, తినేటప్పుడు ఫోన్, టీ, పుస్తకాలను దూరంగా ఉండాలి.

✦ చివరగా ఒత్తిడి కూడా ఈ సమస్యకు మూలమే. పైగా త్వరగా కొవ్వు కరగకుండా చేస్తుంది. కాబట్టి, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వగైరా చేస్తూ దాన్నీ అదుపులో పెట్టుకోండి. శారీరకరంగా, మానసికంగా ఆరోగ్యంగా అవ్వడమే కాదు.. పొట్టదగ్గర సహా అనవసరం కొవ్వు కరగడం ఖాయం. □

# మౌనానికి కారణం

**కొంత మంది అమ్మాయలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధానమివ్వకుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో చెబుతున్నారు నిపుణులు.**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవుతుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేకపోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వకపోవడం వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిసానతరు. అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలే గుర్తించగలగాలి. ఆపై ముందు వాళ్ల మనసు తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని ఏది ఏమైనా మేమున్నామనే బరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్నివవ్వగలగాలి.

నిందించకూడదు..

ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేకపోయినా.. పిల్లలను వెంటనే నిందించకూడదు. నిన్ను చదివించడానికి మేమెంత కష్టపడుతున్నాము.. నీకు చదువు వృథా వంటి మాటలతో గాయపరచకూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటువంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగలమనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతికూలతగా ఆలోచించకుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది.



**స్ఫూర్తి నింపాలి...** ఏ విషయాన్నైతే తమ సమస్యగా భావిస్తున్నారో దాన్ని పరిష్కరించుకునే పలు మార్గాలను వారెదుట ఉంచాలి. తీరని సమస్య అంటూ లేదని అవగాహన కలిగించాలి. ఇవన్నీ వారిలోని ఆత్మన్యూనతను దూరం చేసి, ప్రేరణ పొందేలా చేస్తాయి. అంతేకాదు, దేన్నైనా సాధించగలిగే సామర్థ్యం నీలో ఉందంటూ ఉత్సాహపరచాలి. గతంలో తను చేసిన సాధనలను గుర్తు చేసి ప్రశంసించాలి. ప్రతిభను మెచ్చుకుంటూ.. ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తే చాలు. చదువులోనే కాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ ఎదురు నిలిచి పోరాడే తత్వాన్ని నేర్చుకుంటారు. అనుకున్నవన్నీ సాధించి విజేతలుగా నిలుస్తారు. □

# పొదుపు పాఠాలు నేర్పిద్దాం !

**పిల్లలకు ఎప్పే ముఖ్య మైన అంశాల్లో డబ్బు పొదుపు చేయడం ఒకటి.. చిన్న పిల్లలే అప్పుడే ఎందుకు అనుకుంటే పొరపాటే ఈ కాలం పిల్లలకు ఆది ముఖ్యం అంటున్నారు. ఆర్థిక నిపుణులు.**



జీవితంలో ఏ సమస్యలోనైనా ముందుకు వెళ్లాలంటే డబ్బు ప్రాధాన్యతను తెలుసుకోవాలట అందుకే నిపుణులు లక్ష జ్ఞానంతో పాటు, ఆర్థిక పరిజ్ఞానం కూడా చిన్నారులకు అలవాటు కావాలి. చిన్న వయసు నుంచే ఆర్థిక లక్ష్యాలను ఎలా చేరుకోవాలో వారికి చిన్న పిల్లల బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయమంటున్నారు. వారికి స్పష్టమైన లక్ష్యాలను ఎలా ఏర్పరచుకోవాలో వివరించాలి. ఈ కాలంలో పిల్లలు దేన్నైనా శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. అందుకే మీరు వారికి బహుమతిగా ఇచ్చే డబ్బును పొదుపు చేయమని ప్రోత్సహించండి. ప్రతి నెలా ఆ మొత్తం ఐదు శాతం పెంచుతామని చెప్పండి. ఇది వారి పొదుపు చేయాలనే ఆసక్తిని పెంచుతుంది. ఒకవేళ పాకెట్ మనీ ఖర్చు పెడితే.. ఓ డైరీ రాయండి. నెల చివరిలో ఎంత ఖర్చు చేశారో లెక్కలు వేయమంటే సరి, అవసరం, అత్యవసరం, అనవసరమైన ఖర్చుల గురించి అర్థమయ్యేలా వివరించాలి. అనవసర ఖర్చులు అనే వారిని ప్రోత్సహించాలి ఇలా ఆదాయ, వ్యయాలను చిన్నప్పటి నుంచే చిన్నారుల డైరీలో రాయడం వల్ల ఆర్థిక క్రమశిక్షణా అలవడుతుంది. □

## చెలి చిట్కా

✦ కొత్తచీపురు ఎక్కువ కాలంరావాలంటే కొంచెం నీటిలో ఉప్పు వేసి వేడి చేయండి వేడి చేసిన నీటిలో చీపురుమొదళ్ళను నానబెట్టండి.

✦ పసుపు చందనం రెండింటిని పాలమీద మీగడతో బాగా కలిపి స్నానానికి అరగంటముందు ముఖానికి పట్టంచి చన్నీళ్ళతో కడిగితే ముఖవర్ఛస్సు పెరుగుతుంది. □



# 'రామభక్త హనుమాన్'

రామానామాన్ని స్మరించినంతలో ఆ రామునికన్నా ముందుగా ఆంజనేయుడు పలుకుతాడని నమ్ముతారు భక్తులు. 'రామభక్త హనుమాన్' అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. తమను సర్వదా రక్షిస్తాడని నిండైన భక్తితో ఆరాధిస్తారు.


భక్తి నవవిధాలు. అందులో స్మరణ భక్తికి, ధ్యానభక్తికి ఆంజనేయుడు ప్రబల ప్రతీక. అంజనీదేవి పుత్రుడు కనుక ఆంజనేయుడని, వాయుదేవుని అంశతో పుట్టినవాడు కనుక మారుతి, పావని అని, హనువు (దవడ) దెబ్బతిన్న కారణంగా హనుమతుడని ఆ పవన తనయుడికి ఎన్ని పేర్లో! హనుమంతుడు జన్మతః వానరం. పరమశివుని మరో రూపమైన రుద్రుని అంశతో, అగ్నితేజంతో, వాయుబలంతో జన్మించినవాడు. పసివాడుగానే ఆకాశంలోకి ఒక్క ఎగురు ఎగిరి, భానుడి వద్దకు వెళ్లాడు. ఏకంగా 24 లోకాలను తల్లడిల్ల చేయగల మహోగ్ర తేజోసంపన్నమైన సూర్య బింబాన్నే మింగబోయాడు మహాశక్తిమంతదూర ఆంజనేయుడు. జ్ఞానం, బలం, ధైర్యం, వీరం, సాహసం, యోగం, వేగం, భక్తి, శక్తి-ఇలా అన్నిటినీ కలిగి ఉన్న పరాక్రమశాలి హను మంతుడు. లోకైక శక్తికి ఏకైక ప్రతీక హనుమ. అందుకే దైహిక శక్తినిచ్చే వ్యాయామ శాలలకు 'హనుమాన్' అని పేరు పెట్టుకుంటారు. □



ఆధ్యాత్మికం

# ఆరోగ్యానికి ఆవ ఆకు

**తాలింపులో వేసే అర చెంచా ఆవాలు కూర,** చారుల రుచిని అమాంతం పెంచేస్తాయి. ఆవాల పొడి వేయడం వల్లే కూరగాయ పచ్చళ్లు గొప్పగా ఘుమాయిస్తాయి. ఇలా మన ప్రాంతాల్లో ఆవాలను ఎక్కువగానే ఉపయోగిస్తాం. కానీ ఆ ఆకు తినే అలవాటు పెద్దగా లేదు. నిజానికి ఇది చాలా మంచిదంటున్నారు ఆహార నిపుణులు. పాలకూర, మెంతికూరల్లా ఆవాకు కూడా శ్రేష్ఠమైందని, వీలైనప్పుడల్లా ఏదో ఒక రూపంలో తినేందుకు ప్రయత్నించమని చెబుతున్నారు. ఆవాకును కంది, పెసర, శనగ, పప్పులతో కలిపి వండొచ్చు. దీన్నిఆలివ్ నూనెలో వేయించి, కారం, ఉప్పు, వెల్లుల్లి, నిమ్మరసం వేస్తే సైడ్ డిష్ అయిపోతుంది. సలాడ్ రూపంలో అయితే పిల్లలూ పెద్దలూ అందరికీ చేసేబజ్జీలు పాలకూర పకోడీల్లానే ఘుమాయిస్తాయి. ఆవాకు ఎ, బి1, బి3, బి6, సి, ఇ, కె మిటమిన్లు, ప్రొటీన్లు, కాపర్ ఇలా శరీరానికి అవసరమైనవెన్నో ఉన్నాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను తరిమి కొట్టేయాంటీఆక్సిడెంట్స్ ఆవాకులో విస్తారంగా ఉన్నాయి. ఇది టైప్-2 దయాబెటిస్, గుండెజబ్బులను నిరోధిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తం గడ్డకుండా చేస్తుంది. ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. కంటిచూపును మెరుగుపరుస్తుంది. ఆవాకు మతిమరపును కూడా తగ్గిస్తుందని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. ఇన్ని తాభాలున్న ఈ ఆకును మనమూ తిందామా. □



# తెర

## బుట్టబొమ్మకు బంపరాఫర్



తాజాగా వరుస ఫ్లాపులతో డీలా పడిపోయిన కన్నడ బ్యూటీ పూజా హెగ్డేకు టాలీవుడ్‌లో మళ్లీ ఒక మంచి అవకాశం వచ్చింది. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వారసుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన దుల్కర్ సల్మాన్ హీరో నుంచి స్టార్ హీరో రేంజ్‌కి వడివడిగా అడుగులు వేస్తున్నాడు. అయితే మలయాళంలో కంటే తెలుగులోనే అతడికి మంచి ఛాన్సులు వస్తున్నాయి. సీతారామం, లక్కీ భాస్కర్ చిత్రాలతో బ్లాక్‌బస్టర్లు అందుకున్న దుల్కర్ తెలుగులో తీయబోతన్న సినిమాలో పూజా హెగ్డేని హీరోయిన్‌గా తీసుకునేందుకు మేకర్స్ నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకి కథ వినిపించగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై తర్వలోనే మేకర్స్ అఫిషియల్‌గా అనౌన్స్‌మెంట్ చేయనున్నారు. ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు.

టాలీవుడ్‌లో ఛాన్సులు లేకపోవడంతో కోలీవుడ్‌లో ప్రయత్నిస్తే అక్కడా బీస్ట్ రూపంలో భారీ దెబ్బ తగిలింది రెట్రోతో సూర్య అయినా తన లక్ మారుస్తాడని ఆశ పెట్టుకోగా అదికూడా వర్కౌట్ కాలేదు. దీంతో కోలీవుడ్‌లోనూ రూటు మార్చి ఐటమ్ గర్ల్‌గా మారింది. తాజాగా రజినీకాంత్ కూలీ చిత్రంలో ఐటెమ్ సాంగ్ చేసిన పూజా రెడ్ కలర్ డ్రెస్‌లో గ్లామర్ చూపిస్తూ రెచ్చిపోయింది. వయ్యరాలు ఒలకబోస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు బాగానే కష్టపడింది. తెలుగులో మళ్లీ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తానని రెట్రో పమోషన్లలో చెప్పిన బుట్టబొమ్మ ఆ ప్రయత్నంలో తొలి అడుగు బలంగానే వేసినట్లు కనిపిస్తోంది. తాజాగా టాలీవుడ్‌లో ఓ బంపరాఫర్‌ని పట్టేసిందని టాక్ వినిపిస్తోంది.

## అస్తమించిన మరో వెలుగు తార



తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాలలో మెరిసిన ఓ వెలుగు తార బి. సరోజా దేవి. ఆమె చూపులో కాంతి, మాటల్లో మాధుర్యం, అభినయంలో చిలిపితనం, చింతనలో చైతన్యం.. తన చిరునవ్వుతో వెండితెరకు జీవం పోసిన నటి. ఒకరికి కాదు.. ఏడు దశాబ్దాల సినీ అభిమానులకు గుర్తుండిపోయే పేరు. చిన్న వయసులోనే కళలకు లోనైన మనోహర నటీమణి, తన నాట్యనైపుణ్యంతో తొలిచూపులోనే హృదయాలను గెలుచుకుంది. 1950లలో తెరంగేట్రం చేసిన ఆమె, నటనకు అర్థం చెప్పిన కళాకారిణి. పచ్చని పల్లెపట్నం నుంచి వచ్చినా - మహానగరాల వెండితెర మీద వెలిగిన చుక్కంత చుక్క. అభినయంలో ఆవేశం ఉండేది కాదు.. ఆహ్లాదం ఉండేది. ప్రతి పాత్రను హృదయంతో తలదన్నేది. ఆమె చెప్పిన ప్రతి మాట, పలికిన ప్రతి భావం మనసుని తాకేది. ఆమె చూపు చుక్కలు కథ చెప్పేవి... చిరునవ్వు ఓ పాటల మాదిరిగా అనిపించేది. జీవితంలో ఆనందాలు, విషాదాలు ఎదురైనప్పటికీ - ఆమె అణకువతనంతో, శాంత స్వభావంతో ముందుకు సాగారు. భార్యగా, నటిగా, దేశాభిమానిగా తన పాత్రలను సమంగా నెరవేర్చారు. ఆమె జీవితం - ఒక అందమైన పద్యం, ఆమె ప్రయాణం - ఒక స్ఫూర్తిదాయక కథనం, ఆమె వ్యక్తిత్వం - ఒక ఆదర్శ స్త్రీకి నిలువెత్తు ఉదాహరణ. సరోజాదేవి ఇక లేరు అన్న నిజం దక్షిణాది చిత్ర రంగాలకు దిగ్భ్రాంతికి గురి చేసింది.

కన్నడ నాట పుట్టినా తెలుగువారిని అందాల అభినయంతో ఆకట్టుకున్నారు బి.సరోజాదేవి... నాటి మేటి నటుల చిత్రాలలో సరోజాదేవి అందం చిందులు వేసిన తీరు మరపురానిది... మరువలేనిది. చిలుక పలుకులు వల్లిస్తూ, నవ్వులు చిందిస్తూ చూపరులను ఇట్టే ఆకట్టుకొనే రూపంతో తెలుగు చిత్రసీమలో తనదైన బాణీ పలికించారు బి.సరోజాదేవి. కన్నడ సీమలో పుట్టిన సరోజాదేవి తెలుగు పదాలు పట్టి పట్టి పలికేవారు. అయినా అది ఆమె బాణీగా భాసిల్లింది. ఆ ముద్దుమోములో పలికే తెలుగు పలుకు మరింత ముద్దుగా ఉండేదని ఆ నాటి అభిమానులు ఈ నాటికీ గుర్తు చేసుకుంటారు. సరోజాదేవి ఆమె కన్నవారికి నాల్గవ సంతానం. ఆమె తండ్రి భైరయ్య పోలీస్ డిపార్ట్ మెంట్ లో పనిచేసేవారు. నలుగురిని పోషించే స్తోమత లేదని భైరయ్య తండ్రి సరోజాదేవిని వేరేవారికి దత్తత ఇవ్వాలని చూశారు. అయితే భైరయ్య మాత్రం తన కూతురును తానే పోషిస్తానని, చిన్నతనంలోనే డాన్స్ నేర్పించారు. అదే సరోజాదేవిని చిత్రసీమ వైపు ఆకర్షించేలా చేసింది..

చిట పట చినుకులు పడుతూ ఉంటే.. అంటూ హుషారైన పాటలతో కుర్రకారును ఉర్రూతలూగించారు అలనాటి అందాల తార బి.సరోజాదేవి. కథానాయికగా ఎన్నో పాత్రలకు ప్రాణం పోసి తనదైన శైలి ముద్ర వేశారు. వృద్ధాప్య సమస్యతో సోమవారం ఉదయం బెంగుళూరులోని తన నివాసంలో మరణించారు. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన ఆమె నటించారు. 13 ఏళ్ల వయసులో చిత్ర రంగంలో అడుగుపెట్టిన సరోజాదేవి దాదాపు 200 చిత్రాల్లో నటించి అభినయ సరస్వతిగా గుర్తింపు పొందారు. సరోజాదేవి ఇక లేరు అన్న నిజం దక్షిణాది చిత్ర రంగాలకు దిగ్భ్రాంతికి గురి చేసింది.



### దేవి పాత్రల్లోనూ ఒదిగి పోయి...

అందాలతారగా అభిమానుల మదిని దోచుకున్న బి.సరోజాదేవి హున్నప్ప భాగవతార్ నటించి, రూపొందించిన మహాకవి కాళిదాసుఖి అనే కన్నడ చిత్రంతో తెరకు పరిచయమయ్యారు. వరుసగా కొన్ని కన్నడ చిత్రాల్లో నటించిన తరువాత ఓ తమిళ సినిమాలోనూ సరోజా అందం మురిపించింది. ఆ తరువాత ఎన్టీఆర్ తన సొంత చిత్రం పాండురంగ మహాత్మ్యం తో తెలుగు తెరకు సరోజాదేవిని పరిచయం చేశారు. పాండురంగ మహాత్మ్యం సమయంలో భూ కైలాస్‌లో పార్వతి దేవి గా నటించారు సరోజాదేవి. ఆ తరువాత ఏయన్నార్ పెళ్లి సందడిలో ఓ పాత్ర పోషించారు. కానీ, ఏయన్నార్‌తో ఆమె నటించిన పెళ్ళికానుక నటిగా సరోజా దేవికి మంచి మార్కులు సంపాదించి పెట్టింది.

### వాన పాటతో కుర్రకారు మురిపెం

పెళ్ళికానుక సమయంలోనే యన్టీఆర్ దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రం సీతారామ కళ్యాణంలో రామారావు రావణునిగా నటించగా, సరోజాదేవి మండోదరిగా అభినయించారు. ఈ చిత్రం విడుదలైన ఇరవై రోజులకే యన్టీఆర్, సరోజాదేవి జంటగా తెరకెక్కిన ఇంటికి దీపం ఇల్లాలే విడుదలయింది. అందులోనూ సరోజాదేవి గ్లామర్ గమ్మత్తుగా జనాన్ని ఆకట్టుకుంది. దక్షిణాదిన నాటి మేటి హీరోలందరి సరసన సరోజాదేవి అభినయించి అలరించారు. సరోజాదేవి నవ్వు మోము చూస్తే చాలు అనుకొనేవారు ఆమె నటించిన చిత్రాలను చూడటానికి థియేటర్లకు పరుగులు తీశారు. ఏయన్నార్‌తో సరోజాదేవి నటించిన చిత్రాలు జనాన్ని విశేషంగా అలరించాయి. వారిద్దరిపై ఆత్మబలం చిత్రం కోసం చిత్రీకరించిన వాన పాట అప్పట్లో కుర్రకారును కిర్రెక్కించింది. ఆ పాట ఈ నాటికీ అభిమానులను మురిపిస్తూనే ఉండడం విశేషం. సరోజాదేవిని తెలుగు సినిమా రంగానికి యన్టీఆర్ పరిచయం చేయగా, ఆయనతో అనేక చిత్రాల్లో నాయికగా నటించి మురిపించారామె.

చిన్న వయసులోనే కళలకు లోనైన మనోహర నటీమణి

ఏడు దశాబ్దాల సినీ అభిమానులకు కలల రాణి


తరగని కాంతి.. కరగని కీర్తి సరోజాదేవి సొంతం

అలనాటి లేడీ సూపర్‌స్టార్ మృతితో దక్షిణాది చిత్ర రంగాల దిగ్భ్రాంతి



### ఎన్టీఆర్‌తో చిత్ర బంధం

అయితే ఎన్టీఆర్‌కు చెల్లెలిగా, ఏయన్నార్‌కు హీరోయిన్‌గా సరోజాదేవి నటించిన శ్రీకృష్ణార్జున యుద్ధం జనాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులోని పాటలు ఈ నాటికీ జనాన్ని మురిపిస్తూనే ఉన్నాయి. ఎన్టీఆర్‌తో బాపు తెరకెక్కించిన శ్రీరామాంజనేయ



యుద్ధంలో సీతమ్మగానూ సరోజాదేవి అలరించారు. రామారావు దర్శకత్వంలో రూపొందిన చివరి చిత్రం ఖిసామ్రాట్ అశోకలోనూ సరోజాదేవికి తగిన పాత్ర నిచ్చి గౌరవించారు. యన్టీఆర్ నటించిన జానపద, పౌరాణిక, సాంఘిక, చారిత్రకాల్లో సరోజాదేవికి తగిన పాత్రలే లభించాయి. యన్టీఆర్ జగదేకవీరుని కథలో దేవకన్యగా సరోజాదేవిని చూసి నిజంగా మానవమాత్రురాలు కాదనీ ఆ నాటి జనం భావించారు. అంటే సరోజా అందంలోని బంధం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. సరోజాదేవి పలు భాషల్లో ఎంతోమంది టాప్ స్టార్స్‌తో నటించి మురిపించారు. అయితే ఆమె అభిమాన నటుడు మాత్రం ఎన్టీఆరేనని పలు మార్లు చెప్పుకున్నారు. అదే తీరున వారిద్దరికీ చిత్ర బంధం కూడా నెలకొనడం విశేషం.

ఉత్తరాదిన సైతం సరోజాదేవి అందం జనానికి బంధం వేసింది. దిలీప్ కుమార్, వైజయంతీ మాల నటించిన పైఘమ్ చిత్రంతో తొలిసారి హిందీ తెరపై వెలిగింది బి.సరోజాదేవి. వైజయంతీమాలకు, సరోజాదేవికి కొన్ని పోలికలు ఉండడంతో అందరూ వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్ళు గా భావించేవారు. ఉత్తరాదిన సైతం బి.సరోజాదేవి అందం చిందులు వేసింది. ఆ నాటి హిందీ సినిమా టాప్ స్టార్స్ తో సరోజాదేవి జోడీ కట్టి కనువిందు చేశారు. 2009 సంవత్సరం యన్టీఆర్ జాతీయ అవార్డునూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి సరోజాదేవి అందుకోవడం మరింత విశేషం. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. నాటి అందాల అభినేత్రి సరోజాదేవి కీర్తి కిరీటంలో ఎన్నెన్నో మేలిమి రత్నాలు. అవి నేటికీ విరజిల్లుతూనే ఉన్నాయి... ఆ కాంతి తరిగిపోదు... సరోజాదేవి కీర్తి కరిగిపోదు.

పౌరాణిక, జానపద, సాంఘికాల్లో యన్టీఆర్ సరసన నటించి విజయాలు చూసిన సరోజాదేవికి రామారావుతో ఓ తీరని కోరిక మిగిలింది. అదేమిటంటే వెండితెర శ్రీకృష్ణునిలా అనితరసాధ్యంగా సాగిన యన్టీఆర్ శ్రీకృష్ణ పాత్ర ధరించిన చిత్రంలో తాను ఆయనకు జోడీగా నటించాలన్నది సరోజాదేవి అభిలాష. యన్టీఆర్ శ్రీకృష్ణ పాత్ర ధరించిన శ్రీకృష్ణార్జునయుద్ధం, దానవీరశూర కర్ణ చిత్రాలలో సరోజాదేవి నటించినా శ్రీకృష్ణ పాత్రకు జంటగా నటించలేదు. అందువల్లే అది తనకు తీరని కోరికగా చెప్పుకొనేవారు సరోజాదేవి.



## అలరిస్తున్న రంగనాయకి..

రానా నిర్మాతగా వ్యవహరిస్తున్న కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ట్రైలర్ అద్భుత రెస్పాన్స్ దక్కించకుంది. అయితే.. తాజాగా ఈ మూవీ నుంచి రంగనాయకి అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ అభిమానులను అలరిస్తోంది. ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా మణిశర్మ సంగీతంలో ధనుంజయ ఆలపించారు. కేరాఫ్ కంచరపాలెం ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య చిత్రాలతో మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న నిర్మాత, నటి ప్రవీణ పరుచూరి తాజాగా ఓ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సారి తానే స్వయంగా దర్శకత్వం వహిస్తూ కొత్తపల్లిలో ఒకప్పుడు అనే సినిమాను రూపొందించింది. మనోజ్ చంద్ర, మోనిక, ఉషా బోనెల హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుండగా రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి కీలక పాత్రల్లో నటించారు.



## విశాల్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం


ప్రముఖ కథానాయకుడు విశాల్ హీరోగా 35వ చిత్రం మొదలైంది. దీనిని సీనియర్ నిర్మాత ఆర్.బి. చౌదరి తన సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌లో నిర్మిస్తుండటం విశేషం. 1990లో పుదు వసంతంతో సూపర్ గుడ్ ఫిలిమ్స్ సంస్థ మొదలైంది. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఆర్. బి. చౌదరి 98 చిత్రాలు నిర్మించారు. ఆయన బ్యానర్ నుండి వస్తున్న 99వ చిత్రం ఇది. విశాల్ హీరోగా ఆర్.బి. చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమంలో జులై 14 ఉదయం అట్టహాసంగా చెన్నయ్‌లో జరిగాయి. దర్శకుడు వెట్రిమారన్, శరవణ సుబ్బయ్య, మణిమారన్, వెంకట్ మోహన్, శరవణన్ దీనికి హాజరయ్యారు. అలానే హీరోలు కార్తీ, జీవా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాకు రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్, రవి అరసు కాంబోలో వస్తున్న తొలి చిత్రం ఇది. ఈ సినిమాలో దుషార విజయన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ యేడాది సంక్రాంతి కానుకగా విడుదలైన మదగజరాజాకు రిచర్డ్ ఎం. నాథన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యహరించారు. ఆయనే ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నారు. అలానే విశాల్ మార్క్ ఆంటోనీకి సంగీతం అందించిన జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ తాజా చిత్రానికి స్వరాలు సమకూర్చుతున్నారు. తంబి రామయ్య, అర్జై ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ చెన్నయ్ లోనే జరుగునుంది. సింగిల్ షెడ్యూల్ లో 45 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు.

## రిస్కీ స్టంట్ చేస్తూ ఫైట్ మాస్టర్ రాజు మృతి

తమిళ హీరో ఆర్య, పా రంజిత్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రంలో స్టంట్ మాస్టర్ రాజు ప్రాణాలు కోల్పోయారు. కార్ ప్లింగ్ స్టంట్‌ను చేస్తుండగా అదుపుతప్పిన ప్రమాదానికి దారి తీసింది. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. స్టంట్లలో అనుభవం ఉన్న రాజు మృతి వార్తతో తమిళ సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సినీ షూటింగుల్లో యాక్షన్ సీన్స్ తీయడం ఎంత ప్రమాదకరమో తెలిసిందే. ఏమాత్రం తేడా వచ్చినా.. ఒక్క పొరపాటు జరిగినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. తాజాగా తమిళ సినీ పరిశ్రమలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. ప్రముఖ స్టంట్ మాస్టర్ రాజు సినిమా షూటింగులో ప్రమాదవశాత్తూ మరణించడం అందరినీ కలిచివేస్తోంది. కోలీవుడ్ హీరో ఆర్య, పా రంజిత్ కాంబినేషన్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా దీనికి సంబంధించి యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కార్ స్టంట్ చేస్తుండగా ఊహించని విధంగా రాజు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో తమిళ సినీ ఇండస్ట్రీ ఒక్కసారిగా షాకైంది. హీరోలు, దర్శకులు, టెక్నీషియన్స్ ఇలా ఎంతోమంది రాజు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



## ఈసారి ఒక్కొక్కడికి బుర్రపాడు..




తాజాగా కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రాల్లో కె ర్యాంప్ ఒకటి. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రాజేష్ దండా, శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో కిరణ్ సరసన యుక్తి తరేజా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. క సినిమా తరువాత నుంచి కిరణ్ పై అభిమానులు భారీ అంచనాలనే పెట్టుకుంటున్నారు. సోమవారం కిరణ్ పుట్టినరోజు కావడంతో కె ర్యాంప్ నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేసి బర్త్ డే విషెస్ చెప్పుకొచ్చారు మేకర్స్. కె ర్యాంప్ గ్లింప్స్ మొత్తాన్ని బూతులతో నింపేశాడు డైరెక్టర్. ఈసారి ఒక్కొక్కడికి బుర్రపాడు.. బుడ్డలు జారుడే అనే డైలాగ్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకుంది. గ్లింప్స్‌లో బూతు పదాలు మాట్లాడుతూ కిరణ్ కనిపించాడు. కుమార్ లైఫ్ ఎలా ఉంది అని అడిగిన ప్రశ్నకు.. ప్రతిసారి కిరణ్ బూతుమాటను మింగేయడం.. బార్‌లో తాగుతూ ఫైట్ చేయడం లాంటి సీన్స్‌ను చూపించారు.

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వైజాగ్ వేదిక



పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఈ నెల 24న రిలీజ్‌కి సిద్ధమైంది. విడుదలకు ఇంకా 10 రోజుల సమయమే ఉండటంతో మేకర్స్ ప్రమోషన్ల జోరు పెంచారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 20న వైజాల"గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాజమౌళి, త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఈ ఈవెంట్ ముందుగా తిరుపతి, విజయవాడలో నిర్వహించాలనుకున్నా చివరికి వైజాగ్ ఫిక్స్ చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి చాన్నాళ్ల తర్వాత వస్తోన్న హరిహర వీరమల్లు చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సుమారు ఐదేళ్లుగా సెట్స్ మీదున్న ఈ చిత్రం ఎన్నో అవాంతరాలు, సమస్యలు ఎదుర్కొని ఎట్టకేలకు ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే ఎన్నో వాయిదాలు పడటంతో మొన్నటివరకు ఈ ప్రాజెక్టుని ఎవరూ పట్టించుకోలేదు. అయితే ట్రైలర్ రిలీజ్ అయ్యిందో లేదో అంచనాలు పీక్స్‌కి చేరిపోయాయి. అంతేకాదు 24 గంటల్లో అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా పుష్ప2ను పక్కకు నెట్టేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ మూవీలో ధర్మ పరిరక్షకుడిగా, చారిత్రక యోధుడిగా పవన్ కళ్యాణ్ కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్ కాగా, బాబీ డియోల్ ఔరంగజేబు పాత్రలో ప్రతినాయకుడిగా కనిపిస్తున్నారు. ఏఎం రత్నం నిర్మిస్తోన్న పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ హరిహర వీరమల్లు: పార్ట్ 1 - స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్ పేరుతో విడుదల కానుంది.

## రాయలవారి బయోపిక్



చరిత్రలో ఎందరో రాజులు వచ్చారు.. వెళ్లారు.. అయితే విజయనగర సామ్రాజానికి చెంది శ్రీకృష్ణదేవరాయలు మాత్రం తానే ఓ చరిత్ర సృష్టించారు. ఆంధ్రభోజుడుగా ప్రసిద్ధి చెందిన ఆయన పరిపాలనా నైపుణ్యం, సాహిత్య ప్రోత్సాహం, ధర్మపాలనతో మహోన్నత చక్రవర్తిగా కీర్తి గడించారు. తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు 1471లో జన్మించారు. 1509లో రాజ్యాధికారాన్ని చేపట్టి 1529 వరకు అంటే 20 ఏళ్ల దిగ్విజయంగా పరిపాలన సాగించారు. ఆయన పాలనని తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగంగా అభివర్ణిస్తారు చరిత్రకారులు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండే ఎనిమిది మంది కవులను అష్టదిగ్గజాలు అని పిలిచేవారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, రామరాజ భూషణుడు.. వీరే ఆ అష్ట దిగ్గజాలు. రిషబ్ శెట్టి.. ఆంధ్ర భోజుడుగా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల బయోపిక్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరాఠా యోధుడు శివాజీ పాత్రలో నటిస్తోన్న రిషబ్ శెట్టి.. ఆంధ్ర భోజుడుగా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల బయోపిక్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అశుతోష్ గోవారికర్ దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. రిషబ్ శెట్టి ప్రస్తుతం దర్శకత్వం వహిస్తూ నటిస్తోన్న కాంతార 2 ఈ ఏడాది అక్టోబర్ 2న విడుదల కానుంది. కాంతారకి ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి.

## ప్రియదర్శి థ్రిల్ ప్రాప్తిరస్తు..

ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న చిత్రం ప్రేమంటే. థ్రిల్ ప్రాప్తిరస్తు అనేది ఉపశీర్షిక. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నా ఈ చిత్రం లవ్, కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో రూపొందుతుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. హీరో నాగచైతన్య ఈ సినిమా ఫస్ట్‌లుక్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

## సమష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నదని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషిలోనే పౌష్టిక తెలంగాణ సాధ్యపడుతుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు అనుగుణంగా అంగన్‌వాడీ సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్రస్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'తెలంగాణ పోషకాహార ప్రణాళిక' రూపొందిస్తామని, అంగన్‌వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీలీటర్ల విజయపాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు.

పోషకాహార తెలంగాణ నిర్మాణం దిశగా భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. నిపుణుల అభిప్రాయాలను, అనుభవాల ఆధారంగా పోషణ తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తామన్నారు. తెలంగాణలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. సేవల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీల్లో ఎన్నో పోషకాలున్న కోడిగుడ్డు సరఫరాను నిలిపి వేయగా.. తెలంగాణలో చిన్నారులు గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న రాష్ట్రంలో పోషకార లోపంతో పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక బృందాల సహకారాన్ని తీసుకుం టామన్నారు. అంగన్‌వాడీల్లో ఆహారంతోపాటు అక్షరం, ఆరోగ్యం లభిస్తుందని పేరెంట్స్‌కు సూచించారు. ఇక నిర్మాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్‌వాడీలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇక అంగన్‌వాడీ కేంద్రా లను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిని తెలిపిన నేపథ్యంలో అవసరమైన ప్రోత్సా హక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూర గాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపి ణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో పాలకూర, తోటకూర, మెంతి కూర, టమాట, వంకాయ, బెండకాయ విత్తనాలు ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని పెంచి లబ్ధిదారులకు వండిపెట్టేలా చర్యలు తీసుకుం టామ న్నారు. ఈ సమావేశంలో పోషకారంపై పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్‌టిఆర్ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళాసభ ఛైర్మన్, బాలరక్ష భారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

## ఫీజులు, స్కాలర్‌షిప్‌ల బకాయిలు తక్షణమే చెల్లించాలి

### ఫీజుల కోసం బ్యాంకు ట్రస్టు ప్రతిపాదన వద్దు

### ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీతో బిసి నాయకుల చర్చలు

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** ఫీజులు,స్కాలర్‌షిప్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలని,ఫీజుల కోసం బ్యాంకు ట్రస్టు ప్రతిపాదన విరమించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో సోమవారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావును సచివాలయంలో కలిసి కోరారు. పేద విద్యార్థులకు విద్యా అవకాశాలను కల్పించేందుకు 100 బీసీ కాలేజ్ హాస్టళ్లు,120 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలి, కొనసాగుతున్న గురుకులాల్లో 30 సీట్ల చొప్పున పెంచాలని,6000 కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా చీఫ్ సెట్రకరీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, జిల్లపెల్లి అంజి, బి.కృష్ణయాదవ్, మోడీ రాందేవ్, రాఘవేందర్, అశోక్ పాల్గొన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో బీసీ, ఎస్సీ,ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత చదువులు మానేసి పరిస్థితి ఏర్పడిందని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు, ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా ఇంకొక వైపు ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. వసతి సౌకర్యం ఉన్నచోట అదనపు సెక్షన్లు ప్రారంభించాలని, ప్రతి క్లాసులో 20 సీట్ల చొప్పున అదనంగా పెంచాలని కోరారు. కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని కృష్ణయ్య చీఫ్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన జాతర

### బంద్ అయిన బలిని భవిష్యవాణిలో అడిగిన అమ్మ

### అధికారులతో చర్చించి నిర్ణయిస్తాం: మంత్రి పొన్నం

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 14, ప్రభాతవార్త:** సికిందరాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆషాఢ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరి గిందని, ప్రజలు, అధికారులు సహకరించారని, జాతర ప్రశాంతంగా ముగిసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రంగం కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.అమ్మ వారి ఆషాడ బోనాల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ,విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని సాక,బోనాలు సమర్పించారని,గడచిన ఏడాది కంటే ఈ ఏడాది అధికసంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారని ఆయన తెలియ జేసారు. భవిష్యవాణిలో ఈ యేడాది రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని చెప్పారన్నారు. రంగం భవిష్యవాణిలో దేవాలయానికి సంబంధించి కొన్ని సూచనలు చేసారని,శాస్త్రీయంగా అన్ని రకాల పూజలు జరిగాయన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వ ర్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎలాంటి లోపం రానివ్వమని అన్నారు. 1815లో ఏర్పడిన ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో ఆషాఢ బోనాల జాతర సందర్భంగా బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసామన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలన్నారు. 60, 70 సంవత్సరాల క్రితం బంద్ అయిన బలిని ప్రస్తావించారు. దేవాదాయ శాఖ అధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం. అకాల మరణాలు, అగ్నిప్రమాదాల నివారణకు అమ్మవారి ఆశీర్వాదం అడిగామని, జాతరకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు మంత్రి పొన్నం కృతజ్ఞతలు తెలియజేసారు.

# మరో మహమ్మారి రాబోతోంది..

### అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి.. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి

### బాలలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు

### నా రూపాన్ని ప్రతిష్ఠించండి లేదంటే రక్తం కక్కుతారు: రంగం(భవిష్యవాణి)లో స్వర్ణలత



భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 14, ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో మరో మహ మ్మారి విజృంభించనుంది. అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. బాలలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. నా రూపాన్ని ప్రతిష్ఠించండి. లేదంటే రక్తం కక్కుతారు అంటూ అమ్మవారు రంగం (భవిష్యవాణి) కార్యక్రమంలో స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సికింద రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ బోనాల ఉత్సవాల్లో రెండో రోజు ప్రధాన ఘట్టమైన రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఎదురుగా పచ్చికుండపై నిల్చుని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదేనన్నారు. రాబోయే రోజుల్లో మరో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమా దాలు కూడా సంభవిస్తాయని తెలి పారు. భక్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడిపంటలు బాగా పండుతాయని చెప్పారు. బాలబాలికలను మీరు (తల్లిదండ్రులు) విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాపాడు కుంటున్నానని, ఈసారి చాలా సంతో షంగా పూజలు చేసారు. మీ అందరినీ సంతోషంగా చూస్తాను. మీ అరికాలిలో ముల్లు నా నాలుకతో తీస్తాను. కాలం మీరితే ఎవరు ఏది అనుభవిం చాలో అది అనుభవిస్తారు. నేను మాత్రం అడ్డురాను అంటూ స్వర్ణలత భవిష్యవాణి వినిపిం చారు. నా ప్రజలందరూ సంతోషంగా, ఆనందంగా సాకలతో ఘనంగా నన్ను వేడుకున్నారు. సంతోషంగా జాతర చేసారు. ప్రతియేటా ఏదో ఒక ఆటంకం చేస్తూనే ఉన్నారు. నన్ను లెక్క చేయ డం లేదు. ప్రతియేటా చెప్తున్నా.. నా కోరిక నెరవేర్చడం లేదు. నా బిడ్డలం దరినీ నా కడుపులో పెట్టి కాపాడుకుంటాను. బండి అంత కాకపోయినా గోరం తైనా ఇయ్యరా బాలకా. నా పూజలన్నీ సక్రమంగా జరపాలి. నాకు రక్తం చూపించమని అడుగుతున్నా, నాలుగు కాళ్లది కాకున్నా చిన్నదైనా చూపించరా బాలకా. నేను కోపం చూపడం లేదు. సక్రమంగా పూజలు జరిపించండి. కన్నెర్ర జేస్తే రక్తం కక్కుకు ఛస్తారు. నాది మాత్రం తప్పకుండా ఉంటుంది. ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు. కొద్దిగైనా నాకు రక్తం చూపించండి. వాగ్దానం తీసుకుంటున్నారు. నా రూపానికి కూడా అడ్డు పడుతున్నారని, ఈ యేడు జరిపించకపోతే వారు రక్తం కక్కుకుని ఛస్తారు. నన్నుకొలిచే వారిని చల్లంగా చూసుకుంటా. తోడు నీడై నిలబడతా. రాష్ట్రాన్ని, దేశాన్ని మహమ్మారి వెంటాడుతుంది. జాగ్రత్తగా ఉండండి. ముందే హెచ్చ రిస్తున్నా. ఈ యేడాది నాకు ఐదు వారాల పాటు పప్పుబెల్లాలతో సాక, సమర్పించండి. పసుపు, కుంకుమలతో ఆనందపర్చండి. కోరిందల్లా కొంగు బంగారం చేస్తా. నా రూపాన్ని నిలబెట్టి నాకు రక్తం చూపించకపోతే అల్ల కల్లోలం చేస్తా. ఎవరు ఆపినా ఆగను. ప్రాణానికి హానీ చేయను. రక్తం చిందిస్తాను అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

## దోస్త్ దరఖాస్తు గడువును పొడిగించాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి బిసి సంక్షేమ సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)–2025 దరఖాస్తు గడువును పొడిగించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్‌తో కలిసి .. జాజుల లింగంగౌడ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ దరఖాస్తు గడువు పొడిగించాలని దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఎప్ సెట్ కౌన్సిలింగ్‌ను దృష్టి లో పెట్టుకొని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ దరఖాస్తు గడువు ను పొడిగించాలని కోరారు. పరిశీలిస్తామని కన్వీనర్ చెప్పారని ఆయన తెలిపారు.

## సిటీ టాస్క్‌ఫోర్స్‌లో మరోఅదనపు డిసిపి నియామకం



ఇక్బాల్ సిద్దీఖీ

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్‌లో మరో అదనపు డిసిపిని నియమించారు. ఈ విభాగంలో ఇప్పటి వరకు ఒక డిసిపితో పాటు మరో అదనపు డిసిపి మాత్రమే వుండగా కొత్తగా నియామకమైన అదనపు డిసిపితో అధికారుల సంఖ్య మూడుకు చేరింది. టాస్క్‌ఫో ర్స్‌కు పూర్తిస్థాయి యూనిట్ అధికారిగా నాన్ కేడర్ ఎస్‌పిగా వున్న వైవిఎస్ సుధీంద్ర (ఈయన గ్రూప్ వన్ అధికారి) వున్నారు. ఆయన ప్రస్తుతం ఉ త్తర, పశ్చిమ, దక్షిణ పశ్చిమ, మధ్య మండలాలను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. సుధీంద్రకు సహాయకుడుగా పాతబస్తీలోని పురానిహవేలిలో గల సిటీ కమిషనర్ కార్యాలయం కేంద్రంగా పనిచేసే టాస్క్‌ఫోర్స్ విభాగం అదనపు డిసిపిగా అందె శ్రీనివాస్ వున్నారు. ఈయన 1991 బ్యాచ్ ఎస్ఐగా సి టీ పోలీసు విభాగంలో చిరపరిచితమైన అధికారి. పోలీసు శాఖలో విశేష అనుభవం వున్న అధికారి. ఈయన పరిధిలో తూర్పు, దక్షిణ, దక్షిణ, తూ ర్పు మండలాలు వున్నాయి. ఇక కొత్తగా నియామకమైన అదనపు డిసిపి సిటీ పోలీసు విభాగంలో చిరపరిచితమైన మరో అధికారి ఇక్బాల్ సిద్దీఖీ. 1989 బ్యాచ్ ఎస్ఐగా పోలీసు శాఖలో సుధీర్ఘ అనుభవం ఆయన సొంతం. ఇంతకు ముందు సిటీ పోలీసు విభాగంలో పలుచోట్ల పనిచేసి మంచి పేరు గడించారు. ప్రస్తుతం సిసిఎస్ అదనపు డిసిపిగా వున్నారు. ఇక్బాల్ సిద్దీఖీకి పశ్చిమ, దక్షిణ, పశ్చిమ మండలాలను కేటాయించారు. ఈయన ఎక్కడ నుంచి విధులు నిర్వహిస్తారనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం లేదా ఎసి గార్డ్స్‌లోని పశ్చిమ మండల డిసిపి కార్యాలయంలో కొత్త కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి విధులు నిర్వహించే వీలుందని తెలిసింది. రెండు మూడు రోజుల్లో టాస్క్ ఫోర్స్ కొత్త అదనపు డిసిపి ఇక్బాల్ సిద్దీఖీ బాధ్యతలు చేబట్టనున్నారు.

## వరంగల్‌లో మహిళా డాక్టర్ ఆత్మహత్య

### అనాథలైన చిన్నారులు



డాక్టర్ ప్రత్యూష

**హన్మకొండ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లాకు చెందిన యువ డాక్టర్ ప్రత్యూష సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాలో కలంకం రేపింది. తన భర్త సైతం డాక్టర్ కావడం అత నికి మరో స్త్రీతో అక్రమ సంబంధం ఉందని అనుమానంతో ఆత్మహత్యకు పాల్పడిందని అనుకుంటున్నారు. ప్రత్యూష తండ్రి మాత్రం తన బిడ్డను అల్లు డు వేధించి కొట్టేవాడని, మరో స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అని పోలీస్ ఫిర్యాదు పేర్కొన్నాడు. మొత్తానికి ఏదేమైనా యువడాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య ఇద్దరు చిన్నారులను అనాథలుగా చేసింది. డాక్టర్ ఆత్మ హత్య స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై అత్యాచారయత్నం

### నిందితునిపై పోక్సో కేసు నమోదు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), జూలై 14, ప్రభాతవార్త:** యుకెజి చదువుతున్న బాలికపై స్కూల్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో యుకెజి చదువుతున్న నాలుగేళ్ల చిన్నారిని రోజుమాదిరిగా స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈ నెల 4న ఇంటి నుండి స్కూల్ కు తీసుకొచ్చాడు. అనంతరం స్కూల్‌లో మధ్యాహ్నం సమయంలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అత్యాచార యత్నం చేశాడు. దీంతో బాలిక భయాం దోళనకు గురై ఆరోజు ఇంటికివెళ్లి తిరిగి స్కూలుకు వెళ్లలేదు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో సోమవారం ఉదయం చిన్నారి తల్లిదండ్రులు స్కూలుకు చేరుకొని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. స్కూల్ డ్రైవర్ స్కూల్‌కి రాక పోవడంతో ఫోన్‌చేసి ప్రిన్సిపాల్ పిలిపించాడు. ఫోన్‌చేసిన గంట తర్వాత డ్రైవర్ ద్విచక్రవాహనంపై స్కూల్‌కి రావడంతో అప్పటికే కోపోద్రిక్తంగా ఉన్న తల్లిదండ్రులు, ఇతర పిల్లల తల్లిదండ్రులు డ్రైవర్ కనిపించడంతో ఒక్కసారిగా దాడికి దిగారు. దీంతో స్కూల్ యాజమాన్యం అప్పటికే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను దాడి నుండి తప్పించి పోలీసువ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఇదే విషయంపై తల్లిదండ్రులతోపాటు మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యంపై సంఘటన జరిగి ఇన్నిరోజులు కావస్తున్నా ఎందుకు స్పందిం చలేదని ప్రశ్నించడంతో తమకేమీ తెలియదంటూ తప్పుకునే ప్రయత్నం చేశారు. కాగా పోలీసులు స్కూల్లో ఉన్న సిసిటివి పుటేజి హార్డ్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకొని బాధిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం నమోదు చేసినట్లు సిఐ విజయవర్ధన్ తెలిపారు.

## 81 మంది జెఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

### ఇంటర్ విద్య కమిషనరేట్‌లో కౌన్సెలింగ్

### కొత్త బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలి: ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణఆదిత్య

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్ మోస్ట్ జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు పొందారు. 81 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యా సంచాలకులు కృష్ణ ఆదిత్య 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి జయప్రదా బాయి, మెడ్చల్, రంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు(డిఐఈవో) హాజరయ్యారు. పదోన్నతి పొందిన లెక్చరర్లను డైరెక్టర్ అభినందిస్తూ.. తమ కొత్త బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యారంగాన్ని మెరుగుపరిచే దిశగా నాయకత్వ భాధ్యతల్ని సమర్థంగా నెరవేర్చాలని ఆకాంక్షి ంచారు. పదోన్నతుల ప్రక్రియలో ప్రతిభకు, సేవలకు ప్రాధాన్యం ఇస్తూ, పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామని డైరెక్టరేట్ మరోసారి హామీ ఇస్తుందని తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్లుగా పదోన్నతి ఇవ్వడం కోసం సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించారు. పదోన్నతుల అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ కొనసాగుతున్నట్టు అయింది. పదోన్నతులు పొందిన వారిలో తెలంగాణ ఇంటర్ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(టిగ్లా) రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య కూడా ఉన్నారు. పదోన్నతి పొందిన అనంతరం ఆయన మహబూబ్‌నగర్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకోవడం జరిగింది. జూనియర్ లెక్చరర్స్‌కి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకి టిగ్లా నేతలు మాచర్ల రామకృష్ణగౌడ్, నయీమ్ పాష, డాక్టర్ పరశురాములు, దుర్గాప్రసాద్, ముడి శేఖర్ దన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుఎస్‌పిసి దశలవారీగా పోరాటం

### 23 నుంచే ఉద్యమం ప్రారంభం

### ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

### 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా

### యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలపై ఉద్యమబాట పట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) నిర్ణయించింది. ఈ నెల 23 నుంచి ఉద్యమ కార్యాచరణను ప్రారంభించాలని ఆగస్టు 23న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ సమావేశం ఎం సోమయ్య అధ్యక్షతన జరిగింది. యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ. వెంకట్, చకినాల అనిల్‌కుమార్, నన్నెబోయిన తిరుపతి, టి లింగారెడ్డి, యస్ హరికిషన్, బి కొండయ్య, యం సైదులు, డి రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడిచినప్పటికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందని విమర్శించారు. మేనిఫెస్టోలో పొందుపరచిన ఎన్నికల హామీలను అమలు పరచడం లేదని.. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి, నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలన్నారు.

ఉపాధ్యాయుల పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 పిఎస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, డిఎడ్, బిఎడ్ అర్హతలున్నప్రతి ఎస్‌జిటికి పిఎస్‌హెచ్‌యం ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పండిట్, పిఈటిల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఒ 2, 3, 9, 10లను రద్దు చేసి జిఒ 11, 12 ల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల్లో జరిగిన ఫైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అనేక మార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికి మంత్రులు, ఆఫీసర్ల కమిటీలు వేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ తీర్మానిచిందని నాయకులు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండాలు ఇవ్వాలని, ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

# 11 స్టేషన్లలో పునరాభివృద్ధి పనుల పురోగతి భేష్

### రైల్వే కార్యకలాపాల భద్రతపై జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సమీక్ష

**హైదరాబాద్ (తార్నాక), జూలై 14, ప్రభాతవార్త :** రైలు కార్యకలాపాల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, భద్రతపై సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. అదేవిధంగా మధ్య రైల్వేలో చేపట్టిన స్టేషన్ పునరాభివృద్ధి పనుల పురోగతిపై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అద నపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ అన్ని ప్రధాన విభాగాధి పతులతో పాటు పాల్గొన్నారు. సికిందరాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు మరియు నాందేడ్ వంటి ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జోన్‌లోని 119 స్టేషన్లలో సుమారు రూ. 6744 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనుల స్థితిగతులపై సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష నిర్వహించారు (వీటిలో, బేగంపేట, వరంగల్ కరీం నగర్ అనే 3 స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి ఇటీవల ప్రధానమంత్రిచే ప్రారంభించ బడ్డాయి). ప్రధాన కార్యాలయం ఆరు డివిజన్ల సంబంధిత అధికారులు పునరాభివృద్ధి కోసం గుర్తించిన స్టేష న్లపై వాటి డివిజన్, ప్రాజెక్ట్ ఖర్చు, పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న తేదీ, పని యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరణాత్మక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జోన్ వ్యాప్తంగా 11 స్టేషన్లలో ప్రధానంగా చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతి స్థితిపై జీఎం ప్రశంసించారు. ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి పనుల వేగంతో కొనసాగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించాలని మరియు పనుల నాణ్యతను తప్పకుండా నిర్ధారించాలని కూడా ఆయన అధికారులకు సూచించారు. ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పని ప్రదేశాలలో సరైన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

సమావేశంలో, జోన్ అంతటా లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద అనుసరిస్తున్న భద్రతా జాగ్రత్తలను సంజయ్ కుమార్ సమీక్షించారు. గుర్తించబడిన ప్రమాదలకు అవకాశం గల లెవెల్ క్రాసింగ్ గేట్లపై ఆయన ప్రత్యేక దృష్టి సారించాలని క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, సిబ్బందికి కౌన్సిల్ ఇవ్వాలని, అన్ని భద్రతా విధానాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్‌ల భద్రత, పరికరాల లభ్యత మొదలైన వాటికి సంబంధించి జోన్ చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌ల స్థితిని కూడా జనరల్ మేనేజర్ సమీక్షించారు. అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాక్ భద్రత, విద్యుత్ మరియు సిగ్నలింగ్, మెకానికల్ వస్తువులు,వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలపై జీఎం సుచనలు చేశారు.

**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : శ్రీవాత్సవ**

**అడ్డగుట్ట :** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజీమ్ కుమార్ శ్రీ వాత్సవ రైల్వే ఇంజనీర్లకు,కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్,సర్క్యూలేటింగ్ ఏరియాల్లో చేపడుతున్న అభివృద్ధి చర్యలపై అధికారులు, ఇంజనీర్లతో చరి ్చంచారు. రైల్వే స్టేషన్ పున నిర్మాణ ప్రణాళికలు,పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిఎంకు వివరించారు. అదే విధంగా ఫ్లాట్ ఫారమ్ 1 నుంచి, ఫ్లాట్ నెం 10 వరకు ఇరువైపుల జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు.




సమీక్ష సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

# ఒకే టెస్ట్‌లో 400 పైగా రన్స్


గ్రహం గూచ్


శుభ్‌మన్ గిల్


మార్క్ టేలర్


కుమార్ సంగక్కర

## వరల్డ్ టాప్ 1, 2లో గూచ్, గిల్

**న్యూఢిల్లీ:** అత్యంత ప్రతిష్టాత్మకమైన టెస్ట్ క్రికెట్ ఫార్మాట్లలో బ్యాట్స్‌మెన్‌లు సత్తా చూపిస్తుంటారు. ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం, అత్యంత కఠినమైన పరిస్థితులలో బ్యాట్స్‌మెన్‌ల నైపుణ్యంతో ఒకే టెస్ట్‌లో 400 పరుగుల మార్కును అధిగమించిన రికార్డు సాధించారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ గ్రాహం గూచ్ ఒకే టెస్ట్‌లో 400 కంటే ఎక్కువ రన్స్ చేసి చరిత్ర సృష్టించిన టాప్ 4 బ్యాట్స్‌మెన్‌ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. 1973-1997 వరకు గూచ్ 118 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 42.6 సగటు, 49.2 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో రికార్డు స్థాయిలో 8,900 పరుగులు చేశాడు. లండన్‌లో 1990 జూలైలో ఇండియా సిరీస్ ఫస్ట్ టెస్ట్ మ్యాచ్‌లో గూచ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 43 బౌండరీలు, 3 హై ఫ్లయింగ్ సిక్సర్లతో సహా 333 రన్స్ చేశాడు. కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే దాడిని ఎదుర్కొని అద్భుతంగా రాణించి 2వ ఇన్నింగ్స్‌లో 113 బంతుల్లో 123 పరుగులు చేశాడు. మొత్తం 456 పరుగుల్లో గూచ్ 247 రన్స్ భారీ తేడాతో భారత్ ఓటమికి కారణమయ్యాడు. ఇక ఈ జాబితాలో 2వ ప్లేస్‌లో భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 34 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 42.7 సగటు, 62.7 స్ట్రైక్ రేట్‌తో 2,578 పరుగులు సాధించాడు. గిల్ ప్రస్తుత ఇంగ్లాండ్‌లో 2వ టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. తొలిఇన్నింగ్స్‌లో 269రన్స్, 2వ ఇన్నింగ్స్‌లో 161 పరుగులతో ఒకే టెస్ట్‌లో అత్యధిక రన్స్ చేసి వరల్డ్‌లో 2వఆటగాడిగా నిలిచాడు. అదనంగా ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లాండ్‌పై 430 రన్స్ చేసిన తర్వాత, ఒకే టెస్ట్‌లో 400పరుగుల బెంచ్‌మార్క్‌ను దాటిన తొలి భారత్‌కెప్టెన్‌గా కూడా రికార్డు సాధించాడు. అలాగే 1996 వరల్డ్ కప్ రన్నరప్ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మార్క్ టేలర్ 3వ స్థానంలో ఉన్నాడు. 1989-1999 వరకు తన కెరీర్‌లో మార్క్ 104 టెస్ట్‌లలో 43.5 సగటు, 41.5 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 7,525 పరుగులు సాధించాడు. పాకిస్తాన్‌పై మార్క్ 426 పరుగులు చేశాడు. కాగా శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార్ సంగక్కర ఉన్నాడు. 2000-2015 వరకు అన్ని ఫార్మాట్లలో లంకకు ప్రాతినిధ్యం వహించాడు. ఆల్ టైమ్‌లో అత్యంత ఫలవంతమైన వికెట్ కీపింగ్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా సంగక్కర మొత్తం 134 టెస్ట్ మ్యాచ్‌లుఆడి 57.4 సగటు 54.2 స్ట్రైక్ రేట్‌తో రికార్డు స్థాయిలో 12,400 రన్స్ సాధించాడు. బంగ్లాదేశ్‌పై, సంగక్కర 2వ ఇన్నింగ్స్‌లో 144 బంతుల్లో 105 రన్స్‌చేసి, అదే మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ మరియు సెంచరీ చేసిన రెండవ ఆటగాడిగా నిలిచాడు.



## మహిళల ఆసియా కప్‌లో.. భారత్ శుభారంభం

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ డివిజన్2 తొలి మ్యాచ్‌లో కజకిస్తాన్‌ను ఓడించి, భారత మహిళల బాస్కెట్‌బాల్ జట్టు నాలుగు సంవత్సరాల తర్వాత కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లోకి తిరిగి వచ్చింది. 2023 ఆసియా క్రీడల తర్వాత తొలిసారిగా దక్షిణాసియా వెలుపల పోటీ పడుతున్న ఆ జట్టు నెమ్మదిగా అటను ప్రారంభించినా ఆ తర్వాత వేగం పెంచింది. దీంతో కజకిస్తాన్‌పై 85-68 తేడాతో విజయాన్ని సాధించి అద్భుతమైన పునరాగమనం చేసింది. పుష్ప సెంథిల్ కుమార్ 23 పాయింట్లతో స్కోరింగ్ చార్టులలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 76.92 శాతం మార్పిడి రేటుతో పది 2పాయింటర్లను తగ్గించింది. ఆమెకు తన సహచరులు శ్రీకళా రాణి, సత్య కృష్ణమూర్తి నుండి మద్దతు లభించింది. వారు చెరో 15 పాయింట్లు సాధించారు. ఇదే సమయంలో కజకిస్తాన్ ఆట అద్భుతంగా ప్రారంభించి మొదటి క్వార్టర్ (20-14) తర్వాత 6 పాయింట్ల ఆధిక్యంలో ఉంది. భారత ఆటగాళ్ల నుండి కొన్ని సాధారణ ఫౌల్‌లు జరిగిన ఫలితంగా కజకిస్థాన్‌కు బహుళ ఫ్రీత్రోలు వచ్చాయి. అయితే, భారత జట్టు స్వల్ప సమయంలో బలంగా పుంజుకుని తరువాతి రెండు క్వార్టర్లలో ఆధిపత్యం చెలాయించింది. వరుసగా 12 మరియు 16 పాయింట్ల తేడాతో రెండింటినీ గెలుచుకుంది, చివరి క్వార్టర్‌కు వెళ్లే ముందు 22 పాయింట్ల భారీ ఆధిక్యాన్ని పొందింది. చివరి క్వార్టర్‌లో 21-16 తేడాతో గెలిచిన కజకిస్తాన్ చివరి దశలో పుంజుకున్నప్పటికీ, ఈ ఆధిక్యం భారత్ విజయం సాధించడానికి సరిపోయింది.

## వింబుల్డన్ మహిళల డబుల్స్‌లో.. కుడెర్మెటోవా, మెర్టెన్స్ జోడీకి టైటిల్



**న్యూఢిల్లీ:** వింబుల్డన్ ఛాంపియన్‌షిప్-2025ను వరల్డ్ నెంబర్ 8 సీడ్లు వెరోనికా కుడెర్మెటోవా-ఎలిస్ మెర్టెన్స్ జోడీ గెలుచుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఉత్కంఠ భరితమైన ఫైనల్‌లో మహిళల డబుల్స్ టైటిల్‌ను ఈ జోడీ కైవసం చేసుకుంది. 2 గంటల 23 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో వారు నెంబర్ 4 సీడ్లు హ్సీ సు-వీ-జెలెనా ఒస్టాపెంకోలను 3-6, 6-2, 6-4 తేడాతో ఓడించి నాటకీయ పునరాగమనం చేశారు. తొలి సెట్‌ను కోల్పోయిన తర్వాత, కుడెర్మెటోవా-మెర్టెన్స్ దృఢత్వాన్ని ప్రదర్శించారు. రెండవ సెట్‌లో హ్సీహ్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి మ్యాచ్‌ను సమం చేశారు. కుడెర్మెటోవా నెట్ ప్లే, మెర్టెన్స్ స్థిరమైన బేస్‌లైన్ స్థిరత్వం వారికి అనుకూలంగా ఊపును మార్చడం ప్రారంభించాయి. అయితే, మూడవ సెట్‌లో సీహ్ మరియు ఒస్టాపెంకో 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో మరోమలుపు తిరిగింది. కుడెర్మెటోవా ఛాంపియన్‌షిప్ పాయింట్‌పై వాలీ విజేతతో విజయాన్ని నమోదు చేసింది, చివరికి ఆమె మొదటి గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. 2021 వింబుల్డన్ ఫైనల్‌లో ఓడిపోయిన కుడెర్మెటోవాకు ఈ విజయం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. అదే సమయంలో ఆమె భాగస్వామి మెర్టెన్స్ తన 5వ మేజర్ డబుల్స్ టైటిల్, వింబుల్డన్‌లో తన 2వ టైటిల్‌ను గెలుచుకుంది.

## షూటింగ్ ప్రపంచ కప్‌లో.. ముగిసిన భారత్ పోరు

### నీరు, సంధు జోడీలు విఫలం





**న్యూఢిల్లీ:** షూటింగ్ ప్రపంచ కప్ 2025లో భారత్ పోరు ముగిసింది. లక్షయ్ షెయో రాన్ (22,19,25)-నీరు దండా (25,24, 25) జంట మూడవ సిరీస్‌ను షూట్ చేసి నప్పటికీ, ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ పతక రౌండ్లలో విఫలమైన తర్వాత అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్ షాట్‌గన్‌లో భారత్ ప్రచారం ముగించింది. వారు అర్హత రౌండ్‌లో సాధ్యమయ్యే 150లో 140 పాయింట్లు సాధించి 54 జతలలో 10వ స్థానంలో నిలిచారు. ఇక భారత రెండోజత జోరావర్ సింగ్ సంధు (21,23,24)-ప్రీతి రాజక్ (23,24, 23) కలిసి 138 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచారు. ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్ మరియు రెండు స్పానిష్ జట్లు అర్హత పోటీలలో 143 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాయి. గత నికోసియా షాట్‌గన్ ప్రపంచ కప్‌లో ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జంట కైనన్ చెనై మరియు సబీరా హారిస్ కాంస్య పతకం గెలుచుకున్నారు. జాతీయ క్రీడల ఛాంపియన్ నీరు దండా తొలిసారిగా ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని, చివరి రోజు మహిళల ట్రాప్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం న్యూఢిల్లీ ప్రపంచ కప్ ఫైనల్ విజేత అలెస్సియా ఇజ్జీ (ఇటలీ)పై షూట్‌ఆఫ్ (21) గెలవడం ద్వారా ఆరో మరియు చివరి అర్హత స్థానాన్ని పొందిన నీరు చివరికి అధిక బిబ్ సంఖ్య కారణంగా నిష్క్రమించింది. కాగా స్ట్రేలియాకు చెందిన లైటిషా స్కాన్లాన్ 45 హిట్‌లతో స్వర్ణం గెలుచుకుంది. ఒక రోజు ముందు మహిళల ట్రాప్‌లో నీరూ తన అద్భుతమైన నాల్గవ స్థానం నుండి తన 75 లక్ష్యాలలో ఒక లక్ష్యాన్ని మాత్రమే కోల్పోగా, లక్ష్యయ్ రెండవ సిరీస్‌లో ఒక చిన్న తప్పు చేసింది, అక్కడ అతను ఆరు లక్ష్యాలను మిస్ చేశాడు, చివరికి పోడియం ముగింపులో ఒక షాట్ కోల్పోయింది.

## ఛాంపియన్‌గా ముంబై ఇండియన్స్




### 5 రన్స్ తేడాతో ఓడిన వాషింగ్టన్

**న్యూఢిల్లీ:** మేజర్ లీగ్ క్రికెట్-2025 ఎడిషన్ విజేతగా ముంబై ఇండియన్స్ న్యూయార్క్ అవతరించింది. ఓవరాల్‌గా పొట్టి క్రికెట్‌లో ముంబై ఇండియన్స్‌కు ఇది 13వ టైటిల్. ఈ సీజన్‌లో నికోలస్ పూరన్ నేతృత్వంలో ముంబై బరిలోకి దిగింది. పూరన్ ముంబై ఫ్రాంచైజీ తరపున మూడో టైటిల్ సాధించాడు. అయితే ముంబైకు అత్యధికంగా 6 టైటిళ్లు అందించిన ఘనత భారత్ కెప్టెన్ రోహిత్ శర్మకు దక్కింది. మ్యాచ్ విషయానికి వస్తే దల్లాస్ వేదికగా హోరా హోరీగా జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ వాషింగ్టన్ ఫ్రీడంను 5 పరుగుల తేడాతో చిత్తు చేసింది.

ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 180 పరుగులు చేసింది. డికాక్ 77 పరుగులతో మెరుపు అర్ధ సెంచరీ చేసి సత్తా చాటి ముంబైకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ముంబై ఇన్నింగ్స్‌లో మొనాంక్ పటేల్ 28, తజిందర్ డిల్లాన్ 14, పూరన్ 21, పోలార్డ్ 0, బ్రేస్‌వెల్ 4, కన్వర్‌జీత్ సింగ్ 22 (నాటౌట్), ట్రిస్టన్ లస్ 2 (నాటౌట్) పరుగులు చేశారు. వాషింగ్టన్ బౌలర్లలో లోకి ఫెర్గూసన్ 3, నేత్రావల్కర్, మ్యాక్స్‌వెల్, జాక్ ఎడ్వర్డ్స్, హోలాండ్ తలా వికెట్ తీశారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన వాషింగ్టన్ చివరి వరకూ గెలుపు కోసం పోరాడింది. రచిన్ రవీంద్ర (70). గ్లెన్ ఫిలిప్స్ (48 నాటౌట్), జాక్ ఎడ్వర్డ్స్ (33) వాషింగ్టన్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశారు. చివరి ఓవర్‌లో వాషింగ్టన్ గెలుపునకు 12 పరుగులు అవసరం కాగా, 22 ఏళ్ల కుర్ర పేసర్ రుషి ఉగార్కర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మ్యాక్స్‌వెల్, గ్లిన్ ఫిలిప్స్ లాంటి విధ్వంసకర బ్యాటర్లను సైలెంట్ చేసి ముంబైకి అద్భుత విజయాన్ని అందించాడు. చివరి ఓవర్లో ఉగార్కర్ మ్యాక్స్‌వెల్‌ను (15) ఔట్ చేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఫలితంగా ముంబై రెండోసారి ఛాంపియన్‌షిప్‌ను చేజిక్కించుకుంది.

## దిగివచ్చిన రిటైల్ ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ, జూలై 14:** మే నెలలో 2.82శాతంగా ఉన్న భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 2.1శాతానికి తగ్గింది. అదేవిధంగా సిపిఐ బాస్కెట్‌లో ప్రధాన భాగమైన ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. ప్రధానంగా కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాల ధరలు తగ్గడం విశేషం. ప్రపంచ ముడి చమురు ధరలు సాపేక్షంగా స్థిరంగా ఉన్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధర, తయారీ,లాజిస్టిక్స్ కోసం ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణం నియంత్రణకు దోహదపడ్డాయి. జూన్ 2024లో ద్రవ్యోల్బణం రేటు సాపేక్షంగా ఎక్కువగా ఉంది. ఇది జూన్ 2025 డేటాకు అనుకూలమైన బేస్‌ను సృష్టిస్తుంది. ఇది సంవత్సరానికి ద్రవ్యోల్బణ సంఖ్య తగ్గడానికి దారితీసింది. ద్రవ్యోల్బణం దాని లక్ష్యం కంటే చాలా తక్కువగా ఉండడంతో, ఆర్థిక వృద్ధిని ప్రేరేపించడానికి ఆర్‌బిఐ మరింత వడ్డీ రేటు కోతలను పరిగణనలోకి తీసుకునేందుకు మరింత వెసులుబాటును కలిగి ఉంది. వ్యాపారాలు, పెట్టుబడులకు సానుకూలంగా తక్కువ ద్రవ్యోల్బణం వ్యాపారాలు లాభాల మార్జిన్‌లను నిర్వహించడానికి,




పెంచడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలదు. ఇది దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలదని అప్‌స్టాక్స్ తెలిపింది. ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు కూడా దోహదం చేస్తాయి. ఇది ఆర్‌బిఐకి సవాలుగా నిలుస్తుంది. భారతదేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల పరిణామం, ఇది మరింత స్థిరమైన ఆర్థిక వాతావరణాన్ని సూచిస్తుంది. అయితే ఆర్‌బిఐ అప్రమత్తంగా ఉండి, సంభావ్య ప్రమాదాలను పరిష్కరించడానికి, స్థిరమైన ధర స్థిరత్వం, ఆర్థిక వృద్ధిని నిర్ధారించడానికి దాని విధానాలను స్వీకరించాల్సిన అవసరం ఉంది.

## ఎస్క్రో ఖాతాలో రూ.4,800 కోట్లు: జేన్ స్ట్రీట్ డిపాజిట్

**వాషింగ్టన్, జూలై 14:** అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్‌స్ట్రీట్ సెబి ఆదేశాల మేరకు రూ.4,843 కోట్ల సొమ్మును ఎస్క్రో ఖాతాలో జమ చేసినట్లు కొన్ని కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సంస్థ ఇక్కడి మార్కెట్లలో ఇప్పుడే ట్రేడింగ్ చేసే అవకాశం లేదని తెలుస్తోంది. కాకపోతే, సెబి ఆదేశాలను మాత్రం న్యాయ స్థానంలో సవాలు చేసే అవకాశాలున్నా యి. ఇప్పటికే జూలై 3వ తేదీన ఆ సంస్థ మార్కెట్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సెక్యూరిటీల కొను గోళ్లు, అమ్మకాలకు పాల్పడ కుండా నిషేధం విధించింది. దీంతో పాటు జేన్ స్ట్రీట్ ఆస్తులకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరగ కుండా బ్యాంకులు, కస్టోడియన్స్, డిపాజిటర్లు, రిజి స్ట్రార్‌లు, ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లకు ఆదేశాలు జారీచేసింది. నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం నగదు డిపాజిట్ చేయడంతో భారత మార్కెట్లలో తిరిగి ట్రేడింగ్‌ను మొదలు పెట్టేందుకు మార్గం సుగమమం అయింది.




అయితే సెబి అభ్యంతరం తెలిపిన వ్యూహాన్ని మాత్రం ఆ సంస్థ అమలు చేయకూడదని పేర్కొంది. దీంతో పాటు ఈ సంస్థ భవిష్యత్తు కార్యకలాపాలను జాగ్రత్తగా గమనించాలని స్టాక్ ఎక్స్ఛేంజీలను సెబి ఆదేశించింది. ప్రొప్రైటరీ ట్రేడింగ్ సేవల సంస్థ అయిన జేన్ స్ట్రీట్ గ్రూపు రెండు వేల సంవత్సరంలో ఏర్పాటైంది. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లో ఈ సంస్థ కార్యాలయాల్లో 2,600 మంది సిబ్బంది పని చేస్తున్నారు. జేన్ స్ట్రీట్ భారత మార్కెట్లలో దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబి నిర్ధారించింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే, నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. మన దేశంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ తరగతి కిందకు వచ్చే ఈ సంస్థ, నగదు, ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగాల్లో ట్రేడింగ్ చేసే క్రమంలో ఎఫ్‌పిఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు సెబి గుర్తించింది. దాదాపు 21 సందర్భాల్లో లావాదేవీలు సాగించి, భారీ మొత్తాలు ఆర్జించినట్లు నిర్ధారించింది. దీనిపై సెబి దర్యాప్తును కొనసాగిస్తోంది. ఈ సంస్థ రూ.4,843 కోట్ల సొమ్మును జరిమానాగా చెల్లించాలని సెబి ఆదేశిం చింది. దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలో సెబి ఇంత పెద్ద మొత్తాన్ని పెనాల్టీ రూపంలో రాబట్టాలని నిర్ణయించడం ఇదే ప్రథమం.

## ఒక్క బిట్‌కాయిన్..రూ.కోటి నాలుగు లక్షలు!

**న్యూఢిల్లీ, జూలై 14:** పర్సనల్ ఫైనాన్సింగ్ కేటగిరీలో బిట్ కాయిన్ సరికొత్త పెట్టుబడి ఎంపికగా మారిపోయింది. దీంతో క్రిప్టో కాయిన్ రేటు తన సుదీర్ఘ ప్రయాణంలో లక్ష20వేల డాలర్ల జీవితకాల గరిష్టాలకు చేరుకుంది. అయితే ఇన్వెస్టర్లలో వచ్చిన అవగాహన, క్రిప్టోల వైపు వారి అడుగులు పెద్ద మార్పుగా పరిగణిస్తున్నట్లు ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజీ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు ఇంట్రాడే ట్రేడింగ్ కోసం క్రిప్టోల్లోకి వచ్చిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం దానిని ఒక వ్యూహాత్మక దీర్ఘకాలిక అసెట్ క్లాస్ కింద పరిగణిస్తున్నట్లు వాలెట్ చేరికల్లో పెరుగుదల సూచిస్తోందని క్రిప్టో ఎక్స్ఛేంజీ వెల్లడించింది. ప్రస్తుతం వచ్చిన మార్పులు బిట్ కాయిన్ వేగంగా సంపద సృష్టికి పునాది స్తంభంగా మారుతుందనే లోతైన మార్కెట్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఇటీవల బిట్ కాయిన్ తన టెక్నికల్ రెసిస్టెన్స్ లెవెల్



ప్రపంచంలో సుస్థిరంగా ముందుకు సాగుతుందని కూడా భావిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లలో ఉండే అనుమానం బిట్‌కాయిన్ ర్యాలీ ఇంకెంత వరకు చేరుకుంటుంది అన్నదు. దీనికి జియోటస్ సిఇఒ విక్రమ్ సుబ్బురాజ్ అంచనాలను చూస్తే ఇకపై బిట్‌కాయిన్ లక్షా10వేల డాలర్ల మార్కును అధిగమించడం మరింత ర్యాలీకి కారణంగా మారింది. దీనికి తోడు ఎథెరియం, సోలానా, కార్డానో,సుయి వంటి ఇతర కాయిన్స్ కూడా క్రిప్టో ఇన్వెస్టర్ల నుంచి మంచి ఆదరణను పొందుతున్నాయి. డేటా ప్రకారం ఈ యేడాది బలమైన ట్రెండ్ కొనసాగే అవకాశంఉందని ఊహించబడింది. ఈ క్రమంలో చిన్న చిన్న ఒడుదుడుకులు ఉన్నప్పటికీ క్రిప్టోల ప్రాభల్యం పెట్టుబడుల ధర లక్షా35వేల డాలర్ల రేటు వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో క్రిప్టో ఇటిఎఫ్ పెట్టుబడులు పెరిగితే ఒక్కో బిట్‌కాయిన్ రేటు ఏకంగా లక్షా50వేల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉందని కూడా విక్రమ్ చెబుతున్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 14:** దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ట్రేడ్ వార్ భయాలు సూచీలను పడేశాయి. యూరోపియన్ యూనియన్, మెక్సికోపై ఆగస్టు 1 నుంచి 30 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించడం ఇందుకు కారణం. దీనికి తోడు త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడం మరో కారణం. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఈ క్రమంలోనే నిఫ్టీ 25,100 దిగువకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు రాణించడం విశేషం. సెన్సెక్స్ ఉదయం 82,537.87 పాయింట్ల వద్ద స్వల్పలాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా అదే ఒరవడి



కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.38 వద్ద కనిష్ఠాన్ని తాకినసూచీ.. చివరికి247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.55 పాయింట్ల నష్టంతో 25,082.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఏషియన్ పెయింట్స్, టెక్‌మహీంద్రా, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటర్నల్, టైటాన్, సన్‌ఫార్మా, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.44 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,385 డాలర్ల వద్ద ట్రేడయింది.

## ఓలా ఎలక్ట్రిక్ నష్టం రూ.428కోట్లు

**ముంబై, జూలై 14:** ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.428 కోట్ల నికర నష్టాన్ని కంపెనీ నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.347 కోట్లతో పోలిస్తే నష్టం మరింత పెరిగింది. అయినప్పటికీ కంపెనీ షేర్లు రాణిస్తుండడం గమనార్హం. ఓలా నష్టాలు పెరిగినప్పటికీ.. లాభదాయకత దిశగా కంపెనీ అడుగులు వేస్తోందన్న సంకేతాలు స్టాక్‌లో పాజిటివ్ రియాక్షన్‌కు కారణమైంది. ఓలా ఎలక్ట్రిక్ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1644 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది ఆ మొత్తం రూ.828 కోట్లకు తగ్గింది. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో (క్యూ4) పోలిస్తే ఈ మొత్తం పెరగడం ఓలా షేర్ల పెరుగుదలకు మరో కారణం. గత త్రైమాసికంలో రూ.611 కోట్లుగా ఉన్న ఆదాయం జూన్‌తో (క్యూ1) ముగిసిన త్రైమాసికానికి 35.5 శాతానికి పెరిగింది. క్యూ4లో 51,375 యూనిట్లను విక్రయించిన ఓలా, సమీక్షా త్రైమాసికంలో 68,192 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది. జూన్ నెలలో పాజిటివ్ ఎబీటా సాధించినట్లు కంపెనీ తెలిపింది. ప్రాజెక్ట్ లక్ష్యలో భాగంగా చేపట్టిన చర్యల వల్ల నిర్వహణ ఖర్చులు నెలకు రూ.178 కోట్ల నుంచి రూ.105 కోట్లకు తగ్గుముఖం పట్టాయని ఓలా పేర్కొంది. మొత్తం ఖర్చులు నెలకు రూ.150 కోట్లుగా ఉండగా.. రూ.130 కోట్లకు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.25 లక్షల నుంచి 3.75 లక్షల వావానాలను విక్రయించాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని, తద్వారా రూ.4200 రూ.4700 కోట్ల ఆదాయం సమకూరుతుతుందని పేర్కొంది. క్యూ2 నుంచి తమ జనరేషన్3 స్కూటర్లకు పీఎల్‌ఐ ప్రయోజనాలు అందుతాయని, తద్వారా స్థూల మార్జిన్లు 3540 శాతం మేర పెరుగుతాయని అంచనా వేస్తోంది. పూర్తి ఏడాదికి 5 శాతం ఎబీటా సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమ్ముడవుతున్న మొత్తం వాహనాల్లో జనరేషన్3 మోడళ్లే 80 శాతం వరకు ఉంటున్నాయని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్ల వల్ల మార్జిన్లు పెరగడంతో పాటు వారెంటీ క్లెయిమ్‌లు కూడా తగ్గుముఖం పడతాయని తెలిపింది. 200స్టోర్లలో ప్రస్తుతం రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్ సైకిల్ లభిస్తోంది.




# వాణిజ్యం

## ఎన్‌ఎస్‌ఇకి గ్లోబల్ 4 ర్యాంక్

**ముంబై, జూన్ 14:** ఈ యేడాది తొలి అర్ధభాగంలో ఐపిఒ నిధుల సేకరణలో గ్లోబల్‌లోనే ఎన్‌ఎస్‌ఇ 4వ స్థానాన్ని దక్కించుకుంది. ఎస్‌అండ్‌పి గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ నిధుల సేకరణలో 5.51 బిలియన్ డాలర్లను అందించింది. ఎన్‌ఎస్‌ఇ యొక్కఅద్భుతమైన ప్రదర్శన నాస్‌డాక్ గ్లోబల్ మార్కెట్, ఎన్వైఎస్‌ఇ, నాస్‌డాక్ గ్లోబల్ సెలెక్ట్ మార్కెట్ల కంటే కొంచెం వెనకబడి ఉంది. ఇవి అమెరికాకు చెందిన 3 ఎక్స్ఛేంజీలు, ఇవి మొదటి అర్ధభాగం-25లో సమిష్టిగా 28.95 బిలియన్ డాలర్లను సేకరించాయి. ఇది ప్రపంచ మొత్తంలో 46.73శాతం ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే ఐపిఒల సంఖ్యపరంగా, ఎన్‌ఎస్‌ఇ ఈ కాలంలో 73ఐపిఒలను నిర్వహించడం ద్వారా అన్ని




గ్లోబల్ ఎక్స్ఛేంజీలను అధిగమించింది. నాస్‌డాక్ గ్లోబల్‌యొక్క 66ని అధిగమించింది. ఎన్‌ఎస్‌ఇ యొక్క ప్రపంచ ర్యాంక్ దాటి, భారతదేశం యొక్క మొత్తం ఐపిఒ కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. 2న25 మొదటి ఆరు నెలల్లో భారతీయ ఎక్స్ఛేంజీలలో మొత్తం 119 ఐపిఒలు ప్రారంభించబడ్డాయి. సమిష్టిగా 51,150 కోట్లు సేకరించాయి. 2024 ఇదే కాలంలో 157 లిస్టింగ్‌ల నుంచి వచ్చిన 37,682 కోట్లతో పోలిస్తే, సేకరించిన మూలధనంలో ఇది సంవత్సరానికి గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. లిస్టింగ్‌ల సంఖ్య కొద్దిగా తగ్గినప్పటికీ, సేకరించిన నిధుల పెరుగుదల పెద్ద ఆఫర్‌ల ఉనికిని, పెరిగిన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూపిస్తుంది. ముఖ్యంగా ఎన్‌ఎస్‌ఇ ద్వారా, దేశ ఆర్థిక స్థితిస్థాపకతను మాత్రమే కాకుండా ప్రపంచ పెట్టుబడి దృశ్యంలో దాని పెరుగుతున్న ప్రాముఖ్యతను కూడా ప్రతిబింబిస్తుంది. భారతీయ ఈక్విటీల పట్ల పెట్టుబడిదారుల ఆకలి బలపడడం, దేశ మూలధన మార్కెట్లు అభివృద్ధి చెందుతున్నప్పుడు, భారతదేశం ప్రపంచంలోని ప్రముఖ ఐపిఒ గమ్యస్థానాలలో తన స్థానాన్ని కొనసాగించే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.